www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 23-2-2026 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 348 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: షష్ఠి ఉ.9:09 తదుపరి సప్తమి, నక్షత్రం: భరణి సా.4:34 తదుపరి కృత్తిక, వర్జ్యం: తె. 3:50-5:20, దుర్ముహూర్తం: మ.12:51-1:38, మ.3:10-3:57, అమృతఘడియలు: మ.12:02-1:32, రాహుకాలం: ఉ. 7.30-9.00, సూర్యోదయం: 6:41, సూర్యాస్తమయం: 6:16 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఏమిటీ 'నగ్న' రాజకీయం!

ఇప్పటికే నిస్సిగ్గుగా ఉన్నారు.. ఇంకా చొక్కాలు విప్పడమెందుకో?

ఏఐ సదస్సు వద్ద కాంగ్రెస్ కార్యకర్తల తీరుపై మోదీ ఆగ్రహం

ఆ పార్టీ సైద్ధాంతిక దివాలాకోరుతనానికి నిదర్శనమిది

పురాతన పార్టీ పతనమైంది.. సొంత దేశాన్నే అప్రతిష్ఠపాల్జేస్తోంది

కాంగ్రెస్ నేతలు నన్ను ద్వేషిస్తున్నారు.. సమాధి తవ్వాలని చూస్తున్నారు

చివరికి నా తల్లినీ అవమానిస్తున్నారు.. మీరట్ సభలో మోదీ ధ్వజం



2

ప్రతి ఇంటికీ హైస్పీడ్ నెట్



ఏడాదిన్నరలో అందించేందుకు చర్యలు: సీఎం

గ్రామాల్లో డిజిటల్ కనెక్టివిటీని పెంచేలా భారత్ నెట్‌తో ఒప్పందం

13,426 గ్రామాల్లో అమలు

రాష్ట్రంలో 'వన్ ఫ్యామిలీ - వన్ ఏఐ ఎక్స్‌పర్ట్' విధానం

ఏఐతో ఉద్యోగాల కల్పనకు యువతలో నైపుణ్యాలు

కేంద్ర సాయంతో ఫైబర్‌నెట్ కనెక్షన్లు పెంచుతాం

సీఎం చంద్రబాబు వెల్లడి



ఆదివారం సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, పెమ్మసాని సమక్షంలో ఒప్పంద పత్రాలతో స్పెషల్ సీఎస్ కృష్ణబాబు, డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా

అమరావతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏడాదిన్నరలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. టెలికాం రంగంలో వినూత్న ప్రయోగాలకు రాష్ట్రం కేంద్రంగా ఉంటుందని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో డిజిటల్ కనెక్టివిటీని పెంచేలా భారత్ నెట్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర కమ్యూనికేషన్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సమక్షంలో భారత్ నెట్ ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఎంవోయూపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మౌలిక సదుపాయల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా ఐదు లక్షల గ్రామాల్లోని

మిగతా 3వ పేజీలో...

అభివృద్ధి పరుగు

ప్రజలందరికీ సంక్షేమం అందిస్తున్నాం: సీఎం

గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి

ప్రజారాజధాని అమరావతినీ పూర్తిచేసి రాష్ట్ర ప్రజలకు కానుకగా ఇస్తాం

కేంద్ర, రాష్ట్రాలు చేసే మంచిని గ్రామీణ డాక్ సేవకులే జనంలోకి తీసుకెళ్లాలి

తపాలా సేవలకు సాటి లేదు

గుంటూరు సమ్మేళనంలో సీఎం చంద్రబాబు

11



తిరుమలలో అత్యాధునిక

ఫుడ్ ల్యాబ్

నెయ్యి కల్తీకి చెక్ పెట్టేలా ప్రభుత్వ నిర్ణయం

రూ.25 కోట్ల ఎఫ్ఎస్ఎస్ఏఐ నిధులతో ఏర్పాటు

మార్చి నుంచి ల్యాబ్ సేవలు అందుబాటులోకి

ఫ్రాన్స్ నుంచి 'ఈ-టంగ్.. ఈ-నోస్' మిషన్లు

200 రకాల అవశేషాలను గుర్తించే సామర్థ్యం

అమరావతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం తయారీకి వాడిన నెయ్యిలో కల్తీ జరిగిన వ్యవహారం తీవ్ర విమర్శలకు కారణమైంది. ఈ నేపథ్యంలో కల్తీకి అడ్డుకట్ట వేసేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తిరుమలలో అత్యాధునిక ఫుడ్ ల్యాబరేటరీ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నామని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదివారం ప్రకటించారు. భక్తులకు

మిగతా 11వ పేజీలో...

అసెంబ్లీలో 'కల్తీ నెయ్యి'పై చర్చ!

గత ప్రభుత్వ పాపాలను ప్రజలకు వివరించే యోచనలో సర్కారు

ప్రజల దృష్టి మరల్చేందుకు మండలిలో వైసీపీ ఎత్తులు

11

వాటికి చెక్ పెట్టేలా కల్తీ నెయ్యిపై చర్చకు నిర్ణయం



అన్నిట్లో ఆయనే!

కీలక కేసుల రిపోర్టుల్లో అజేయ కల్లంరెడ్డి ప్రస్తావన

ఢిల్లీ ఏపీ భవన్‌లో స్పెషల్ లైజనింగ్ అధికారిగా చిన్నప్పన్న పోస్టింగ్‌కు నాడు సిఫారసు లేఖ జారీ

తిరుమల కల్తీ నెయ్యి కేసులో నిందితుడు అప్పన్న

బేవరేజెస్ కార్పొరేషన్‌లో ఎండీగా వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌లకు పోస్టింగ్‌లకూ లేఖలు

3,500 కోట్ల లిక్కర్ స్కామ్‌లో ఏ2, ఏ3లు వారే

నాటి ముఖ్యమంత్రి జగన్ ప్రిన్సిపల్ అడ్వైజర్ హోదాలో అజేయ కల్లం సిఫారసు లేఖలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అజేయ కల్లంరెడ్డి.. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి. నాటి వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు నమ్మినబంటు. ఆయనకు ప్రిన్సిపల్ అడ్వైజర్‌గా పనిచేశారు. ఇప్పుడు ఎక్కడ విన్నా ఆయన పేరే. ఏ కేసు గురించి విన్నా అందులో ఆయన ప్రస్తావనే. ఏ రిమాండ్ రిపోర్టు చూసినా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆయన నామస్మరణే. ఆయన లేఖలు, సిఫారసుల కలకలమే. 2019-2024లో నాటి ముఖ్యమంత్రి మనోభీష్టాలను

మిగతా 12వ పేజీలో...

- చిన్నప్పన్న, వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్.. వీరి గురించి మన రాష్ట్రంలో చాలా మందికి తెలిసే ఉంటుంది. ఈ ముగ్గురి పేర్లూ తరచూ వార్తల్లో నిలుస్తున్నాయి.
- టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న తిరుమల కల్తీ నెయ్యి కేసులో కీలక నిందితుడు. గత ప్రభుత్వంలో ఏపీ భవన్‌లో స్పెషల్ లైజనింగ్ అధికారిగా ఉంటూ తిరుమల వ్యవహారాల్లో చక్రం తిప్పాడు.
- నాటి బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి, ప్రత్యేక అధికారి సత్యప్రసాద్‌లు రూ.3,500 కోట్ల లిక్కర్ స్కామ్‌లో ఏ2, ఏ3 నిందితులు.
- ఏపీ భవన్‌లో స్పెషల్ లైజనింగ్ అధికారిగా చిన్నప్పన్నను, బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా వాసుదేవరెడ్డిని, కార్పొరేషన్ ప్రత్యేక అధికారిగా సత్యప్రసాద్‌ను నియమించాలని సిఫారసు లేఖలు రాసింది ఒక్కరే. ఆయనే.. నాటి ముఖ్యమంత్రి జగన్ ప్రిన్సిపల్ అడ్వైజర్ అజేయ కల్లంరెడ్డి. సీబీఐ, సిట్ దర్యాప్తులో ఈ విషయం బయటపడింది.
- వివేకా హత్య కేసులో అజేయ కల్లం నుంచి సీబీఐ విట్‌నెస్ స్టేట్‌మెంట్ తీసుకుంది. ఇదే తరహాలో తిరుమల కల్తీ నెయ్యి కేసు, లిక్కర్ కేసులోనూ అజేయ కల్లం స్టేట్‌మెంట్ తీసుకుంటారా?

ఏకసభ్య కమిటీపై సుప్రీంకు స్వామి!

నేడు విచారించనున్న సీజేఐ ధర్మాసనం

11

అఫ్ఘాన్‌లో పాక్ వైమానిక దాడులు

తెహ్రీక్ ఏ తాలిబాన్, ఐఎస్ స్థావరాలపై బాంబులు

ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మృతి

2

70 మంది ఉగ్రవాదులను చంపేసినట్లు పాక్ ప్రకటన

ప్రతీకారం తప్పదు: తాలిబాన్లు

జమ్మూకశ్మీర్‌లో ముగ్గురు ఉగ్రవాదుల హతం

మృతుల్లో జైషే మహమ్మద్ కమాండర్ సైఫుల్లా?

2

కిష్త్వాడ్ జిల్లాలో ఘటన

కర్నూలులో 37 డిగ్రీలు

11

దేశంలోనే అత్యధిక గరిష్ఠ ఉష్ణోగ్రత

రాష్ట్రంలో కొనసాగుతున్న ఎండ తీవ్రత

అరగంట ముందే పరీక్షా కేంద్రానికి!

నేటి నుంచే ఇంటర్ పరీక్షలు

రాష్ట్ర వ్యాప్తంగా 1,537 పరీక్షా కేంద్రాలు

3

పరీక్షలు రాయనున్న 10.57 లక్షల మంది విద్యార్థులు

దేవ్‌జీ లొంగుబాటు!

మావోయిస్టు అగ్రనేతతో పాటు రాజిరెడ్డి సహా 25 మంది కూడా..

తెలంగాణ పోలీసులకు లొంగిపోయారు

ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం వెల్లడి

నేడో, రేపో తెలంగాణ పోలీసుల ప్రకటన

సీఎం రేవంత్ సమక్షంలో లొంగుబాటును చూపే అవకాశం!



తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ (ఫైల్)

హైదరాబాద్/కోరుట్ల/మంథని, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. రాష్ట్ర కమిటీ సభ్యుడైన నర్సింహారెడ్డితో పాటు మొత్తం 25 మంది ప్రత్యేక ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ లొంగుబాటును తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి నిర్ధారించారు. దేవ్‌జీతో పాటు మరికొందరు మావోయిస్టులు తెలంగాణ పోలీసులకు లొంగిపోయారని ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం

మిగతా 2వ పేజీలో...

వాణిజ్య ఒప్పంద చర్చలు వాయిదా



ట్రంప్ సుంకాల్లో మార్పుల నేపథ్యంలోనే..

పరిణామాలను సమీక్షించిన అనంతరం అమెరికా, భారత్ ఉన్నతాధికారుల భేటీ

ఈ 15% సుంకాలకూ చట్టబద్ధత ఎక్కడ?

ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా వాదించిన లాయర్ నీల్ కత్యాల్ మండిపాటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: భారత్-అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన చర్చలు వాయిదా పడ్డాయి. ఇటీవలే ఒప్పందానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌పై ఇరు దేశాలు సంయుక్త ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. ఒప్పందంలోని అంశాలకు తుది మెరుగులు దిద్ది మార్చి మూడో వారానికల్లా సంతకాలు జరిగేలా ఇరుదేశాలు చర్యలు చేపట్టాయి. దీనికి సంబంధించి సోమవారం (23న) నుంచి మూడు రోజులపాటు అమెరికాలోని వాషింగ్టన్‌లో ఇరు దేశాల ఉన్నతాధికారుల బృందాల

మిగతా 2వ పేజీలో...

బస్సుల కోసం బెంగళూరు!



తగినన్ని ఆర్టీసీ సర్వీసులు లేకపోవడంతో కడప-మదనపల్లె-బెంగళూరు బస్సు టాప్ ఎక్కి ప్రయాణిస్తున్న దృశ్యం

'ప్రజా ప్రయోజనం' పేరుతో సామాజిక మాధ్యమాల్లో పోరాటం

12

ఆర్టీసీ సర్వీసులు పెంచాలంటూ డిమాండ్

ప్రైవేటులో ప్రయాణాలపై ప్రయాణికుల్లో గుబులు

సరిహద్దుల్లో సమస్య మరింత తీవ్రం

వాణిజ్య ఒప్పందం చర్చలు వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

మధ్య చర్చలు జరగాల్సి ఉంది. కానీ ట్రంప్ అదనపు సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేయడం, దీనితో ఇతర చట్టాల కింద ప్రపంచ దేశాలపై 15శాతం సుంకాలు విధిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించడం నేపథ్యంలో.. వాణిజ్య ఒప్పందంపై చర్చలను వాయిదా వేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుత పరిణామాలను సమీక్షించిన అనంతరం చర్చలు తిరిగి ఎప్పుడు జరిగేదీ నిర్ణయించనున్నట్టు వెల్లడించాయి. కాగా, అమెరికా సుప్రీంకోర్టు అదనపు సుంకాలను రద్దు చేయడంతో ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ మరో చట్టం కింద ప్రపంచ దేశాలపై 15శాతం సుంకాలను విధించడాన్ని న్యాయవాది నీల్ కత్యాల్ తప్పుబట్టారు. ట్రంప్ అదనపు సుంకాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో వాదించి, గెలిచిన ఆయన... ఈ 15శాతం సుంకాలకు చట్టబద్ధత ఎక్కడ ఉందని, చట్టసభలను తోసి రాజని అధ్యక్షుడు ఏకపక్షంగా వ్యవహరించలేరని పేర్కొన్నారు.

ట్రంప్ రిసార్ట్‌లోకి తుపాకీతో యువకుడు

» కాల్చి చంపేసిన భద్రతా సిబ్బంది

వాషింగ్టన్, ఫిబ్రవరి 22: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతి వారాంతంలో విశ్రాంతి కోసం వెళ్లే 'మార్ ఏ లాగో' రిసార్ట్‌లోకి చొరబడిన సాయుధ దుండగుడిని భద్రతా బలగాలు కాల్చిచంపాయి. అమెరికా కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. 20-22 ఏళ్ల మధ్య వయసున్న యువకుడు ఒక ఎల్పీజీ గ్యాస్ క్యాన్, షాట్ గన్‌తో నార్త్ కరోలినాలోని 'మార్ ఏ లాగో' రిసార్టులోకి ప్రవేశించాడని.. లొంగిపొమ్మని హెచ్చరించినా తమపై తుపాకీ గురిపెట్టడంతో కాల్పులు జరపాల్సి వచ్చిందని సీక్రెట్ సర్వీస్ విభాగం ప్రతినిధి ఆంథోనీ గుగ్లీయెల్మీ తెలిపారు. సదరు వ్యక్తి కనిపించడం లేదని అతడి కుటుంబం కొన్ని రోజుల క్రితమే పోలీసులకు ఫిర్యాదు చేసిందని గుర్తించామని చెప్పారు. కాగా, ట్రంప్‌పై గతంలో తన వెస్ట్‌పామ్ బీచ్ క్లబ్‌లో ఒకసారి, అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో మరోసారి హత్యా ప్రయత్నాలు జరిగాయి.

స్వామి అవిముక్తేశ్వరానందపై పోక్సో కేసు

» ఇద్దరు బాలురపై లైంగిక వేధింపులు



లఖ్‌నవూ, ఫిబ్రవరి 22: బాలురను లైంగికంగా వేధించారన్న ఆరోపణలతో స్వామి అవిముక్తేశ్వరానందపై ప్రయాగ్‌రాజ్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఆయన శిష్యుడు ముకుందానంద బ్రహ్మచారి, మరో ఇద్దరు ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులపైనా ఇదే కేసు పెట్టారు. ఒక మైనర్ సహా ఇద్దరు బాలురపై గత ఏడాదిగా లైంగిక దాడి చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. మాఘమేళా ఉత్సవంలోనూ లైంగికదాడి జరిగిందని ఆరోపించారు. ప్రయాగ్‌రాజ్‌లోని పోక్సో కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు శనివారం రాత్రి ఝున్సీ పోలీసు స్టేషన్ అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. స్వామి రామభద్రాచార్య శిష్యుడు అశుతోష్ బ్రహ్మచారి మహరాజ్, మరికొందరు చేసిన ఫిర్యాదు మేరకు పోక్సో కోర్టు ఆ ఆదేశాలు ఇచ్చింది. గురుసేవ పేరుతో గురుకులంలోను, మాఘమేళాలోనూ పలుమార్లు లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై అవిముక్తేశ్వరానంద మాట్లాడుతూ ఇది తప్పుడు కేసని, బాధ్యులకు శిక్ష పడాలని అన్నారు.

పాస్‌పోర్ట్ సేవలకు అంతర్జాతీయ టోల్‌ఫ్రీ నంబరు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: విదేశాల్లో నివసించే భారత పౌరులకు కేంద్ర ప్రభుత్వం త్వరలో శుభవార్తను అందించనుంది. వీరికి అవసరమైన పాస్‌పోర్టు సేవలను అందించడానికి అంతర్జాతీయ టోల్‌ఫ్రీ నంబరును ప్రవేశపెట్టడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ పథకం కింద విదేశాల్లో ఉంటున్న ఏ భారతీయ పౌరుడైనా మన దేశంలోని పాస్‌పోర్టు సేవా కేంద్రానికి ఎటువంటి కాల్ చార్జీలు లేకుండా నేరుగా కనెక్ట్ అయ్యే అవకాశం ఉంటుంది. దీనికోసం ప్రత్యేకంగా ఒక నంబరును అందుబాటులోకి తీసుకురానున్నారు. దీనికోసం అర్హత కలిగిన టెలికాం ఆపరేటర్ల నుంచి బిడ్లను ఆహ్వానిస్తూ ఆ శాఖ ప్రకటన జారీ చేసింది.

మార్చి 31లోగా 500 చార్జిషీట్లు దాఖలు చేయాలి

» పెండింగ్ కేసులపై అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించిన ఈడీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మనీ లాండరింగ్ కేసుల్లో 500 చార్జిషీట్లు దాఖలు చేయాలని ఈడీ లక్ష్యంగా పెట్టుకుంది. కేసు రిజిస్టర్ అయిన తర్వాత ఏడాది లేదా రెండేళ్లలో విచారణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్టు ఆదివారం ఈడీ వెల్లడించింది. సంక్లిష్ట అంశాలతో కూడిన కేసులకు ఈ గడువు నుంచి మినహాయింపు ఉంటుందని స్పష్టం చేసింది. గతేడాది డిసెంబరు 19-21 తేదీల్లో అసోం రాజధాని గువహటిలో ఈడీ డైరెక్టర్ రాహుల్ నవీన్ అధ్యక్షతన జరిగిన జోనల్ ఆఫీసర్ల త్రైమాసిక సదస్సులో దీనిపై చర్చించి, ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. "పెండింగ్ కేసులను పూర్తి చేసేందుకు సరికొత్త లక్ష్యాలు, కాలపరిమితి విధించాం. దర్యాప్తు అధికారులకు అవసరమైన అధికారాలు ఇచ్చాం. సవాల్‌గా మారుతున్న డిజిటల్ అరెస్టు, సైబర్ నేరాలు, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్ వంటి కేసులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించాం"అని ఈడీ వెల్లడించింది.

తేజస్‌ల డెలివరీపై హాల్‌కు కొన్ని వెసులుబాట్లు

బెంగళూరు, ఫిబ్రవరి 22: తేజస్ ఎంకే1ఏ యుద్ధ విమానాలు త్వరగా డెలివరీ అయ్యేలా భారత వైమానిక దళం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఫైటర్ జెట్లను తయారు చేస్తున్న హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్)కు ఐఏఎఫ్ కొన్ని ఒప్పంద మినహాయింపులు మంజూరు చేసింది. ఇంజన్ సరఫరాలో జాప్యం, ఇతర సాంకేతిక ఇబ్బందుల వల్ల తేజస్‌ల డెలివరీ ఆలస్యం కావడంతో.. కీలకమైన ఆయుధ పరీక్షలు, రాడార్ ఏర్పాటు పూర్తయిన తర్వాత మిగిలిన చిన్న చిన్న పనులను వచ్చే ఏడాది పూర్తిచేసే షరతుతో ఐఏఎఫ్ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే.. ఈ యుద్ధ విమానాల్లో అతి ముఖ్యమైన మిసైల్ ఫైరింగ్, రాడార్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్‌ల అనుసంధానం, ఆయుధ ప్యాకేజీ వంటి మూడు పనులను మాత్రం ముందే పూర్తిచేయాలని ఐఏఎఫ్ స్పష్టం చేసింది. దీంతో తేజస్ ఎంకే1ఏ యుద్ధ విమానాలను త్వరగా డెలివరీ చేయడానికి హాల్‌కు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, భారత వాయుసేన మరో తేజస్ యుద్ధ విమానాన్ని కోల్పోయింది. శిక్షణ కోసం వినియోగిస్తున్న ఓ తేజస్ విమానం ఆదివారం కుప్పకూలింది. ఈ ఘటనలో పైలట్ ప్రాణాలతో బయటపడ్డారు.

జమ్మూకశ్మీర్‌లో ముగ్గురు ఉగ్రవాదుల హతం

శ్రీనగర్, ఫిబ్రవరి 22: జమ్మూకశ్మీర్‌లోని కిస్త్వాడ్ జిల్లాలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు మరణించారు. వారు పాకిస్థాన్‌కు చెందిన జైష్ ఎ మహమ్మద్ తరఫున పనిచేస్తున్నారని భద్రతాబలగాలు గుర్తించాయి. మంచుతో నిండిన ఛత్రూ అడవుల్లో ఓ కొండ దిగువన మట్టి ఇంట్లో ఉగ్రవాదులు ఉన్నారన్న కచ్చితంగా సమాచారం అందుకున్న భద్రతాబలగాలు ఆపరేషన్ ట్రాషి-ఐ పేరుతో అత్యంత సాహసంతో గాలింపు చేపట్టాయి.

ఉక్రెయిన్ దాడులతో మాస్కోలో ఎయిర్‌పోర్టుల మూత

మాస్కో, ఫిబ్రవరి 22: ఉక్రెయిన్ డ్రోన్ దాడుల నేపథ్యంలో రష్యా రాజధాని మాస్కోలోని నాలుగు అంతర్జాతీయ విమానాశ్రయాలను ఆదివారం తాత్కాలికంగా మూసివేశారు. భద్రతా కారణాల దృష్ట్యా ఈ విమానాశ్రయాల్లో విమాన రాకపోకలపై ఆంక్షలు విధిస్తున్నట్లు రష్యా ప్రకటించింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి అమల్లోకి వచ్చిన ఈ ఆంక్షలు తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగుతాయని తెలిపింది.

ఇరాన్‌లో మళ్లీ విద్యార్థుల ఆందోళన

టెహ్రాన్, ఫిబ్రవరి 22: ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు మరోసారి ఆందోళనకు దిగారు. గత నెలలో జరిగిన ఆందోళనను ప్రభుత్వం అణచివేయడంతో సద్దుమణిగినట్టు కనిపించినా శనివారం మళ్లీ మతపాలకులకు నిరసన తెలుపుతూ వీధుల్లోకి వచ్చారు. టెహ్రాన్‌లోని షరీఫ్ ఇంజినీరింగ్ యూనివర్సిటీ విద్యార్థులు 'బి షరఫ్' (సిగ్గుచేటు) అంటూ నినదిస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమెనెయ్‌ను 'హంతక నేత'గా అభివర్ణించారు. టెహ్రాన్‌లోని బెహెస్తీ, అమిర్ కబీర్ విశ్వవిద్యాలయాల విద్యార్థులు కూడా ఆందోళనకు దిగారు. నిరసనలకు కేంద్రస్థానంగా ఉన్న అబ్దానన్ పట్టణంలో విద్యార్థులు 'నియంతకు మరణం' అంటూ నినదించారు. ఆందోళనలో పాల్గొన్న టీచరును అరెస్టు చేయడంతో సుప్రీంలీడర్‌కు వ్యతిరేకంగా ర్యాలీ జరిపారు.

దేవ్‌జీ లొంగుబాటు!



దేవ్‌జీ

(మొదటి పేజీ తరువాయి)

కూడా చెప్పారు. మావోయిస్టు పార్టీకి చెందిన కేంద్ర, రాష్ట్ర కమిటీల్లో తెలంగాణ వ్యక్తులు 15 మంది ఉన్నారని.. వారంతా లొంగిపోవాలని ఇటీవల రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి సూచించారు. వాస్తవానికి మల్లోజుల లొంగుబాటు తర్వాత వరసగా వివిధ స్థాయిల్లో ఉన్న మావోయిస్టు క్యాడర్ లొంగుబాటుకు తెలంగాణను వేదికగా చేసుకున్నారు. ఇదే క్రమంలో గత కొన్నాళ్లుగా కరీంనగర్‌కు చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, రాజిరెడ్డిల లొంగుబాటుకు సానుకూల వాతావరణం కల్పించాలని ప్రజాసంఘాల నేతలు, మేధావులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇటీవల ఆపరేషన్ కర్రెగుట్టల పేరిట వేలాది సాయుధ బలగాలను రంగంలో దింపి కేంద్రం మరోసారి మావోయిస్టుల మీద తీవ్ర ఒత్తిడి తెచ్చింది. దీంతో ప్రాణహాని లేకుండా చూస్తే లొంగిపోవడానికి సిద్ధంగా ఉన్నామనే సంకేతాలు దేవ్‌జీ తదితరుల నుంచి వచ్చినట్లు తెలుస్తోంది. హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో పట్టుబడిన మావోయిస్టుల్లో దేవ్‌జీ అంగరక్షకులు నలుగురు ఉండడం అనుమానాలకు తావిచ్చింది. ఆయన కదలికల సమాచారం నిఘా వర్గాలకు ఎప్పటికప్పుడు అందుతుందనే అనుమానాలు దీంతో బలపడ్డాయి. కాగా, మావోయిస్టుల లొంగుబాటును సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో చూపాలని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. దేవ్‌జీ లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ శకం ముగిసినట్లేనని ప్రజా సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. మరోవైపు మావోయిస్టు పార్టీ అగ్రనేత గణపతి ఆచూకీ ఇంకా లభించలేదని సమాచారం. ఆయన విదేశాలకు వెళ్లిపోయారనే ప్రచారం జరుగుతోంది.

దేవ్‌జీ ప్రస్థానం..

జగిత్యాల జిల్లా కోరుట్లలోని అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన తిప్పిరి వెంకట నర్సయ్య, గంగుబాయికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. వారిలో తిరుపతి పెద్ద కుమారుడు. తిరుపతి ఇంటర్మీడియట్ వరకు కోరుట్లలో చదువుకున్నారు. కరీంనగర్‌లో డిగ్రీ చదువుతున్న సమయంలో 1984లో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. క్రమంగా మావోయిస్టు దళ నాయకుడిగా ఎదిగారు. దేవ్‌జీకి ఆయుధాల తయారీలో దిట్ట అనే పేరుంది. మావోయిస్టు మహిళా నాయకురాలు, నల్లగొండ జిల్లాకు చెందిన సృజనను అజ్ఞాతంలో ఉన్నప్పుడే పెళ్లి చేసుకున్నారు. పోలీసు ఎన్‌కౌంటర్‌లో ఆమె మృతిచెందారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా తిప్పిరి తిరుపతి 2025 సెప్టెంబరులో నియమితులయ్యారు. ఇదిలా ఉండగా, పెదనాన్న దేవ్‌జీ తమకు కొండంత ధైర్యమని ఆయన తమ్ముడి కూతురు సుమ అన్నారు. అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలుస్తున్నాడన్న సమాచారంతో దేవ్‌జీ తమ్ముడు గంగాధర్, సుమ భావోద్వేగానికి లోనయ్యారు.



మల్లా రాజిరెడ్డి

మల్లా రాజిరెడ్డి లొంగుబాటు

మావోయిస్టు పార్టీ తొలితరం అగ్రనేత మల్లా రాజిరెడ్డి అలియాస్ సత్తన్న అలియాస్ సంగ్రామ్ పోలీసులకు లొంగిపోయారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని శాస్త్రులపల్లికి చెందిన రాజిరెడ్డి మంథనిలో ఇంటర్ చదువుతూ 1975లో పీపుల్స్‌వార్ అనుబంధ ఆర్ఎస్‌యూ ద్వారా విప్లవ రాజకీయాల్లో చేరారు. అనంతరం పీపుల్స్‌వార్ మంథని దళంలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లారు. దళ సభ్యుడిగా చేరిన రాజిరెడ్డి మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో స్థాయికి ఎదిగారు.

ఫలించిన తెలంగాణ పోలీసుల వ్యూహం

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్‌జీతోపాటు అతడి సైన్యాన్ని లొంగుబాటు దిశగా తీసుకువచ్చే అంశంలో తెలంగాణ పోలీసులు అనుసరించిన వ్యూహం ఫలించింది. మావోయిస్ట్ అగ్రనేతలు, వారి అనుచరులు పెద్ద సంఖ్యలో లొంగిపోయేందుకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ చీఫ్ సుమతి అనుసరించిన విధానాలు కేంద్ర హోం శాఖ ప్రశంసలు పొందాయి. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం రోజు సీఎం రేవంత్ రెడ్డి మావోయిస్టులు లొంగిపోయి జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. ఈ పిలుపు మావోయిస్టులకు అర్థమయ్యేలా తెలంగాణ పోలీసులు వ్యవహరించారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్‌కౌంటర్లు కొనసాగుతుండగా తెలంగాణ పోలీసులు మాత్రం సంయమనం పాటించారు. లొంగిపోయిన వారికి గుర్తింపు, డబ్బు, జీవనోపాధి కల్పించడం వంటి చర్యలు చేపడుతూ మావోయిస్టులను ఆకట్టుకున్నారు. దాని వల్లే ఒకేసారి ఇంతమంది మావోయిస్టులు లొంగిపోయారు.

గ్రాండ్ సక్సెస్ దిశగా ఆపరేషన్ కగార్

హైదరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): దేశంలో మావోయిస్టు ఉద్యమం అంతమైనట్లేనా? కేంద్రప్రభుత్వం విధించిన గడువు కంటే ముందే ఆపరేషన్ కగార్ విజయవంతమవుతోందా? అంటే అవుననే అంటున్నాయి పోలీసు వర్గాలు. కొన్ని దశాబ్దాలుగా జనతన సర్కార్ లాంటి సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టు పార్టీ ఇక ఉనికి కోల్పోయినట్లేనని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. మావోయిస్టు రహిత దేశం లక్ష్యంగా కేంద్రప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌కు ఈ ఏడాది మార్చి 31వ తేదీని డెడ్‌లైన్‌గా నిర్ణయించిన విషయం తెలిసిందే. మావోయిస్టు రహిత దేశం లక్ష్యంలో చివరి దశకు చేరుకున్నామని ఇటీవలే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. ఈ నెల మొదటి వారంలో రాయ్‌పూర్‌లో కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు, నిఘా విభాగాల ఉన్నతాధికారులతో ఆయన సమావేశమై అడవుల్లో మిగిలిన మావోయిస్టుల ఏరివేత విషయంలో స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఆ తర్వాత ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీ, ఒడిశా పోలీసులు మరో సంయుక్త ఆపరేషన్ ప్రారంభించి, నిఘా సమాచారాన్ని పంచుకుంటూ కీలక మావోయిస్టు నేత లోకేటి చందర్‌తో పాటు నలుగురిని ఎన్‌కౌంటర్ చేశారు. ఆ తర్వాత దేవ్‌జీ లక్ష్యంగా కర్రెగుట్టలపై కేంద్ర బలగాలను మోహరించి ఒత్తిడి పెంచారు.

బేస్ క్యాంపులతో విజయం

2019 నుంచి మావోయిస్టు పార్టీని టార్గెట్ చేసిన కేంద్రం.. పెద్ద ఎత్తున్న సీఆర్పీఎఫ్ దళాలను మోహరించి ప్రత్యేక ఆపరేషన్లు చేపట్టింది. సీఆర్పీఎఫ్‌లోని కోబ్రా దళాలు మావోయిస్టుల అడ్డాల్లో బేస్‌క్యాంపులు ఏర్పాటు చేసుకుని వేట కొనసాగించాయి. మొదటి దశలో 24 బేస్‌క్యాంపులను ఏర్పాటు చేసుకుని మావోయిస్టుల కదలికలకు చెక్ పెట్టారు. 2020లో బేస్‌క్యాంపుల సంఖ్యను 40కి పెంచారు. ప్రస్తుతం వ్యూహాత్మక ప్రాంతాల్లో 400 బేస్‌క్యాంపులు ఏర్పాటు చేసుకోవడం భద్రతా బలగాలు సాధించిన విజయంగా చెప్పవచ్చు. ఒక్కో క్యాంపులో 200-400 మంది సాయుధ పోలీసులు ఉంటారు. వీరి వద్ద అత్యాధునిక ఆయుధాలు ఉంటాయి. నైట్ విజన్ పరికరాలు, డ్రోన్లు వాడుతూ రాత్రివేళల్లో కూడా మావోయిస్టుల కదలికలను కట్టడి చేశారు. 2019 నాటికి తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్, బిహార్, మహారాష్ట్ర, ఒడిశా తదితర పది రాష్ట్రాల్లోని 61 జిల్లాల్లో మావోయిస్టు పార్టీ కార్యకలాపాలు జోరుగా సాగుతుండేవి. ప్రస్తుతం వారు పది జిల్లాలకే పరిమితమయ్యారు.



భారీ ఉగ్ర కుట్ర భగ్నం!

తమిళనాడు, బెంగాల్లో 8 మంది అరెస్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: దేశంలో భారీ ఉగ్ర కుట్రను పోలీసులు భగ్నం చేశారు. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ, బంగ్లాదేశ్ కేంద్రంగా పనిచేసే ఉగ్ర సంస్థల అండదండలతో ఢిల్లీలో విధ్వంసానికి ప్రణాళికలు రచించినట్లు అనుమానిస్తున్న 8మంది ఉగ్రవాదులను అరెస్టు చేసినట్లు పోలీసులు ఆదివారం వెల్లడించారు. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పాకిస్థాన్‌కు చెందిన ఉగ్ర సంస్థ లష్కరే తాయిబా పేలుళ్లకు కుట్ర పన్నిందన్న నిఘా వర్గాల సమాచారంతో భద్రతా సంస్థలు శనివారం అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. పక్కా సమాచారం, ఓ పోలీసుస్టేషన్‌లో నమోదైన ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు తమిళనాడులోని పలు ప్రాంతాలు, పశ్చిమబెంగాల్లో అధికారులు సోదాలు చేపట్టారు. శనివారం తమిళనాడులో ఆరుగురిని, అంతకముందు పశ్చిమబెంగాల్లో మరో ఇద్దరు అనుమానిత ఉగ్రవాదులను అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారణ నిమిత్తం ఢిల్లీకి తరలించారు. పట్టుబడిన వారిలో ఏడుగురు బంగ్లాదేశీయులు కాగా, ఒకరు పశ్చిమబెంగాల్‌లోని మాల్దాకు చెందిన వ్యక్తి అని పోలీసులు తెలిపారు. వీరంతా భారతదేశంలోకి చొరబడి, నకిలీ ఆధార్ కార్డులు సంపాదించారని చెప్పారు. నిందితులంతా సోషల్ మీడియా ద్వారా ఒకరితో ఒకరు టచ్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఈ 8మందిలో నలుగురు వ్యక్తుల గ్రూపు దేశ రాజధానిలో ఏఐ సదస్సు జరుగుతున్న సమయంలో ఢిల్లీ, కోల్‌కతాలకు వెళ్లి.. పలు చోట్ల 'ఫ్రీ కశ్మీర్, ఉగ్రవాది బుర్హాన్ ఫొటోలు ఉన్న పాకిస్థాన్, ఉగ్రవాద అనుకూల పోస్టర్లను అంటించి, తిరిగి తమిళనాడు, పశ్చిమబెంగాల్‌కు వెళ్లిపోయారని అధికారులు చెప్పారు. బంగ్లాదేశ్ నుంచి లష్కరే తాయిబా ఉగ్రవాది షబ్బీర్ అహ్మద్ ఆదేశాలతో పోస్టర్లు అంటించారని, ఇతను కశ్మీర్‌కు చెందిన వ్యక్తి అని తెలిపారు.

కృత్రిమ మేధ వినియోగంలో ఏఐ సదస్సు టర్నింగ్ పాయింట్

» మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: భవిష్యత్తులో కృత్రిమ మేధ(ఏఐ)ను ప్రపంచం ఎలా ఉపయోగించనుందనే విషయంలో భారతదేశం నిర్వహించిన ఐఏ ఇంపాక్ట్ సదస్సు ఒక టర్నింగ్ పాయింట్‌గా నిరూపణ అయ్యిందని ప్రధాని మోదీ తెలిపారు. మన ఆవిష్కరణలు ప్రపంచ నేతలను ఆకట్టుకున్నాయన్నారు. ప్రతినెలా చివరి ఆదివారం రేడియో ద్వారా నిర్వహించే మన్‌కీ బాత్ కార్యక్రమంలో మోదీ ప్రసంగించారు. సదస్సులో ప్రత్యేకించి రెండు ఆవిష్కరణలు ఎక్కువగా ఆకట్టుకున్నాయని చెప్పారు. వాటిలో ఒకటి అమూల్ కేంద్రం కాగా, మరొకటి భారత సంస్కృతి పరిరక్షణకు సంబంధించినదని తెలిపారు. జంతువుల చికిత్సలో కృత్రిమ మేధ ఎలా ఉపయోగపడుతోందో, తమ పశువులు ఎక్కడున్నాయో 24/7 ఏఐ అసిస్టెంట్ సాయంతో రైతులు ఎలా కనుగొంటున్నారనే విషయాలను అమూల్ బూత్‌లో చక్కగా వివరించారని మోదీ ప్రశంసించారు. అలాగే, నేటి తరానికి అందుబాటులో ఉండేలా భారత పురాతన గ్రంథాలు, పరిజ్ఞానం, రాతప్రతులను పరిరక్షించడంలో కృత్రిమ మేధ ఎలా ఉపయోగపడుతోందో చూసి ప్రపంచ నేతలు ఆశ్చర్యం వ్యక్తం చేశారని తెలిపారు. భారత్‌లో తయారైన మూడు ఏఐ మోడళ్లను కూడా సదస్సులో ఆవిష్కరించామని పేర్కొన్నారు. మరోవైపు, టీ-20 ప్రపంచ కప్ క్రికెట్‌లో భారత సంతతికి చెందిన ఆటగాళ్లు అనేక దేశాల తరపున ఆడుతుండటం సంతోషకరమని మోదీ పేర్కొన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా మానసిక బానిసత్వం నుంచి కూడా స్వాతంత్ర్యం పొందడం అవసరమని మోదీ అన్నారు. ఇందులో భాగంగానే బానిసత్వ చిహ్నాలను దేశం త్యజిస్తోందన్నారు. ఆ దిశగా రాష్ట్రపతిభవన్ కీలక నిర్ణయం తీసుకుందని చెప్పారు. రాష్ట్రపతిభవన్‌లోని బ్రిటిష్ ఆర్కిటెక్ట్ ఎడ్విన్ లుటియెన్స్ విగ్రహాన్ని తొలగించి, ఆ స్థానంలో స్వతంత్ర భారత మొట్టమొదటి గవర్నర్ జనరల్ రాజగోపాలాచారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్టు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా బ్రిటిష్ పాలకుల విగ్రహాలు రాష్ట్రపతిభవన్‌లో ఉండటం దురదృష్టకరమన్నారు. కాగా, కేరళకు చెందిన 10నెలల చిన్నారి ఆలిన్ షెరిన్ అవయవదానంతో నలుగురికి కొత్త జీవితాన్ని ప్రసాదించడాన్ని మోదీ ప్రశంసించారు.

ఏమిటీ 'నగ్న' రాజకీయం!

ఇప్పటికే నిస్సిగ్గుగా ఉన్నారు.. ఇంకా చొక్కాలు విప్పడమెందుకో?

» ఏఐ సదస్సు వద్ద కాంగ్రెస్ కార్యకర్తల తీరుపై మీరట్ సభలో మోదీ ధ్వజం

మీరట్, ఫిబ్రవరి 22: దేశ రాజధానిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఇండియా కృత్రిమ మేధ (ఏఐ) ఇంపాక్ట్ సదస్సు విజయవంతం కావడం కాంగ్రెస్ సహించలేకపోతోందని ప్రధాని మోదీ అన్నారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కొందరు ఆ సదస్సు వద్ద చొక్కాలు విప్పి హల్‌చల్ చేయడంపై మండిపడ్డారు. కాంగ్రెస్ మురికి, నగ్న రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఇప్పటికే ఆ పార్టీ నిస్సిగ్గుగా మారిందని.. ఇంకా చొక్కాలు విప్పాల్సిన అవసరం ఏముందని ఎద్దేవాచేశారు. ఆదివారం ఆయన యూపీలోని మీరట్‌లో నమో భారత్ రైలును, విస్తరించిన మెట్రో రైలును, రూ.12,930 కోట్లతో పూర్తిచేసిన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. 'ఏఐ సదస్సు వద్ద కాంగ్రెస్ నిరసన.. ఆ పురాతన పార్టీ సైద్ధాంతిక దివాలాకోరుతనానికి, పతనానికి నిదర్శనం. సొంత దేశాన్నే అప్రతిష్ఠ పాల్జేస్తోంది. కాంగ్రెస్ నేతలు నన్ను ద్వేషిస్తున్నారు. నాకు సమాధి తవ్వాలనుకుంటున్నారు. చివరకు నా తల్లిని అవమానించేందుకూ వెనుకాడడం లేదు. కానీ, ఏఐ సదస్సు బీజేపీ కార్యక్రమం కాదని వారు గుర్తుంచుకోవలసింది. ఇది జాతీయ కార్యక్రమం. కాంగ్రెస్ సభ్యత మరచి వ్యవహరించింది. అన్ని హద్దులూ దాటేసింది. వారి ప్రవర్తనను దేశం మొత్తం తీవ్రంగా ఖండిస్తోంది. ఈ ఘటనకు సిగ్గుపడాల్సింది పోయి.. దేశాన్ని అవమానించినవారిని హీరోలుగా చిత్రిస్తోంది' అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ కార్యకర్తల తీరును ఖండించిన ప్రతిపక్షాలకు ధన్యవాదాలు తెలిపారు. అవి జాతీయాభిమానం, సత్యం వైపు నిలిచాయని కొనియాడారు. ఒక్క కాంగ్రెస్ నేతలు మాత్రమే ఇలాంటి నిరసనకు దిగారని.. దాని మిత్రపక్షాలైన టీఎంసీ, డీఎంకే, బీఎస్పీ, నేషనల్ కాన్ఫరెన్స్ వంటి పార్టీలకు ప్రమేయం లేదని చెప్పారు. ఈ సందర్భంగా మీడియాకు ఓ సూచన చేశారు. 'ప్రతిపక్షంపై మోదీ విరుచుకుపడ్డారు' వంటి శీర్షికలు పెట్టొద్దని.. తద్వారా కాంగ్రెస్‌ను కాపాడే ప్రయత్నం చేయొద్దని కోరారు.

పార్లమెంటును అడ్డుకుంటున్నారు..

హద్దూ అదుపూలేని, ఉన్మాద కాంగ్రెస్ నేతలు దేశాన్ని నాశనం చేయాలని చూస్తున్నారని మోదీ ధ్వజమెత్తారు. 'ఆ పార్టీ పార్లమెంటును స్తంభింపజేస్తోంది. ఈ నెల మొదటివారంలో లోక్‌సభలో ప్రధాని కుర్చీని కాంగ్రెస్ ఎంపీలు చుట్టుముట్టారు. ఆ పార్టీ నేతలు సభలో మాట్లాడరు.. మిత్రపక్షాలనూ మాట్లాడనివ్వడం లేదు. పార్లమెంటును అడ్డుకోవడం వల్ల కాంగ్రెస్ మిత్రులే ఎక్కువగా ఇబ్బందిపడుతున్నారు. కాంగ్రెస్ ఈ దేశానికి భారంగా మారింది. ప్రధాని కుర్చీలో కూర్చోవాలనుకుంటే మొదట ప్రజల హృదయాలను గెలవాలి. ఆ కుర్చీని ఆక్రమించుకోవడానికి మహిళా ఎంపీలను పంపితే మీరు ప్రధాని కాలేరు' అని మోదీ ఎద్దేవా చేశారు.



మీరట్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మోదీ

దేశ గౌరవాన్ని తగ్గించేలా నిరసనలా ?: అఖిలేశ్ యాదవ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: ఏఐ సదస్సులో చొక్కాలు విప్పేసి యువజన కాంగ్రెస్ నేతలు నిరసన తెలియజేయడాన్ని ఇండియా కూటమిలోని పార్టీలు కూడా తప్పుబడుతున్నాయి. ఇండియా కూటమిలోని పార్టీ అయిన సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ యువజన కాంగ్రెస్ నేతల తీరును ఖండించారు. అధికార పార్టీ అయిన బీజేపీతో రాజకీయంగా ఎన్ని విభేదాలు ఉన్నప్పటికీ విదేశీ ప్రతినిధుల ఎదుట దేశ గౌరవాన్ని దెబ్బతీసేలా ఇలా నిరసన తెలియజేయడం తప్పు అని అఖిలేశ్ అన్నారు. బీజేపీ అసత్యాలు చెబుతోందని అందరికీ తెలుసు కానీ విదేశీయుల ముందు దేశాన్ని కించపరిచేలా యువజన కాంగ్రెస్ నేతలు ప్రవర్తించకుండా ఉండాల్సిందన్నారు. రాజకీయ పోరు కోసం దేశ గౌరవాన్ని పణంగా పెట్టడం సరికాదని పశ్చిమ బెంగాల్ ఐటీ మంత్రి, టీఎంసీ నేత బాబుల్ సుప్రియో అన్నారు.

అఫ్గానిస్థాన్‌లో పాక్ వైమానిక దాడులు

తెహ్రీక్ ఏ తాలిబాన్, ఐఎస్ స్థావరాలపై బాంబులు

» 70 మంది ఉగ్రవాదుల హతం: పాక్

ఇస్లామాబాద్/కాబూల్, ఫిబ్రవరి 22: అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ మరోసారి వైమానిక దాడులు చేసింది. శనివారం అర్ధరాత్రి అఫ్గానిస్థాన్‌లోని నంగర్‌హర్, పక్తిక ప్రావిన్సుల్లో తెహ్రీక్ ఏ తాలిబాన్ పాకిస్థాన్(టీటీపీ), ఇస్లామిక్ స్టేట్- ఖొరాసన్ ప్రావిన్స్(ఐఎస్‌కేపీ) ఉగ్రవాద సంస్థల స్థావరాలే లక్ష్యంగా ఏడు చోట్ల దాడులు చేసినట్లు పాకిస్థాన్ సైన్యం ఆదివారం ప్రకటించింది. ఇటీవల తమ దేశంలోని ఇస్లామాబాద్, బజౌర్, బన్నులలో జరిగిన ఆత్మాహుతి దాడులకు సూత్రధారులైన టీటీపీ, ఐఎస్‌కేపీ నేతలను మట్టుబెట్టేందుకు లక్షిత దాడులు చేసినట్లు వెల్లడించింది. ఈ దాడుల్లో 70 మంది ఉగ్రవాదులు మరణించినట్లు పాక్ మంత్రి తలాల్ చౌదరి తెలిపారు. అఫ్గానిస్థాన్ ఉగ్రవాదులకు అడ్డాగా మారిందని ఆరోపించారు. అయితే, పాక్ దాడుల్లో సాధారణ పౌరులే మరణించారని అఫ్గానిస్థాన్ ప్రభుత్వం ఆరోపించింది. నంగర్‌హర్ ప్రావిన్సులోని బిహ్సూద్ జిల్లా గిర్దికాస్ గ్రామంలో పాక్ వైమానిక దళం జరిపిన దాడిలో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మరణించారు. తన కుటుంబంలోని 23 మందిలో ఐదుగురే మిగిలారని షహబుద్దీన్ అనే వ్యక్తి కన్నీరుమున్నీరుగా విలపించాడు.



పాకిస్థాన్ వైమానిక దాడుల్లో ధ్వంసమైన నివాసాలు

ప్రతీకారం తప్పదు: తాలిబాన్

పాక్ దాడులను అఫ్గానిస్థాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. సరైన సమయంలో సరైన రీతిలో పాక్‌కు బదులిస్తామని తాలిబాన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ ఆదివారం హెచ్చరించారు. పాక్ దాడుల్లో అమాయకులైన మహిళలు, పిల్లలే మరణించారని ఆరోపించారు. స్కూళ్లు, పౌరుల ఇళ్లపైనే దాడులు జరిగాయని తెలిపారు. ఈ దాడుల ద్వారా అంతర్జాతీయ చట్టాలతోపాటు అఫ్గానిస్థాన్ సార్వభౌమత్వాన్ని పాకిస్థాన్ ఉల్లంఘించిందని మండిపడ్డారు.

గ్రీన్‌లాండ్‌కు హాస్పిటల్ నౌక

» పంపుతున్నామన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్, ఫిబ్రవరి 22: తాను స్వాధీనం చేసుకోవాలనుకుంటున్న డానిష్ భూభాగం గ్రీన్‌లాండ్‌కు హాస్పిటల్ నౌకను పంపేందుకుగాను లూసియానా గవర్నర్ జెఫ్ లాండ్రీతో కలిసి పని చేస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శనివారం పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో రిపబ్లికన్ గవర్నర్లకు విందు ఇవ్వడానికి ముందు ఈమేరకు సోషల్ మీడియాలో ఆయన పోస్ట్ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న చాలా మందిని చూసుకోవడానికి గాను గ్రీన్‌లాండ్‌కు గొప్ప హాస్పిటల్ పడవను పంపబోతున్నామని, ఇది దారిలో ఉందని పేర్కొన్నారు. అయితే ఈ నౌకను డెన్మార్క్ కోరిందా.. లేదా గ్రీన్‌లాండ్ కోరిందా అన్న ప్రశ్నలకు వైట్‌హౌస్ గానీ లాండ్రీ కార్యాలయం గానీ స్పందించలేదు. గ్రీన్‌లాండ్ రాజధాని నూక్ వెలుపల 7నాటికల్ మైళ్ల దూరంలో గ్రీన్‌లాండ్ జలాల్లో అమెరికా సబ్‌మెరైన్ నుంచి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సిబ్బంది ఒకరిని తరలించినట్టు డెన్మార్క్ జాయింట్ ఆర్కిటిక్ కమాండ్ ప్రకటించిన కొన్ని గంటలకే ట్రంప్ పోస్ట్ చేశారు. అయితే ట్రంప్ పోస్ట్‌కు దీనికి ఏమైనా సంబంధం ఉందా అనేదానిపై స్పష్టతలేదు. అమెరికా నేవీకి రెండు హాస్పిటల్ నౌకలున్నాయి. వీటిలో ఒకటి మెర్సీ, రెండోది కంఫర్ట్. అయితే ఈ రెండింట్లో ఏది కూడా లూసియానాలో లేదని తెలుస్తోంది.

అరగంట ముందే పరీక్షా కేంద్రానికి!

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు.. ఏర్పాట్లు పూర్తి
- రాష్ట్ర వ్యాప్తంగా 1,537 పరీక్షా కేంద్రాలు
- పరీక్షలు రాయనున్న 10.57 లక్షల మంది విద్యార్థులు



విజయవాడలోని ఒక ఇంటర్ పరీక్షా కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్ సరిచూసుకుంటున్న విద్యార్థులు, పరీక్షకు ఏర్పాట్లు

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇంటర్‌బోర్డు ఏర్పాట్లు చేసింది. మార్చి 24 వరకు జరిగే ఈ పరీక్షల కోసం 1,537 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 45 కేంద్రాలను సున్నితమైన కేంద్రాలుగా గుర్తించారు. 10,57,899 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 5,31,275 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 5,26,264 మంది ఉన్నారు. పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభమై 12 గంటల వరకు ఉంటుంది. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి 8.30 గంటలకు చేరుకోవాలి. హాల్ టిక్కెట్ చూపి కేంద్రంలోకి ప్రవేశించాలి. ఇన్విజిలేటర్ ద్వారా పొందిన ఓఎంఆర్ బార్‌కోడ్ షీట్‌లోని వివరాలను సరిచూసుకోవాలి. పరీక్షల నిర్వహణ పరిశీలనలో భాగంగా ఇంటర్మీడియట్ విద్య ఉన్నతాధికారులు, ఇంటర్‌బోర్డు అధికారులు వివిధ హోదాల్లో పరీక్షా కేంద్రాలను సందర్శిస్తారు. వీరితో పాటు జిల్లా పరీక్షల కమిటీ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, సిటింగ్ స్క్వాడ్ అధికారులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తారు. పరీక్షా కేంద్రాల్లోకి పెన్, పెన్సిల్, స్కెచ్‌పెన్స్, ఎరేజర్, గణిత పట్టికలు మాత్రమే అనుమతిస్తారు. ఇక, ఇంటర్ బోర్డు పోలీసు, రెవెన్యూ, పాఠశాల విద్య, వైద్యఆరోగ్యం, పోస్టల్, ఆర్టీసీ, విద్యుత్ శాఖల సమన్వయంతో పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు ఇంటర్ బోర్డు అన్ని చర్యలూ తీసుకుంది. పరీక్ష నిర్వహించే ప్రతి గదిలో, పరీక్షా కేంద్రం ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ విద్యాసంవత్సరంలో చేపట్టిన సంస్కరణల నేపథ్యంలో మొదటి సంవత్సరం గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనమిక్స్, సివిక్స్, కామర్స్, హిస్టరీ సబ్జెక్టులకు 32 పేజీల సమాధాన పత్రాలు ఇస్తారు. మిగిలిన, బ్యాక్‌లాగ్ సబ్జెక్టులకు, రెండో సంవత్సరం అన్ని సబ్జెక్టులకూ 24 పేజీల బుక్‌లెట్‌ను అందిస్తారు. అడిషనల్ ఆన్సర్ షీట్లు ఇవ్వరు.



గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌కు జ్ఞాపికను అందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఈ-గవర్నెన్స్‌పై ఏపీ సహకారం తీసుకుంటాం

- అధ్యయనానికి రాష్ట్రానికి బృందాన్ని పంపిస్తాం
- బాపట్ల కలెక్టర్‌తో గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్

బాపట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఈ-గవర్నెన్స్‌ను ఆంధ్రప్రదేశ్ ఉపయోగించుకుంటున్న తీరు అద్భుతమని, ఈ విషయంలో ఏపీ ప్రభుత్వ సహకారం తీసుకోవడంతో పాటు అధ్యయనం కోసం త్వరలోనే ఓ అధికారిక బృందాన్ని పంపిస్తామని గోవా ముఖ్యమంత్రి ప్రమోద్‌సావంత్ తెలిపారు. టూరిజం పాలసీ కసరత్తులో భాగంగా గోవా పర్యటనలో ఉన్న బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సారథ్యంలోని బృందం గోవా ముఖ్యమంత్రిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా తమ పర్యటనకు సహకరించినందుకు ఏపీ ప్రభుత్వం తరపున కలెక్టర్ గోవా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. పర్యాటకంపై ఏపీ ప్రభుత్వం రూపొందించిన కాఫీటేబుల్ బుక్‌ను అందజేశారు. ఆతిథ్య రంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న కృషిని గోవా సీఎం అభినందించారు. టూరిజం పాలసీలకు సంబంధించి పలు కీలక సూచనలను అందించారు. తీర ప్రాంతంలో సీఆర్‌జడ్ నిబంధనల అమలు విషయంలో పక్కాగా వ్యవహరించాలని, లేకుంటే భవిష్యత్‌లో న్యాయపరమైన చిక్కులు వచ్చే అవకాశం ఉందని సీఎం కలెక్టర్‌కు సూచించారు. గోవా ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించి వేంకటేశ్వరస్వామి ప్రతిమను జ్ఞాపికగా కలెక్టర్ అందించారు.

దేశ సంస్కృతి, సంప్రదాయాలు అంతరించే ప్రమాదం

- మఠాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలే గాడిలో పెట్టాలి
- కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి



శ్రీమఠంలో కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి

మంత్రాలయం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): దేశంలో సంస్కృతి, సంప్రదాయాలు, సనాతన ధర్మాలు అంతరించే ముప్పు ఉందని.., పుణ్యక్షేత్రాలు, ఆధ్యాత్మిక కేంద్రాలే గాడిలో పెట్టాలని కేంద్ర భారీ పరిశ్రమల, ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి అన్నారు. కర్నూలు జిల్లా మంత్రాలయంలో ఆదివారం గురువైభవోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన యోగీంద్ర కళా మంటపంలో భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుత కాలంలో చాలామంది కుటుంబ బాంధవ్యాలకు దూరంగా ఉంటున్నారని గుర్తుచేశారు. భార్యాభర్తలు, తల్లిదండ్రులు, కొడుకులు, కూతుళ్ల మధ్య అవగాహన లోపం, గౌరవం, భయం, భక్తి లేపోవడంతో మనభారత సంస్కృతికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకు ముందు కుమారస్వామి రాఘవేంద్ర స్వామిని దర్శించి, మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



శ్రీమఠంలో ప్రదక్షిణ చేస్తున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కుంచెం మహేశ్వరరావు

మంత్రాలయం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కుంచెం మహేశ్వరరావు దర్శించుకున్నారు. న్యాయమూర్తికి మహాముఖ ద్వారం వద్ద మఠం అధికారులు స్వాగతం పలికారు. రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజల అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.



శ్రీవారి ఆలయం వద్ద కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

ప్రపంచ దేశాల్లో అనిశ్చితి: శివరాజ్ సింగ్ చౌహాన్

- కుటుంబంతో శ్రీవారి దర్శనం అదృష్టమని వ్యాఖ్య

తిరుమల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): 'ప్రపంచ దేశాల్లో అనిశ్చితి నెలకొంది. కొన్ని దేశాల స్వార్థంతో ప్రజలు ఇబ్బంది పడుతున్న క్రమంలో భారత్ శాంతి పక్షం వహిస్తూ ప్రజలంతా అభివృద్ధి మార్గంలో సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకుంటోంది' అని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. తిరుమల శ్రీవారిని ఆదివారం ఉదయం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, కుటుంబంతో తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. తామంతా సన్మార్గంలో నడిచి ప్రజల సేవలో మరింతగా మమేకమయ్యే శక్తిని ఇవ్వాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.

మైక్రో ఇరిగేషన్‌కు నిధులు విడుదల చేయండి: అచ్చెన్న



కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో మంత్రి అచ్చెన్నాయుడు

తిరుమల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అమలుకు సంబంధించి కేంద్రం వాటా నిధుల్ని తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు విజ్ఞప్తి చేశారు. కేంద్ర వాటా కింద రాష్ట్రానికి రూ.695కోట్లు రావాల్సి ఉందని, ఈనెలలో కేవలం రూ.50కోట్లు మాత్రమే విడుదలయ్యాయని, మార్చిలోపు కనీసం రూ.400కోట్లు విడుదల చేయాలని కోరారు. ఈ నిధులను ఆర్‌కేవీవై, పీడీఎంసీ పథకం ద్వారా మంజూరు చేయాలని సూచించారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన కేంద్రమంత్రిని అచ్చెన్నాయుడు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధి, రైతుల సంక్షేమ కార్యక్రమాల అమలు, కేంద్ర పథకాల సమర్థవంతమైన అమలు వంటి వివిధ అంశాలపై చర్చించారు.

ఏఈవోల సమస్యల పరిష్కారానికి కృషి: విద్యాసాగర్

అమరావతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యలపై ఏపీ జేఏసీ పోరాడుతుందని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు విద్యాసాగర్ చెప్పారు. ఆదివారం విజయవాడలోని ఎన్జీవో హోంలో విద్యాసాగర్‌ను వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘ కార్యవర్గం కలిసింది. తమ జాబ్ చార్ట్, హోదా మార్పుపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తామని ఎన్జీవో నేత హామీ ఇచ్చినట్లు ఏఈవోల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వేణుమాధవరావు తెలిపారు.

సమస్యల పరిష్కారం కోరుతూ నేటి నుంచి అంగన్వాడీల రిలే దీక్షలు

- 2న విజయవాడలో మహాధర్నా

విజయవాడ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం నుంచి ఈనెల 27వరకు రిలే దీక్షలు చేపడుతున్నట్టు, మార్చి 2న విజయవాడలో మహాధర్నా చేస్తామని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ల ప్రతినిధులు కె.సుబ్బరావమ్మ, ఎన్‌సీహెచ్ సుప్రజ, లలితమ్మ, వీఆర్ జ్యోతి తెలిపారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అంగన్వాడీలకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, ఇతర డిమాండ్లు పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని వారు ప్రకటించారు.

ఎంఎస్ఎంఈల బలోపేతానికి సహకరించండి

- ఐసీఏఐ అధ్యక్షుడు ప్రసన్నకుమార్‌కు ఏపీ చాంబర్స్ వినతి



ఐసీఏఐ అధ్యక్షుడు ప్రసన్నకుమార్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న ఏపీ చాంబర్స్ ప్రతినిధులు

విజయవాడ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : టైర్-2, 3 పట్టణాల్లోని ఎంఎస్ఎంఈల బలోపేతానికి సహకరించాలని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెన్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) అధ్యక్షుడు సీఏడీ ప్రసన్నకుమార్‌ను ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ప్రతినిధులు రాజశేఖర్, సుబ్బారావు, అక్కయ్య నాయుడు కోరారు. ఐసీఏఐ అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రసన్నకుమార్‌ను ఏపీ చాంబర్స్ ప్రతినిధులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలిపారు. కార్పొరేట్ మిత్ర ఫ్రేమ్ వర్క్ అమలుకు సహకరించాలని, సంయుక్త ఎంఎస్ఎంఈ ఆర్థిక, అనుకరణ సహాయానికి కేంద్రాన్ని స్థాపించాలని, బ్యాంకులకు అనుకూలమైన డీపీఆర్‌లు, ఆర్థిక నిర్మాణంపై సాంకేతికంగా సాయం చేయాలని, ఆర్థిక క్రమశిక్షణ, డిజిటల్ అకౌంటింగ్, వ్యయ నియంత్రణపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, ఇబ్బందుల్లో ఉన్న ఎంఎస్ఎంఈల పునరుద్ధరణ, పునర్వ్యవస్థీకరణపై సలహాలు ఇవ్వాలని, ఐసీఏఐ ఆర్టికల్ ట్రైనీలను ఎంఎస్ఎంఈ యూనిట్లతో అనుసంధానించాలని వినతిపత్రం సమర్పించారు.

సమస్యలు గాలికి వదిలేశారు

- లడ్డూ రాజకీయాల్లో కూటమి నాయకులు: సీపీఐ రామకృష్ణ

ఆలూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు గాలికి వదిలేసి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సహా కూటమి పార్టీల మంత్రులు, ఎమ్మెల్యేలు లడ్డూ రాజకీయం చేస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ మండిపడ్డారు. కర్నూలు జిల్లా ఆలూరు మండలం మొలగవల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తిరుమల లడ్డూ తయారీలో కల్తీ జరిగిందంటూ అసెంబ్లీలో, ఢిల్లీలో, ప్రెస్‌మీట్లలో సీఎం చంద్రబాబు ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. ప్రాజెక్టులపై చర్చించకుండా బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు సమయాన్ని వృథా చేస్తున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వెళ్లి ప్రజల పక్షాన సమస్యలపై మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు.

ఏయూ ప్రతిష్ఠ దిగజారుస్తున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్: సీపీఎం

అనకాపల్లి టౌన్ (అనకాపల్లి జిల్లా), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అప్రదిష్ఠపాలు చేయడానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్ కంకణం కట్టుకున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. ఆదివారం అనకాపల్లిలో పార్టీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. మేధో మథనానికి ప్రతీకగా నిలిచిన ఏయూలో బీజేపీ, అనుబంధ సంఘాల అరాచకాలను విద్యా వేత్తలు, ప్రజలు ఖండించాలని కోరారు.

ప్రతి ఇంటికీ హైస్పీడ్ నెట్

(మొదటి పేజీ తరువాయి)

ఇళ్లకు ఫైబర్ నెట్ కనెక్షన్లు అందించే లక్ష్యంతో అమెండెడ్ భారత్ నెట్ ప్రాజెక్టు (ఏబీపీ)ను అమలు చేస్తున్నారు. కాగా, ఏపీలో ఏబీపీ అమలుకు రూ.2432 కోట్ల మేర నిధులు అందించేందుకు కేంద్రం సమ్మతించింది. దీనికోసం ఆంధ్రప్రదేశ్ భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఏపీబీఐఎల్) పేరుతో రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ)ని ఏర్పాటు చేసింది. డిజిటల్ భారత్ నిధి, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఈ మేరకు అవగాహన ఒప్పందం జరిగింది. డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా, రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పనా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఈ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు.

వైసీపీ ప్రభుత్వంలో ఫైబర్ నెట్ వ్యవస్థ ధ్వంసం

సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. భారత్‌లో డిజిటల్ విప్లవం, డిజిటల్ కనెక్టివిటీని పెంచడానికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. 2014-19 కాలంలో ఫైబర్ నెట్ వ్యవస్థను ఏర్పాటు చేశామని, పోల్స్‌మీద కేబుల్స్ వేసి 9.79 లక్షల ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చామని వెల్లడించారు. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఫైబర్ నెట్ వ్యవస్థను ధ్వంసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఫైబర్‌నెట్ కనెక్షన్లు 3.80 లక్షలకు పడిపోయాయన్నారు. కేంద్రం సహకారంతో ఫైబర్‌నెట్ కనెక్షన్లు పెంచుతామని చెప్పారు. ఏఐ-క్వాంటమ్ టెక్నాలజీలకు ప్రధాని మోదీ చాలా ప్రాధాన్యమిస్తున్నారని చంద్రబాబు చెప్పారు. అందుకే ఏఐ ఇంపాక్ట్ సదస్సును ప్రధాని మోదీ నిర్వహించారని, ఈ సదస్సుకి ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు హాజరయ్యాయని చెప్పారు. గ్లోబల్ నాలెడ్జ్, రూరల్ అప్లికేషన్ విధానం విజయవంతం కావాలంటే బ్యాండ్ విడ్త్ పెరగాలన్నారు. ఇందుకు కేంద్రం సహకరిస్తోందని చెప్పారు. ఏఐతో ఉద్యోగాలు కల్పించేలా యువతలో నైపుణ్యాలు పెంచుతామని చెప్పారు.

13,426 గ్రామ పంచాయతీల్లో అమలు

రాష్ట్రవ్యాప్తంగా 13,426 గ్రామ పంచాయతీల్లో భారత్ నెట్ ప్రాజెక్టు అమలుకు కేంద్రం అంగీకరించింది. దీనిలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పిస్తారు. ఫేజ్-1లో 1,692 పంచాయతీల్లోని నెట్‌వర్క్‌ను అప్‌గ్రేడ్ చేయడం, ఫేజ్-2లో 11,254 పంచాయతీలకు డిజిటల్ కనెక్టివిటీలు పూర్తిచేస్తారు. కొత్తగా ఏర్పడిన 480 పంచాయతీలకు హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్లు ఇచ్చేలా కార్యాచరణ రూపొందిస్తారు. 3,942 గ్రామాల్లో డిమాండ్ ఆధారిత కనెక్టివిటీని పెంచడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెడుతుంది.

'వన్ ఫ్యామిలీ - వన్ ఏఐ ఎక్స్‌పర్ట్' విధానం

రాష్ట్రంలో 'వన్ ఫ్యామిలీ - వన్ ఏఐ ఎక్స్‌పర్ట్' విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. వాట్సప్ ద్వారా మన మిత్ర యాప్‌తో 900కిపైగా ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని, డిజిటల్ కనెక్టివిటీ ఉంటే ప్రజలకు సేవలు సులువుగా అందుతాయని అన్నారు. టెక్నాలజీని అనుసంధానించి భూరికార్డులకు భద్రత కల్పిస్తున్నామని, ట్యాంపరింగ్‌కు ఆస్కారం లేని పట్టాదారు పాసుపుస్తకాలు అందిస్తున్నామని వెల్లడించారు. ఐబీఎం- టీసీఎస్- ఎల్ అండ్ టీ కన్సార్షియంతో దేశంలో తొలిసారిగా క్వాంటమ్ కంప్యూటర్ తెస్తున్నామని అన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో భారత్ అన్ని దేశాల కంటే ముందుందన్నారు. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య నేతృత్వంలో బీఎస్ఎన్ఎల్ నంబర్ వన్‌గా నిలుస్తుందన్నారు.

2030 నాటికి 100 కోట్ల మందికి 5జీ: సింధియా

2030 నాటికి దేశంలో 100 కోట్ల మంది 5జీ వినియోగదారులు ఉంటారని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. ఒప్పందం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు 35 ఏళ్ల క్రితమే టెలికాం రంగంలో సంస్కరణలు, విప్లవం గురించి ఆలోచించారని ప్రశంసించారు. ప్రజలకు మొబైల్, ఫైబర్ ఆప్టిక్, బ్రాండ్‌బ్యాండ్, వీశాట్, శాటిలైట్ వంటి మార్గాల ద్వారా ఇంటర్నెట్ సదుపాయం చేరువైందన్నారు. దేశంలోని 99 శాతం గ్రామాలు 4జీ వినియోగిస్తున్నాయని, మిగిలిన గ్రామాలకూ ఈ ఏడాది జూన్ నాటికి 4జీ సదుపాయాలు వస్తాయని వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో 40 కోట్ల మంది 5జీ వినియోగిస్తున్నారని, 2030 నాటికి ఈ సంఖ్య 100 కోట్లకు చేరుతుందని చెప్పారు. భారత్ నెట్ ప్రాజెక్టు కోసం రూ.1.30 లక్షల కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటించారు. ప్రతి గ్రామానికీ, ప్రతి ఇంటికీ ఆప్టికల్ ఫైబర్ ద్వారా బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్ అందిస్తామని చెప్పారు.

'రైస్ పుల్లింగ్' పేరుతో 13 లక్షల దోపిడీ



స్వాధీనం చేసుకున్న రాగి చెంబులు, నగదును చూపుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి

మహిమ గల రాగి చెంబు అంటూ మోసం

- శ్రీసత్యసాయి జిల్లాలో వైసీపీ నేత అరెస్టు
- నిందితుడు తలుపుల మండల పార్టీ కన్వీనర్



జగన్‌కు బొకే అందజేస్తున్న డిక్కీ బాబు, పక్కన వైసీపీ కదిరి నియోజకవర్గ కన్వీనర్ మగ్బుల్ బాషా (ఫైల్)

కదిరి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): 'రైస్ పుల్లింగ్' పేరుతో మోసగించిన కేసులో శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండల వైసీపీ కన్వీనర్ చింతకుంట క్రిష్టారెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. చింతకుంట క్రిష్టారెడ్డి అలియాస్ డీకే బాబు అలియాస్ డిక్కీబాబు ప్రస్తుతం తలుపుల మండల వైసీపీ కన్వీనర్‌గా, తలుపుల ఉపసర్పంచ్‌గా పనిచేస్తున్నాడు. డీఎస్పీ శివనారాయణస్వామి ఆదివారం కదిరి రూరల్ సర్కిల్ పోలీసుస్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. క్రిష్టారెడ్డి రైస్ పులింగ్ పేరుతో ఓ వ్యక్తి నుంచి రూ.13 లక్షలు తీసుకున్నాడని, మరో రూ.7 లక్షలకు ప్రామిసరీ నోటు రాయించుకున్నాడని పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడ్ని అరెస్టు చేసి, అతని నుంచి ఫార్చ్యూనర్ వాహనం, మూడు సెల్‌ఫోన్లు, ఐదు రాగి చెంబులు, రూ.1.08 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. డిక్కీబాబు రైస్ పుల్లింగ్ మహిమ గల రాగి చెంబు తయారు చేసే విద్య తనకు తెలుసని, దానిని మార్కెట్‌లో రూ.2 కోట్లకు అమ్మొచ్చని నమ్మించాడు. వాటిని నమ్మిన తలుపుల మండలం బురుజుపల్లికి చెందిన వేణుగోపాల్ రెడ్డి అనే రైతు గతేడాది రూ.10 లక్షలు ఇచ్చాడు. ఈ ఏడాది జనవరిలో మరో రూ.10 లక్షలు ఇస్తే, రాగి చెంబును తయారు చేసి, అమ్మి ఇస్తానని డిక్కీబాబు వేణుగోపాల్ రెడ్డికి చెప్పాడు. నమ్మకం కుదరని బాధితుడు.. తనకు చెంబు వద్దనీ, రూ.10 లక్షలు తిరిగివ్వాలని అడిగాడు. దీంతో డబ్బులు ఇచ్చేది లేదని, రాగి చెంబు ఇస్తానని డిక్కీబాబు చెప్పాడు. బాధితుడు జనవరి చివర్లో తలుపులలోని డిక్కీబాబు ఇంటికెళ్లాడు. నిందితుడు ఓ రాగిచెంబును బాధితుడికి ఇచ్చి, తర్వాత అమ్మి డబ్బులిస్తానని చెప్పాడు. పలుమార్లు వేణుగోపాల్ రెడ్డి.. రాగి చెంబు అమ్మి డబ్బులివ్వాలని అడిగినా పట్టించుకోలేదు. ఈ నెల 15న బాధితుడు.. డీకే బాబు ఇంటికెళ్లి రాగి చెంబు వెనక్కి ఇచ్చి, రూ.10 లక్షలు తిరిగివ్వాలని అడిగాడు. నిందితుడు ఆ రాగి చెంబు తీసుకుని, మరో రూ.10 లక్షలు ఇవ్వకపోతే చంపుతానని బెదిరించడంతో పాటు బంధించాడు. దీంతో వేణుగోపాల్ రెడ్డి.. స్నేహితులకు విషయం చెప్పాడు. వారు డిక్కీ బాబుకు రూ.3 లక్షల నగదు ఇచ్చి, రూ.7 లక్షలకు ప్రామిసరీ నోట్లు రాసిచ్చారు. రూ.7 లక్షలు ఇవ్వకపోతే చంపుతామని నిందితుడు బెదిరించాడు. వేణుగోపాల్ రెడ్డి ఫిర్యాదు మేరకు తలుపుల పోలీసులు కేసు నమోదు చేశారు. డిక్కీ బాబును తనకల్లు మండలంలోని రాకుంటపల్లి సమీపాన వైజంక్షన్ వద్ద అరెస్టు చేశారు. డిక్కీబాబుపై తలుపుల స్టేషన్‌లో ఇది వరకే 7 కేసులు నమోదైనట్లు డీఎస్పీ తెలిపారు. కాగా, రైస్ పులింగ్ పేరుతో పలువురిని మోసగించిన వైసీపీ నేత డిక్కీ బాబు.. ఆ సొమ్ములో పలువురు నాయకులకు వాటాలు పంపినట్లు సమాచారం. ఓ పార్టీకి చెందిన జిల్లా అధ్యక్షురాలికి 18 తులాల బంగారం కొనిచ్చినట్లు తెలుస్తోంది. ఓ పార్టీ ఇన్‌చార్జికి రూ.2 కోట్లకు రాగి చెంబు అమ్మిస్తానని నమ్మించి, రూ.40 లక్షలు తీసుకుని, మోసం చేసినట్లు ఆరోపణలున్నాయి.



మంగళగిరిలో ప్రదర్శన నిర్వహిస్తున్న చేనేత జేఏసీ నాయకులు, కార్మికులు

కేంద్ర బడ్జెట్‌లో 25 వేల కోట్లు కేటాయించాలి

- 'సహకార' బకాయిలు రూ.203 కోట్లు చెల్లించాలి
- చేనేతల గర్జనలో నేతన్నల డిమాండ్

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత రంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ చేనేత సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. చేనేత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు జిల్లా మంగళగిరిలో చేనేత గర్జన నిర్వహించారు. కార్మికులతో కలిసి భారీ ప్రదర్శన నిర్వహించారు. బహిరంగ సభలో జేఏసీ కన్వీనర్ పిల్లలమర్రి నాగేశ్వరరావు మాట్లాడారు. దేశంలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న చేనేత రంగాన్ని ప్రభుత్వాలు విస్మరించడం బాధాకరమన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రూ.25 వేల కోట్లు, రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని, సహకార సంఘాలకు చెల్లించవలసిన రూ.203 కోట్లను విడుదల చేయాలని, ప్రతి నేత కార్మికుడికి ఏటా రూ.25 వేలు ఇవ్వాలని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అమలు చేయాలని, 11 రకాల రిజర్వేషన్ చట్టంపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. గర్జనలో జేఏసీ నాయకులు దుర్గారావు, పూర్ణచంద్రరావు, వి.రమేష్, కృష్ణప్రసాద్, మాచర్ల మోహన్, వీరనాగేశ్వరరావు, రాపోలు జగన్, రుషింగప్ప, కోటేశ్వరరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరీస్, అకౌంట్స్ శాఖ ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు కృషి

- సంఘ నూతన అధ్యక్షుడు రాజకుమార్

విజయవాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ట్రెజరీస్, అకౌంట్స్ శాఖల ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు కృషిచేస్తానని రాష్ట్ర ట్రెజరీస్, అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రాజకుమార్ అన్నారు. రాష్ట్ర ట్రెజరీస్, అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి కార్యవర్గ ఎన్నికలు ఆదివారం విజయవాడలో జరిగాయి. నూతన అధ్యక్షుడిగా కె.రాజకుమార్, ప్రధాన కార్యదర్శిగా డీజే సంపత్‌రావు ఎన్నికయ్యారు. అనంతరం రాజకుమార్, సంపత్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వంతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ట్రెజరీ, అకౌంట్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.



రాష్ట్ర ట్రెజరీస్, అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి కార్యవర్గ సభ్యులు

వివిధ

vividha@andhrajyothy.com సాహిత్య వేదిక

మాడభూషి రంగాచార్య స్మారక కథా పురస్కార ప్రదానోత్సవం

మాడభూషి రంగాచార్య స్మారక కథా పురస్కార ప్రదాన సభ ఫిబ్రవరి 25 సా.5.30గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. 2025కు గాను 'గస్సాల్' కథా సంపుటికి కటుకోజ్వల ఆనందాచారి, 2026కు గాను 'ఉలిపికట్టెలు' కథా సంపుటికి పి. జ్యోతి పురస్కారాలను స్వీకరిస్తారు. సభలో నాళేశ్వరం శంకరం, నందిని సిధారెడ్డి, ఏనుగు నరసింహారెడ్డి, సమ్మెట ఉమాదేవి, రూప రుక్మిణి తదితరులు పాల్గొంటారు.

మాడభూషి లలిత

'లవ్ జిహాద్' అనువాద పుస్తకం ఆవిష్కరణ

శ్రీనివాసన్ జైన్, మరియం అలావి, సుప్రియా శర్మ రాసిన 'లవ్ జిహాద్' పుస్తకానికి రవి నర్ల తెలుగు అనువాదం ఆవిష్కరణ ఫిబ్రవరి 28 సా.5.30 గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో ఘంటా చక్రపాణి, బి. సుదర్శన్ రెడ్డి, శ్రీనివాసన్ జైన్, కల్పనా కన్నబిరన్ తదితరులు పాల్గొంటారు.

మలుపు ప్రచురణలు

మూడు పుస్తకాల పరిచయ సభ

వి.ఆర్. రాసాని ఈ మధ్య రాసిన మూడు పుస్తకాల పరిచయ సభ ఫిబ్రవరి 28 ఉ.10గంటలకు సెనేట్‌హాల్, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతిలో జరుగుతుంది. సభలో బి.వి.మురళీధర్, నరసింగరావు, ఎం. భూపతినాయుడు తదితరులు పాల్గొంటారు. ఆకుల మల్లేశ్వరరావు, నాగోలు కృష్ణారెడ్డి, మేడిపల్లి రవికుమార్, కొత్వాలు అమరేంద్ర పుస్తకాలను పరిచయం చేస్తారు. బాలా బుక్ పబ్లిషర్స్ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన ఉంటుంది.

పి. వివేక్

భూతపురి సాహిత్య పురస్కార ప్రదానోత్సవం

భూతపురి సుబ్రహ్మణ్యశర్మ 89వ జయంతి సందర్భంగా 24వ సాహిత్య పురస్కార ప్రదానోత్సవం భూతపురి సుబ్రహ్మణ్యశర్మ మెమోరియల్ ట్రస్ట్ & అల్లసాని పెద్దన సాహిత్యపీఠం ఆధ్వర్యంలో మార్చి 1 ఉ.10గంటలకు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కడపలో జరుగుతుంది. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత తెలుగుశాఖాధ్యక్షులు కె. సర్వోత్తమరావు పురస్కారాన్ని అందుకుంటారు. ఆయనకు రూ.10,116/– నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేయబడుతుంది. సభలో బొమ్మిరెడ్డి జయరామిరెడ్డి, బెల్లంకొండ రాజశేఖర్, జి. దామోదర నాయుడు తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 9966624276.

భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి

కథ, కవితా సంపుటాలకు ఆహ్వానం

గుంటూరు జిల్లా రచయితల సంఘం సాహితీ పురస్కారాల కోసం కథ, కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. కవులు, కథకులు 2025 లో వెలువడిన కథ, కవితా సంపుటాలు మూడు ప్రతులను మార్చి 31లోపు కింది చిరునామా: నానా, ఇం.నెం: 63–5–596, ఎన్.ఎస్.ఆర్ నిలయం, బాలాజీనగర్ 3/4, పాత గుంటూరు, గుంటూరు–522001 ఫోన్: 9849139337కు పంపాలి.

ఎస్.ఎం సుభాని

ఉమ్మడిశెట్టి అవార్డు విజేత ప్రకటన

38వ ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు 2025కు కంచరాన భుజంగరావు కవితా సంపుటి 'గేసి చెరిపే బొమ్మ' ఎంపికైంది. ఇది వీరి రెండవ కవితా సంపుటి. న్యాయనిర్ణేతలు వసీరా, కోయి కోటేశ్వరరావు, కోడూరి విజయకుమార్‌లకు కృతజ్ఞతలు. ప్రదాన సభా వివరాలు త్వరలోనే తెలియజేస్తాం.

ఉమ్మడిశెట్టి రాధేయ

చిన్ని నారాయణరావు అవార్డు విజేత ప్రకటన


చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ ఈ ఏడాదికి సాహితీ అవార్డుల విజేతలను ప్రకటించింది. ప్రధాన అవార్డుకు కొప్పర్తి వెంకటరమణమూర్తి ఎంపికయ్యారు. మరో మూడు అవార్డులకు పిడుగురాళ్ళకు చెందిన వై.హెచ్.కె.మోహనరావు (సత్యవేటి శ్రీకాంత్ స్మారక పురస్కారం), మద్దూరి శ్రీనివాసులు (తుంగా రాజగోపాలరెడ్డి స్మారక పురస్కారం), గంగవరపు సునీత (నాగభైరవ కోటేశ్వరరావు స్మారక పురస్కారం) ఎంపికయ్యారు. వివరాలకు: 9246415150.

కలిమిశ్రీ

'ఎరిక: కళింగ సాహిత్య పాఠశాల' మూడవ సమావేశం

'ఎరిక: కళింగ సాహిత్య పాఠశాల' మూడవ సమావేశం మార్చి 2న విజయనగరం జిల్లా వేణుగోపాలపురంలో ఉన్న జిల్లావిద్యాశిక్షణా కేంద్రంలో జరుగుతుంది. 'చిత్రకళ–స్థానికత' అంశంపై చిత్రకారులు చందనపల్లి గోపాలరావు ఉపాధ్యాయ శిక్షణార్థులుతో మాట్లాడుతారు. ఈ సభలో ప్రిన్సిపాల్ దత్తి అప్పలనాయుడు, అధ్యాపకులు ఎం.రమేష్, ఎం. మురళి, వి. చిన్నంనాయుడు, డి. శ్రీనివాసరావు, కె. అప్పారావు, జి. సూరిబాబు, సిహెచ్. సోమయాజులు తదితరులు పాల్గొంటారు.

బాలసుధాకర్



ఎద్దడి

గయ్యాళి గగనం
నోరు సగమైనా తెరవలేదు
వెండిపూత కంచు మేఘాలు
ఒకటే లొడలొడ!

పల్లంరాయి మీద
వరదపాశం పారనేలేదు
ఎండిన చెరువు గుమ్మిల్లో
కప్పల బెకబెక!

ఊళ పెట్టే గాలి ఉడుకు
చల్లబడనేలేదు
చిగురాశల కొమ్మ చివర
మొగ్గ కలల రద్దీ!

చెరువు గర్భంలో
పగుళ్ల మధ్య పదునే లేదు
దప్పికతో మోరసాచి
మోకాళ్ళొంచింది జింక!

పాదాలకు బెడ్డమట్టి
బంకయినా అంటలేదు
ఏసంగి ఏనుగు కాళ్ళు కరిచి
మొగులు మొసలి వీరంగం!

పిత్తపరిగ మొప్ప తడిపే
దిక్కయినా లేదు
ఎండ ఎద్దు అడుగుల్లో
ఏడేసి సవడలున్నట్టు ప్రచారం!


చినుకు లేదు చిగురు లేదు
ఎప్పటిలాగే
యముడి దున్నపోతు
కొమ్ము చిగూరునే
పొద్దెక్కింది మళ్ళీ!

■ **కంచరాన భుజంగరావు**
✆ 94415 89602

సాహిత్య సభల కాలం!

ఇటీవల వివిధ సాహితీ మహాసభలు జరిగిన, జరుగుతున్న సందర్భాలతో తెలుగు సాహిత్యం పులకరిస్తోంది. 'సమూహ' సెక్యులర్ రైటర్స్ ఫోరమ్ నిర్వహించిన యువజన సాహిత్యోత్సవం; వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వారు మహిళల ఆత్మకథలు, జీవిత చరిత్రలపై నిర్వహించిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు; ఉస్మానియా యూనివర్సిటీ పెట్టిన తెలుగు సాహితీ మహాసభలు; పదిహేడేళ్ళ ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక నిర్వహించిన ద్రావిడ సమాజ సాహిత్యాలపై రెండు రోజుల సదస్సు; హైదరాబాద్ లిటరరీ ఫెస్ట్; ఛాయ లిటరరీ ఫెస్ట్; బహుజన రైటర్స్ ఫోరం పెట్టిన కొత్త తరం కవుల మిలన్; పదిహేనేళ్ల కవి సంగమం; ఎండ్లూరి సుధాకర్ సాహిత్యంపై సమాలోచన; నందిని సిధారెడ్డి సాహిత్యంపై అంతర్జాల సదస్సు; తెలంగాణ సాహితీ వారు చేసిన దశాబ్ది సాహిత్యోత్సవాలు; తెలంగాణ సాహిత్య అకాడెమీ, నిజాం కళాశాల నిర్వహించిన అంతర్జాతీయ భాషా దినోత్సవం... ఇలా తెలుగు సాహిత్యంలో ఎన్నో అంశాలపై మహాసభలు విరివిగా జరుగుతున్నాయి.

పాత తరం నుంచి కొత్త తరం రచయితలందరూ ఎన్నో చర్చించాల్సిన విషయాలన్నీ ఎటువంటి భేషజాలు లేకుండా ప్రశ్నించడం, నచ్చనివి నచ్చనట్టు అభిప్రాయాలు వ్యక్తపరచడం ఎంతో అవసరం కూడా.



బొమ్మలు: అక్బర్

ఉస్మానియా వారు ఆహ్వానించిన తెలుగు లిటెరరీ కాంగ్రెస్ సభలో 'సాహిత్య పురస్కారాలు–యువత ఆలోచనలు'పై మాట్లాడమన్నప్పుడు నాకు తెలిసినంత వరకు ఉన్న నిజాలని, యువత ఉద్దేశాలని, రచయితగా ప్రయాణం ఆపకపోవడం కంటే పెద్ద పురస్కారాలు ఉండవని, పాఠకుల విమర్శలకంటే పెద్ద అవార్డులు ఉండవని నా అభిప్రాయం చెప్పాను. మా పానెల్‌లో ఉన్న మాతంగి మనోజ్, పరిశోధక విద్యార్థి కూడా కాస్త కఠినంగానే కొత్త తరం రాస్తున్న పుస్తకాలపై వ్యాఖ్యానించాడు. ఒకప్పుడు ఈ వాతావరణం ఇంత బహిర్గతంగా ఉండేదా లేక మర్యాదల ముసుగులో వేదికలు ప్రశంసించుకోడానికే పనికొచ్చేవా అన్న పరిశీలన కూడా జరుగుతోంది.

బెంగుళూరులో ప్రతి ఏటా జరిగే బుక్ బ్రహ్మ ద్రావిడ భాషల సాహితీ ఉత్సవంలో ఇప్పటికే పలు తెలుగు రచయితలు, పాత్రికేయులు పాల్గొంటూ ఉన్నారు. 2024లో రచయిత్రులు జూపాక సుభద్ర, చల్లపల్లి స్వరూప రాణి, వినోదిని, నేను 'స్త్రీవాదం నుండి దళిత స్త్రీవాదం వైపు' అంశంపై మాట్లాడాం.

ఈ నేపథ్యంలోనే బెంగుళూరులోని అలయన్స్ యూనివర్సిటీ వాళ్ళు 2022 నుంచి సాహిత్య సామాజిక అంశాలపై నిర్వహిస్తున్న ఉత్సవాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. చరిత్ర నుంచి నేటి మీడియా వరకు అనేక అంశాలపై ఈ విశ్వవిద్యాలయం ప్రతి ఏటా ఒక జాతీయ వేదిక అవుతుంది. గత ఉత్సవాల్లో శశి థరూర్, రాజ్‌దీప్ సర్దేశాయ్, దేవ్‌దత్ పట్నాయక్, జావేద్ అక్తర్, ఉషా ఉతుప్, శ్రద్ధా జైన్, గీతాంజలి శ్రీ, అనిల్ కుంబ్లే, విక్రమ్ సంపత్ వంటి ప్రముఖ స్వరాలు ఉన్నాయి. కొనసాగింపులో సాహిత్యం, కళ, సంస్కృతి, ఆలోచనల కేంద్రంగా అలయన్స్ విశ్వవిద్యాలయం తన పాత్రను బలోపేతం చేస్తూ విద్యార్థులకు వివిధ విభాగాలలోని విశిష్ట ఆలోచనాపరులతో ప్రత్యక్ష కలయికను అందించడం అభినందనీయం.

ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరిగిన మూడు రోజుల మహాసభలలో నటి విద్యాబాలన్; నటి, నర్తకి శోభనలతో పాటు దేశవ్యాప్తంగా రచయితలు 'అలయన్స్ లిటరరీ ఫెస్టివల్ 2026'కు తరలి వచ్చారు. 'ఆమె కథ: నారీ శక్తి' అనే ఈ ఏడాది అంశంపై ఎన్నో దృక్కోణాలతో ఆ విశాలమైన క్యాంపస్ మేధోమధనంతో హోరెత్తింది. మేధో, సాంస్కృతిక, సాహితీ, శాస్త్రీయ, రాజకీయ, సృజనాత్మక కథనాలలో మహిళలను గుర్తించడం, చర్చించడం అనే ఇతివృత్తంతో ఈ మూడు రోజుల సభలు నడిచాయి. ఈ వేదిక సాహిత్యం, తత్వశాస్త్రం, పాలన, ప్రజావిధానం, మీడియా, వ్యవస్థాపక, క్రియాశీలత, కళ, నాయకత్వం, సామాజిక పరివర్తన శిల్పులుగా మహిళలను చూపింది.

రెండవ రోజు నేను; తమిళ దళిత రచయిత్రి, ఉక్కు స్వరం సుకీర్త రాణి, ప్రముఖ కన్నడ రచయిత వివేక్ షాన్ బాగ్ ఒక ప్యానెల్‌లో ఉన్నాం. కేరళకు చెందిన ఆంగ్ల సాహిత్య పరిశోధకురాలు, అలయన్స్ యూనివర్సిటీ ఉపాధ్యాయురాలు భవితఏసో మా సెషన్‌కు అధ్యక్షత వహించింది. రచనలో, అనువాదాలలో రచయితలు వెతుక్కునే గుర్తింపు, తమవైన జ్ఞాపకాలు, సమకాలీనతలపై మాట్లాడాం. రాసే క్రమంలో జెండర్, కులం, ప్రాంతం పోషించే పాత్రల గురించి స్వీయనుభవాలతో వివరించారు సుకీర్త. తన చిన్నతనంలో టీచర్స్ కుల వివక్షతో ఆమెను పెట్టిన మానసిక హింసను గురించి చెప్పారు. అందరి కంటే ఎక్కువ మార్కులు వచ్చినా క్లాస్‌లో చివరి బెంచ్‌పై కూర్చోపెట్టడం, కులకారణ ద్వేషాన్ని చూపడం గురించి భావోద్వేగంగా మాట్లాడారు. చదువును కొనసాగిస్తూ ఇప్పుడు అదే స్కూల్‌లో టీచర్‌గా ఆమె పాఠాలు చెప్తున్నారు. తమిళ దళిత సాహిత్యంలో ఉన్న పురుషస్వామికమైన భాష గురించి ఎన్నో విషయాలు చెప్పారు సుకీర్త.

నేరుగా రాసే భారతీయ ఆంగ్ల సాహిత్యం ఏదీ భారతీయ సాహిత్యం కాదనే వివేక్ షాన్ బాగ్ ఇప్పుడు బెంగుళూరులో 'hyphen' అనే అనువాద సాహిత్య సంస్థను స్థాపించి భారతీయ సాహిత్యాన్ని ఆంగ్లంలోకి అనువాదాలుగా తీసుకొస్తూ సాహితీ సేవ చేస్తున్నారు. 'హైఫన్' అనే పదం కవి, అనువాదకుడు, మేధావి ఎ.కె. రామానుజన్ నుండి ప్రేరణ పొందింది. రామానుజన్ ఒకప్పుడు తనను తాను ఇండో–అమెరికన్‌లో 'హైఫన్'గా అభివర్ణించుకున్నాడు. దాన్నే తన సంస్థకి పేరు పెట్టాడు వివేక్. సాహిత్యం అంటే భాష, రచయితలకి ఉండే ఏకైక ఆస్తి, ఆయుధం భాషే అంటారు వివేక్. అలాంటిది ఇక్కడి ప్రాంతీయ భాషల సాహిత్యం నేరుగా ఆంగ్లంలో రాయడాన్ని తాను అంగీకరించనని అంటారు.

శరణ్ కుమార్ లింబాలే మరాఠీలో రాసిన నవలల్లో రెండింటిని నేను అనువాదం చేశాను. ఒకటి 'ఊరికి దక్షిణాన' పేరుతో అన్వీక్షికి పబ్లిషర్స్ 2021లో ప్రచురించారు. రెండవది త్వరలో ఛాయా పబ్లిషర్స్ ద్వారా రానున్నది. దయా పవార్ మరాఠీలో రాసిన 'బలూత' దేశంలో వచ్చిన మొట్టమొదటి దళిత ఆత్మకథల్లో ఒకటి. అది కూడా త్వరలో అనువాదం పూర్తి చేయనున్నాను. ఈ సెషన్‌లో దళిత స్త్రీలు రాసిన ఆత్మకథల గురించి, వారు జీవితాన్ని, వివక్షని చూసిన తీరు గురించి నేను మాట్లాడాను. దళిత పురుషులు వారి జీవితాల్లో చూసిన ఎటువంటి విషయాన్నైనా సంకోచం లేకుండా రాయడాన్ని గమనించాను. ప్రతి భాషలోని దళిత రచయిత్రులు తమ రచనల్లో పక్క దోవ లేకుండా వివక్షకి, అవమానానికి, ఆత్మగౌరవ పోరాటానికి, తెగింపుకి, సమానత్వానికి పెద్ద పీట వేయడం చూస్తాం.

భాషలోని పురుషస్వామ్యాన్ని గురించి అడిగిన ఒక విద్యార్థిని ప్రశ్నకు చిన్న ఉదాహరణతో సమాధానం చెప్పాను. రచయితలు సైతం అలవోకగా 'పాఠకుడు' అని పాఠకలోకాన్ని సంబోధిస్తారు. ఈ సంబోధనకు స్త్రీలు, queer వారు వెంటనే disconnect అవుతారు. పాఠకులు అనే బహువచనం అందరినీ ఆహ్వానిస్తుందని నా అభిప్రాయం చెప్పాను.

అలయన్స్ లిటరరీ ఫెస్టివల్‌లో తెలుగు వారిగా నేనూ, యువ రచయిత్రి దివ్య కందుకూరి ఉన్నట్టు తెలిసింది. ఐశ్వర్య మొహంతి, ఐశ్వర్య సుస్మిత, జహ్నవి ఫాల్కే, ఎలిజబెత్ థామస్ వంటి అనేకమంది జర్నలిస్టులు, రచయితలు, చరిత్రకారులు, సినీనటుల వంటివారు మూడు రోజులు వక్తలుగా వచ్చారు. దక్షిణ భారతీయ ప్రాంతాల్లో ఇటువంటి సాహిత్య మహా సభలు జరగడం ద్రావిడ ఉనికిని, అస్తిత్వాన్ని దృఢంగా నిలబెడతాయన్న ఆశను ఇస్తున్నాయి.

■ **మానస ఎండ్లూరి**
manasaugc@gmail.com

ఆయన ఆత్మకథలో నా ప్రతిబింబం

ఆంగ్ల పాఠకులకే గాక, ఇతర భారతీయ భాషల చదువరులకు కూడా చిరపరిచితుడైన రచయిత రస్కిన్ బాండ్ తన ఆత్మకథని 'Lone Fox Dancing' పేరిట జూన్ 2017లో వెలువరించారు. 'స్పీకింగ్ టైగర్' అనే ప్రచురణ సంస్థ దీనిని ప్రచురించింది. ఆంగ్లంలో ప్రచురితమైన దాదాపు ఎనిమిదేళ్ళ తరువాత ఇది ఇప్పుడు 'ఓ ఏకాంతజీవి బ్రతుకాట' పేరిట తెలుగులోకి అనువాదమైంది. యాత్రా రచయిత, కథకుడు, అనువాదకుడు **దాసరి అమరేంద్ర** ఈ పుస్తకాన్ని అనువదించారు. 'కథా ప్రపంచం' దీన్ని ప్రచురించింది. ఈ సందర్భంగా అమరేంద్రతో సంభాషణ.

ఈ ఆత్మకథ అనువదించే అవకాశం ఎలా లభించింది?

'కథాప్రపంచం' నిర్వాహకులు కిరణ్‌తో పదేళ్ల పరిచయం. మూడేళ్ల క్రితం 'అనువాదాలు ప్రచురిద్దామనుకొంటున్నాం' అని ఆయన ప్రకటించినప్పుడు, 'నేను ఒకటి చేస్తాను' అన్నాను. ఏది చెయ్యాలి అన్న విషయంలో తర్జన భర్జన పడ్డాం. రస్కిన్ బాండ్ వీరాభిమాని అయిన కిరణ్ ఆయన ఆత్మకథను సూచించినప్పుడు "ఈ రస్కిన్ బాండ్ తేలిక బాణీలో మధ్యే మార్గంలో రాసే మనిషి గదా" అన్న ప్రిజుడీస్‌తో అన్యమనస్కంగానే ఆ పుస్తకం చదివాను. ముందు పర్లేదనిపించింది. రెండోసారి మూడోసారి చదవగా బావుందనిపించింది. ఆరునెలలు ఆ పుస్తకంతో సహవాసం, అనునాదం జరిగాక దానిని అనువదించడమన్నది ఎంత గొప్ప అవకాశమో తెలిసి వచ్చింది.

ఈ పుస్తకంలో మిమ్మల్ని ఆకట్టుకున్న ప్రధాన అంశాలేవి?

స్థూలంగా మా ఇద్దరి జాతులు, మతాలు, ప్రాంతాలు, పద్ధతులు వేరయినా– ఇవన్నీ దాటుకుని సూక్ష్మ రూపంలోకి వెళితే ఆయన ఆత్మకథలో నా ప్రతిబింబం కనిపించింది. కుటుంబ నేపథ్యాలు, ఆలోచనలు, అనుభవాలు, అభిరుచులు, అనుభూతులు – వీటన్నిటిలోనూ నాకు ఆయనతో సారూప్యం ఉంది. ఈ సారూప్యాలు నన్ను రస్కిన్ బాండ్ ఆత్మకథకు దగ్గర చేసాయి.


అలాగే ఈ ఆత్మకథలో నన్ను బాగా ఆకట్టుకున్న అంశం – నిర్మోహత్వం. తనకున్న శక్తి సామర్థ్యాలతో బతుకును నల్లేటి బాటలో నడిపే అవకాశమున్నా, ఆ ప్రలోభంలో పడకుండా తను నమ్మిన అక్షరాల ముళ్ళబాటనే ఎన్నుకుని 75 సంవత్సరాలుగా సాగిపోతున్న వైనం, అక్షరాలను నమ్ముకోవడమే గానీ అమ్ముకోవడం తెలియని నైజం నన్ను ఎంతగానో ఆకర్షించాయి!

రస్కిన్ బాండ్ నివసించిన ప్రాంతాలు మీకూ చిరపరిచితమైనవి కావడం అనువాదానికి ఏమైనా ఉపకరించిందా?

నిస్సందేహంగా! ఆయన డెహ్రాడూన్, ఢిల్లీ, ముస్సోరీలలో నివసించాడు. ఆయా ప్రదేశాలలో ఏళ్ళ తరబడి నడిచాడు. అక్కడి మనుషులు, పక్షులు, ప్రకృతి మధ్య జీవించాడు.



నేను గత యాభై యేళ్లుగా ఢిల్లీలో ఉంటున్నాను. ఊరంతా నాకు చిరపరిచితం. రస్కిన్ బాండ్ ఢిల్లీ మనుషుల గురించి రాస్తే వాళ్ళను నేను గుర్తుపట్టగలను. ఢిల్లీ కాలనీలు, ప్రముఖ ప్రదేశాలు, సినిమా హాళ్ల, సందుగొందుల గురించి ఆయన రాసిన వివరాలు నాకూ సుపరిచితం. అలాగే డెహ్రాడూన్, ముస్సోరి, లాండోర్ ప్రాంతాలతోనూ నాకు పరిచయం ఉంది. ఈ పరిచయాలు అనువాదంలో నాకు ఎంతగానో ఉపకరించాయి. ఏ విషయాన్నీ, ఏ ప్రదేశాన్నీ నేను ఊహించుకోవలసిన అవసరం లేకుండా, ఆయనతో కలసి వెళ్లి చూసాను, ఆయన కళ్ళతో, మనసుతో చూడగలిగాను. ఒక్కో చోట వాటి వివరాలు అప్‌డేట్ చేసి పొందుపరచే చొరవ చేసాను. ఉదాహరణకి కనాట్ ప్లేస్ లోని రీగల్ థియేటర్ గురించి ఆయన ప్రేమగా ప్రస్తావిస్తూ, "ఈ హాలు కూడా కాలగర్భంలో కలసిపోతుందేమో" అని విచారపడ్డారు. "కలసిపోయింది" అన్న వివరం నేను బ్రాకెట్ల మధ్య ఉంచాను.



తెలుగు అనువాదానికి 'ఓ ఏకాంత జీవి బ్రతుకాట' అన్న శీర్షిక పెట్టే ముందు ఇంకేమైనా శీర్షికలు అనుకున్నారా?

శీర్షిక కాస్త ఇబ్బంది పెట్టింది. Lone Fox Dancing అన్న మూల రచన శీర్షికను 'ఒంటరి జంబూకం నృత్యహేల' అందామనుకున్నాను గానీ అది మూలంలోని స్ఫూర్తిని పట్టుకోలేదనిపించింది. శీర్షిక ఎంపిక కోసం మూల రచనను మరోసారి చదివినప్పుడు, ఆ ఒంటరి నక్క నాట్యమాడటం అన్న సంఘటన నిజంగా జరిగినదే అయినా, దానిని రస్కిన్ బాండ్ ఒక ప్రతీకగా తీసుకున్నాడని బోధపడింది. తన జీవితం నడచిన విధానం గురించి ఆ మాటలు పాజిటివ్ స్పిరిట్‌తో చెప్పాడని గ్రహించగలిగాను. అందుకే 'ఒంటరి జీవి' అనకుండా ఆ స్పిరిట్ స్ఫురించేలా 'ఏకాంత జీవి' అన్నాను.

మీరు ఒకే సమయంలో నంబూరి పరిపూర్ణ ఆత్మకథ 'వెలుగు దారులలో..'ను తెలుగులోంచి ఇంగ్లీషులోకీ, రస్కిన్ బాండ్ ఆత్మకథను ఇంగ్లీషులోంచి తెలుగులోకీ అనువదించారు. ఈ అనుభవం గురించి?

స్థూలంగా చూస్తే అటు పరిపూర్ణ, ఇటు రస్కిన్ బాండ్ ఒకే బాణీ మనుషులు. ఒకే కాలంలో జీవించిన మనుషులు. వాళ్లు చూసిన చారిత్రిక సామాజిక రాజకీయ జీవితాలు దాదాపు ఒకటే. ఇద్దరూ తమ తమ జీవితాలను తమ తమ ఎంపికలను, పట్టుదలలను ఆధారం చేసుకుని జీవించారు. జయించారు. పరిపూర్ణ ఎంపిక వెనుక భావజాల బలం ఉంది. నిలబడింది. అలాంటి భావజాలపు ఊతం లేకుండానే రస్కిన్ బాండ్ జీవితంలో నిలబడగలిగాడు. ఇది మరింత కష్టం.

ఈ రెండింటినీ ఏకకాలంలో అనువదించినప్పుడు పోల్చి చూడటం అసంకల్పితంగా జరిగిపోయింది. ఈ రెండు జీవితాలతోనూ నాకు గాఢమైన పరిచయం ఉండడం, ఆ జీవన విధానాలతో నాకు అంగీకారం ఉండటం ఆయా అనువాదాలను ప్రాణంతో నిలబెట్టే ప్రక్రియలో నాకు ఎంతగానో సాయపడ్డాయి. అవి రెండూ పరస్పర పూరకాలు. నాలాంటి వారికి బతుకంటే కాంక్ష కలిగించగల సజీవ జీవన చరిత్రలు.

ఇంటర్వ్యూ ■ **కొల్లూరి సోమ శంకర్**

యువ రచయితల ముందున్న మార్గం మునుపటి కంటే సంక్లిష్టం

తెలుగు సాహిత్య రంగంలో ఇటీవల చోటు చేసుకుంటున్న కొన్ని ఆసక్తికర ధోరణుల గురించి 16 ఫిబ్రవరి 2026 నాటి 'వివిధ'లో 'అసలు ఊహించామా ఇంతమంది పాఠకులను!' అనే వ్యాసంలో మిత్రుడు పవన్ సంతోష్ సూరంపూడి ప్రస్తావించారు. దానికి కొనసాగింపుగా, ఆయా ధోరణుల మూలాలను అన్వేషించే ప్రయత్నం ఈ వ్యాసం.

ప్రింట్ మీడియా నిస్సందేహంగా వెనుకంజ వేసింది. ఒకప్పుడు తెలుగు భాషనీ, సాహిత్యాన్నీ నిర్వచించి నిర్వహించిన పత్రికలు నేడు లేవు; అలాగే బాల్యదశ నుండీ పాఠకుల చేయిపట్టుకొని అభ్యుదయం వైపుగా నడిపించిన సోవియట్ సాహిత్యమూ లేదు. మరోవైపు గ్రంథాలయ వ్యవస్థ కుప్పకూలిపోయింది. ఈ రెండు ధోరణులూ – నెమ్మదిగానైనా పెరుగుతూ వస్తున్న గ్రామీణ అక్షరాస్యత నడుమ సంభవించడం ఒక విషాదం. కొత్త తరం అక్షరాస్యులకు ప్రింటు మీడియా సాహిత్యం అందుబాటు లేకుండా పోయింది; డిజిటల్ మీడియాని అందుకొనే స్తోమత, అవకాశాలూ కొద్ది మందికే ఏర్పడ్డాయి. ఇందుకు ప్రతిస్పందనగా పుస్తకాల 'తోపుడు బండి,' 'మరో గ్రంథాలయ ఉద్యమం' వంటి క్షేత్రస్థాయి ప్రయత్నాలు జరిగాయి; జరుగుతున్నాయి. ప్రభుత్వాల వైఫల్యాన్ని ఈ చెదురు మదురు ప్రయత్నాలు పూడ్చలేవు. ఇతర దక్షిణాది రాష్ట్రాలలోనూ, బెంగాల్, కేరళలలో పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉన్నది. గ్రంథాలయాల అభివృద్ధికీ, సాహిత్యవికాసానికీ ఈ రాష్ట్రాలు, యావద్భారత దేశానికి మార్గదర్శకంగా నిలిచాయి.

తెలుగు రాష్ట్రాల విద్యా విధానానికిగల ప్రత్యేకత – సామాజిక శాస్త్రాలపై చిన్నచూపు. సాంకేతిక విద్యకు సముచిత స్థానం ఇవ్వడం సరైనదే అని భావించినా, ఈ రెండిటిమధ్యా పోటీ ఉండనవసరం లేదని పొరుగు రాష్ట్రాల అనుభవాలు తెలియజేస్తున్నాయి. ఈ ధోరణులన్నీ రాజకీయాలకు అతీతంగా, కేవలం పాలకుల అసమర్థత మూలంగానే చోటు చేసుకుంటున్నాయనుకుంటే అది అమాయకత్వం అవుతుంది. నేటి బుల్‌డోజర్ పాలనలో – గ్రంథాలయాల నిధులను తొక్కిపెట్టడం, హిందీని బలవంతంగా రుద్దడం, సామాజిక శాస్త్రాల నుండి యువతరాన్ని దూరం పెట్టడం– ఇవన్నీ ఒక పథకం ప్రకారమే జరుగుతున్నాయి. యువతరాన్ని సమాజానికీ, సమిష్టితత్వానికీ ఎడంగా, కేవలం వ్యక్తిగత విజయాలపైనే దృష్టి పెట్టేవారిగా కట్టడి చేయడం పాలకుల లక్ష్యం.

...రెండవ తరహా రచనలకు వొస్తే – నేటి వాణిజ్య ప్రపంచపు విజయాలకు కొలమానాలైన తక్షణ కీర్తి, విశేషమైన ధనార్జన – ఇవే వీటి పరమావధి. ఇవి సహజంగానే రూప–సారాల్లో మార్కెట్ శక్తులతోనూ, సినిమా పరిశ్రమతోనూ ముడిపడి ఉంటాయి; ఆయా రచయితలు సినిమా రంగ ప్రవేశానికై ఉవ్విళ్లూరుతుంటారు. రచనల్లో ఏముంది అనే చర్చకన్నా ఎన్ని కాపీలు అమ్ముడుపోయాయి? అనేదే చర్చాంశంగా నిలిచిపోతుంది.

పైన పేర్కొన్న అవలక్షణాలకు ప్రతిస్పందనగానే నేడు ద్రవిడ సాంస్కృతికోద్యమాలు బలపడుతున్నాయి. బుక్ బ్రహ్మ ఉత్సవానికీ, తదితర దక్షిణభారత భాషల సాహితీ కార్యక్రమాలకూ లభిస్తున్న ఆదరణ, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, హిందీయేతర భాషలకు జాతీయస్థాయి సాహిత్య పురస్కారాలని ప్రకటించడం – ఇవేవీ కాకతాళీయంగా జరిగిపోతున్న పరిణామాలు కాదు. ప్రముఖ దక్షిణాది నటులు ప్రకాష్ రాజ్ సాహిత్య సభల్లో చేస్తున్న ప్రసంగాలను, అలాగే కమల్ హసన్ పార్లమెంటులో శ్రీశ్రీని ఉటంకించడాన్ని కూడా ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవాలి.

నేటి యువతరం రచనలో కనిపిస్తున్న ధోరణులను – ఈ వ్యాస లక్ష్యాల పరిధిలో పరికిస్తే, రెండు రకాల రచనలు మనకు స్పష్టంగా కనిపిస్తాయి. మొదటగా – సాహిత్యం ఏకకాలంలో సాగే బాహ్యసమాజ సందర్భం, అంతర్ముఖ ప్రయాణం అనుకుంటే – నిబద్ధతతో కూడిన నేటి తరం చేస్తున్న రచలను శ్రద్ధగా పరిశీలించాలి. అవి చుట్టూ ఉన్న సంక్షోభ శకలాలతో తలపడుతూ, నిత్యం సంఘర్షిస్తూ రాసుకున్నవి; ఆధునిక సమాజపు అనిశ్చతలతోనూ, మానవసంబంధాల విచ్ఛిన్నంతోనూ,





అత్యంత వేగవంతంగా మారిపోతూన్న పరిస్థితులతోనూ తలపడుతూ రాసుకున్నవి. నగరజీవన ఆకర్షణలు పైపై తళుకుబెళుకులే అని వాళ్లకి తెలుసు. వాళ్లని నిలదీసేవి స్త్రీ–పురుష సంబంధాలు, లైంగికత్వం, పెళ్లి – వీటి చుట్టూ పేరుకుపోయిన అస్థిరతలు. అనేక రకాల వివక్షలు ఆధారంగా నిర్మితమైన ప్రపంచం తన ఆధునిక రూపంలో సృష్టిస్తూన్న అసంబద్ధ అయోమయాలలో తామెవరో తెలుసుకొనేందుకు చేస్తున్న ప్రయత్నాలు వారివి. ముందుతరంలో ఉండిన సుస్థిరతలు ఇప్పుడు లేవు. సంప్రదాయాలే మనకు శ్రీరామరక్ష అనిగాని, విప్లవమే అన్నిటికీ పరిష్కారం అనిగానీ ఎవరైనా అంటే అది వాళ్లకి ఆమోదయోగ్యం కాదు. యువతరం రచనల్లో దిక్కుతోచని విషాదం ఇమిడి ఉన్నది.

ఇక రెండవ తరహా రచనలకు వొస్తే– నేటి వాణిజ్య ప్రపంచపు విజయాలకు కొలమానాలైన తక్షణ కీర్తి, విశేషమైన ధనార్జన– ఇవే వీటి పరమావధి. ఇవి సహజంగానే రూప–సారాల్లో మార్కెట్ శక్తులతోనూ, సినిమా పరిశ్రమతోనూ ముడిపడి ఉంటాయి; ఆయా రచయితలు సినిమారంగ ప్రవేశానికై ఉవ్విళ్లూరుతుంటారు. రచనల్లో ఏముంది అనే చర్చకన్నా ఎన్ని కాపీలు అమ్ముడుపోయాయి? అనేదే చర్చాంశంగా నిలిచిపోతుంది. ఏ రచయిత అయినా ఎక్కువమంది పాఠకులను చేరుకోవాలనే అనుకుంటాడు. రచనలో సత్తా ఉంటే అది ఎప్పటికైనా చేరాల్సిన పాఠకులను చేరుకుంటుంది. ఏది ఏమైనా పాఠకుల సంఖ్య పెరగడం, సాహిత్య కార్యక్రమాలకు, పుస్తక ప్రదర్శనలకు పెద్దఎత్తున యువతీయువకులు హాజరుకావడం ఆహ్వానించాల్సిన పరిణామమే. పుస్తక పఠనం అలవాటుగా మారాలేగానీ, అది తనంటతానే పరిణితి చెందుతుంది.

సినిమాలకు సాహిత్యంతో అవసరం ఎప్పుడూ ఉంటుంది. జాతీయ, అంతర్జాతీయ సినిమాల నిర్మాణానికి నవలలు, కథలు ఆధారంగా నిలిచాయి. అయితే అవేవీ సినిమా మాధ్యమాన్ని లక్ష్యంగా పెట్టుకొని చేసిన రచనలుకావు. ఉత్తమ సాహిత్యం యథాస్థితిని ప్రతిఘటిస్తుంది; కట్టుబాట్లని ప్రశ్నిస్తుంది. ఇతివృత్తపరంగానూ, శైలిలోనూ మూసపద్ధతిని వొదిలించుకొనే ప్రయత్నం చేస్తూనే ఉంటుంది. ఇందుకు తెలుగు సాహిత్యంలో ఎన్నో ఉదాహరణలున్నాయి. ఈ మేరకు నేటి యువ రచయితల మార్గం కూడా భిన్నం కాదు. అయితే కచ్చితంగా పూర్వం కన్నా సంక్లిష్టం. రాబోయే రోజుల్లో బాహ్య, అంతర్జాతీయ సామాజిక సందర్భం కూడగట్టే ప్రతిఘటన వైపుగా, అంతర్ముఖ ప్రయాణం ఏర్పరచే స్పష్టత దిశలో మన యువ రచయితలు ప్రయాణించబోతున్నారు. వారికి డిజిటల్ ప్రపంచం అవరోధంగా కాకుండా, సర్వవ్యాపిత సాధనంగా ఉండబోతోంది. ఈ విషయంలో ఎవరికీ ఎటువంటి సందేహమూ ఉండనక్కరలేదు.

■ **ఉణుదుర్తి సుధాకర్**
✆ 90006 01068





గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, పెమ్మసాని చంద్రశేఖర్





వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగస్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



బైకులు, కార్లతో ర్యాలీగా వస్తున్న కేంద్ర మంత్రులు, పార్టీ నాయకులు

డాక్ సేవకులతో.. స్వర్ణాంధ్ర

- వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగమవ్వాలి
- దేశంలో కీలక లాజిస్టిక్ వ్యవస్థగా డాక్ సేవకులు
- గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనంలో సీఎం చంద్రబాబు
- ఉత్తమ సేవకులకు ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రుల సన్మానం
- గుంటూరులో అట్టహాసంగా సమ్మేళనం.. భారీ ర్యాలీ.. 10 వేలమందితో సభ

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): 'స్వర్ణాంధ్ర సాధనకు డాక్ సేవకులే వెన్నెముకగా ఉండాలి. వికసిత్ భారత్ సాధనలో డాక్ సేవకులు భాగం కావాలి. ప్రజలకు అందే సంక్షేమంలో 33 శాతం పోస్టల్ శాఖ ద్వారానే అందింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసే మంచిని గ్రామీణ డాక్ సేవకులే (జీడీఎస్) ప్రజలకు చేర్చాలి. టెక్నాలజీ ఎంత పెరిగినా, ఎన్ని ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చినా జీడీఎస్ ఉద్యోగులను మించిన విధులు ఎవరూ చేయలేరు. ప్రభుత్వం అమలు చేసే సూపర్ 6, సూపర్ సక్సెస్ అయిందంటే అందుకు కారణం జీడీఎస్ ఉద్యోగులే. దేశంలోనే అత్యంత కీలకమైన లాజిస్టిక్ వ్యవస్థగా డాక్ సేవకులు సేవలందిస్తున్నారు..' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్‌శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గుంటూరు శివారులోని శ్రీసత్యసాయి స్పిరిచ్యువల్ సిటీలో ఆదివారం గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తొలుత చిత్తూరు, కర్నూలు, విశాఖపట్నం, కడప డివిజన్, కర్నూలు రీజియన్ల నుంచి 10 మంది జీడీఎస్ బ్రాంచ్ పోస్టుమాస్టర్, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లను సింధియా, చంద్రబాబు సన్మానించారు. ఉత్తమ సేవకులకు సింధియా స్వయంగా కోటు తొడిగి, గుండీలు పెట్టి వారిని ఆప్యాయంగా పలకరించారు. పెమ్మసాని చంద్రశేఖర్ వారికి 'డాక్ నాయక్' టోపీలు తొడిగి అభినందించారు. డాక్ సమ్మేళనంలో భాగంగా గుంటూరులో ర్యాలీలు నిర్వహించారు. పెమ్మసాని నేతృత్వంలో కాజ టోల్‌గేటు నుంచి గుంటూరులోని వేదిక వరకూ భారీ ర్యాలీ జరిగింది. కార్లు, బైకులతో జాతీయ రహదారిపై సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి పది వేల మంది డాక్ సేవకులు ఈ సమ్మేళనంలో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తూ దేశంలో పోస్టల్ సేవలకు ప్రత్యామ్నాయం లేదన్నారు. కృత్రిమ మేథ ఎంత వచ్చినా హ్యూమన్ టచ్‌తో పని చేసేది జీడీఎస్ లాంటి సమర్థవంతమైన ఉద్యోగులకే సాధ్యమన్నారు. టెక్నాలజీ ఎంత పెరిగినా వారి స్థానాన్ని భర్తీ చేయలేమన్నారు. భారతీయ తపాలా శాఖకు ఉన్నంత నెట్వర్క్ మరే వ్యవస్థకూ లేదన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో (మిగతా 6లో)



గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనం సమావేశం తర్వాత తిరిగి వెళుతున్న ఉద్యోగస్తులు



గ్రామీణ డాక్ సేవ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు సింధియా, పెమ్మసాని



చంద్రబాబుతో ముచ్చటిస్తున్న జ్యోతిరాదిత్య సింధియా



ఉత్తమ సేవలు అందించిన అరుణకు అవార్డు అందజేస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి సింధియా

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- కేంద్రాలకు గంట ముందే రావాలి
- ఏర్పాట్లు పరిశీలించిన ఆర్ఐఓ సునీత



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్ఐవో జీ సునీత

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ మీడియట్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో ఆయా పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు, ఇతర మౌలిక వసతులను ఇంటర్ బోర్డు ఆర్ఐఓ సునీత ఆదివారం పరిశీలించారు. ప్రభుత్వ బాలికల జూనియర్, ఇతర కళాశాలలో సౌకర్యాలను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 35,485 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 32,144 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరికోసం 87 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు విద్యార్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. 1300 పైగా సీసీ కెమేరాలు ఏర్పాటు చేయగా పరీక్షల పర్యవేక్షణకు మూడు సిట్టింగ్, నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్లతో పాటు హైపవర్ కమిటీ ఏర్పాటు చేశారు. జిల్లాలో ఇంటర్ పరీక్షల పర్యవేక్షణ అధికారిగా డీవీఈఓ పద్మావతిని నియమించారు.

కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు : ఎస్పీ

గుంటూరు: ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. విద్యార్థులు ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదన్నారు.



- 3.52 కి.మీ. రైలు మార్గానికి టెండర్లు
- భూసేకరణకు రూ.36.2 కోట్లు కేటాయింపు
- కీలకమైన ఎర్రుపాలెం వద్ద యార్డు రీమోడలింగ్

అమరావతి రైలుకు తొలి అడుగు

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నూతన రైలుమార్గం నిర్మాణంలో తొలి అడుగుపడింది. ప్రతిపాదిత ఎర్రుపాలెం-నంబూరు(వయా అమరావతి) ఎలైన్‌మెంట్‌లో కీలకమైన యార్డు రీమోడలింగ్ సహా పెద్దాపురం వరకు రైలుమార్గం నిర్మించేందుకు దక్షిణ మధ్య రైల్వే నిర్మాణ సంస్థ టెండర్లు పిలిచింది. ఆ సెక్షన్‌లో అవసరమైన భూమి అందుబాటులో ఉండటంతో టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఇందుకోసం రూ.36.2 కోట్లను రైల్వే శాఖ ఖర్చు చేయనున్నది. ఈ పని పూర్తి అయితే ఆ తర్వాత సెక్షన్ల వారీగా నూతన రైలుమార్గాన్ని అమరావతి మీదగా నంబూరు వరకు నిర్మించవచ్చు. ఈ నేపథ్యంలో గుంటూరు, కృష్ణా జిల్లాల్లో అమరావతి రాజధాని రైలుమార్గం కోసం గజిట్ నోటిఫికేషన్ చేసిన సర్వే నంబర్లలో రెవెన్యూ అధికారులు త్వరితగతిన భూములు సేకరించాల్సిన అవసరం ఏర్పడింది. 15 నెలల వ్యవధిలోనే ఈ రెండు పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నది. ఈ పని పూర్తి అయితే ఆ తర్వాత సెక్షన్ల వారీగా రైలుమార్గం నిర్మాణాన్ని పూర్తి చేసి కనెక్టివిటీని ఇచ్చుకోవచ్చు. అలానే నంబూరు వద్ద కూడా యార్డు రీమోడలింగ్ భవిష్యత్తులో చేయాల్సి ఉంటుంది. కొద్ది రోజుల్లో టెండర్లు ఖరారై నిర్మాణ పనులు పూర్తి కానున్న నేపథ్యంలో గుంటూరు, కృష్ణ జిల్లాల్లో ఈ ప్రతిపాదిత రైలుమార్గం కోసం నిర్ణయించిన గ్రామాల్లో భూసేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి.

పట్టాలెక్కనున్న పనులు

2014-19 మధ్యనే కేంద్రాన్ని ఒప్పించి ఎర్రుపాలెం - నంబూరు (వయా అమరావతి) రైలుమార్గాన్ని అప్పటి టీడీపీ ప్రభుత్వం మంజూరు చేయించింది. అయితే వైసీపీ హయాంలో ఐదేళ్లు ఊసే లేదు. 2024లో కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చాక మళ్లీ పట్టాలెక్కింది. 56.53 కిలోమీటర్ల పొడవునా తొలుత సింగిల్ లేన్‌గా రైల్వేట్రాక్ నిర్మాణం చేస్తారు. ఇందుకోసం రూ.2047.40 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ విజయవాడ - ఖమ్మం సెక్షన్‌లో మెయిన్‌లైన్‌లో ఉన్నది. ఈ నేపథ్యంలో అక్కడ నూతన రైలుమార్గం కనెక్టివిటీ కోసం యార్డు రీమోడలింగ్ చేయాలి. ఇందుకోసం ప్రీ నాన్ ఇంటర్‌లాకింగ్, ఇంటర్‌లాకింగ్ పనులు చేపట్టాలి. వీటి నిమిత్తం ఆ రైలుమార్గంలో బ్లాక్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అలానే కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ తనిఖీ చేసి ఓకే చెప్పాల్సి ఉన్నది.

పెండ్లి కుమారుడిగా నృసింహుడు

- మంగళాద్రిలో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పెండ్లి కుమారుడి అలంకారంలో మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి భక్తులకు కను విందు చేశారు. బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడుతూ అర్చకులు దిగువ సన్నిధిలోని నృసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆదివారం ఉదయం పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించారు. సంప్రదాయంగా వస్తున్న ఆనవాయితీని అనుసరించి మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘ ప్రతినిధులు షరాబ్ బజారులోని రెండు రామమందిరాల వద్ద నుంచి మంగళవాయిద్యాలతో స్వామివారికి పట్టువస్త్రాలను తీసుకువచ్చారు. తొలుత ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులకు పంచామృత స్నపనతో మంగళస్నానాలు చేయించారు. ఆ తర్వాత పద్మశాలీయ సంఘం సమర్పించిన పట్టువస్త్రాలతో స్వామిని అలంకరించారు. పెండ్లి కుమారుడైన శ్రీలక్ష్మీనృసింహస్వామి ఉభయ దేవేరులతో కలిసి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. సాంస్కృతి కార్యక్రమాలు, దేవతామూర్తుల వేషధారణలు భక్తులను అలరించాయి. ప్రధాన అర్చకులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు ఉత్సవం నిర్వహించగా, కార్యనిర్వహణాధికారి కే.సునీల్‌కుమార్ పర్యవేక్షించారు. స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించిన వారిలో పద్మశాలీయ బహూత్తమ సంఘం అధ్యక్షుడు గుత్తికొండ ధనుంజయరావు, గౌర వాధ్యక్షుడు చింతక్రింది కనకయ్య, ప్రధాన కార్యదర్శి దామర్ల కుబేరస్వామి, గంజి రవీంద్ర నాథ్, మునగపాటి వెంకటేశ్వరరావు, దామర్ల మోహన్, అందె కనకలింగేశ్వరరావు, కొల్లి శివాజీ, ప్రసాద్, బిట్రా భాస్కరరావు, జొన్నాదుల బిక్షారావు వున్నారు.



పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తె అలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి



స్వామివార్లకు పట్టువస్త్రాలు తీసుకువస్తున్న పద్మశాలీయ బహూత్తమ సంఘ ప్రతినిధులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులతో మంత్రి నాదెండ్ల మనోహర్

ఆనందం ఆహ్లాదం

- కూటమి ప్రభుత్వ లక్ష్యమిదే
- తెనాలిలో హ్యాపీ సండే సందడిలో మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. చినరావూరు పార్కు వద్ద హ్యాపీ సండే జరిగింది. ఈ కార్యక్రమాన్ని మంత్రి మనోహర్ ప్రారంభించి మహిళలు, చిన్నారులతో మమేకమై ముచ్చటించారు. బాల బాలికల ప్రదర్శనలు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరుకుల పరుగుల జీవనంతో పలువురు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని చెప్పారు. హ్యాపీ సండేలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఆనందంగా గడిపి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కళలు, కళాకారులకు తెనాలి నిలయమని, ఆ వారసత్వాన్ని భావితరాలకు అందించే వేదికగా వినియోగించుకోవాలన్నారు. తెనాలి వైభవానికి ఏమాత్రం తీసిపోకుండా సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలతో హ్యాపీ సండే సాగేలా రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ యేసుబాబు, కౌన్సిలర్ మానసారెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ రాంప్రసాద్, మేనేజర్ జయకర్, మెప్మా సీఎంఎం విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సాయంత్రం 6.17 (సోమవారం)

సహరి : ఉదయం 5.11 (మంగళవారం)

మరణంలోనూ వీడని బంధం

- ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం అక్కాచెల్లెళ్ల మృతి

చేనేతల సంక్షేమం పట్టని పాలకులు

- మంగళగిరిలో నేత కార్మికుల భారీ ప్రదర్శన

6

సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు విశేష స్పందన

● అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు తులసి విష్ణు ప్రసాద్



పరీక్ష పత్రాలను ఆవిష్కరిస్తున్న కొలసాని తులసి విష్ణు ప్రసాద్

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్, ఈ అభ్యాస్ అకాడమీ సంయుక్తంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ లెవెల్ 2 ప్రతిభ పరీక్షలకు విశేష స్పందన లభించిందని అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు కొలసాని తులసి విష్ణు ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక అరండల్ పేట కెనడి హైస్కూల్లో పరీక్ష పత్రాలను ఆవిష్కరించిన అనంతరం విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ ఈ అభ్యాస్ అకాడమీ సహకారంతో 'సాట్' ఒలంపియాడ్ ప్రతిభ పరీక్ష రెండు దశల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు. హైస్కూల్ స్థాయిలో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, విశ్లేషణాత్మక నైపుణ్యం, తార్కిక ఆలోచనలను ప్రోత్సహిస్తూ గ్లోబల్ విద్యార్థులుగా రాణించేందుకు అపుస్మా జాతీయస్థాయిలో కృషి చేస్తున్నదని తెలియజేశారు. ఈ అభ్యాస అకాడమీ ఛైర్మన్ డాక్టర్ భువనగిరి ఫణి, పవన్ శాస్త్రి, సీఈవో బి.సాయి రామకృష్ణ, పవన్ శాస్త్రి, సాయి, కెనడీ శ్రీకాంత్ బాబు, విస్డమ్ రవి, చైతన్య సాంబిరెడ్డి, జిల్లా అధ్యక్షులు నాయుడు చక్రనాగ్ పాల్గొన్నారు.

భర్త మందలించాడని.. భార్య ఆత్మహత్య

వినుకొండటౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మాట్లాడుతుండగా భర్త మందలించాడని ఎలుకల మందు పేస్ట్ తిన్న భార్య చికిత్స పొందుతూ.. ఈ నెల 21న మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని విఠంరాజుపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. విఠంరాజుపల్లి గ్రామానికి చెందిన చల్లా శివనందిని (20) ఫోన్ మాట్లాడుతుందని భర్త మహేష్‌బాబు మందలించాడు. దీంతో ఈ నెల 17న ఆమె ఎలుకల మందు పేస్టు తినింది. అనంతరం ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందింది. నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ ఉదయలక్ష్మి తెలిపారు.

అమరావతిలో పర్యటించిన ఒడిశా యువత



ద్యానబుద్ధ ప్రాజెక్టు సందర్శించిన ఒడిశా యువత

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) ఒడిశాకు చెందిన 37మంది యువతీ యువకులు ఆదివారం ఉదయం పర్యాటక కేంద్రమైన అమరావతిలో పర్యటించారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో జరుగుతున్న అంతర్ రాష్ట్రీయ యవ సమ్మేళనంలో పాల్గొన్న వీరు.. అమరా వతిలోని పర్యాటక ప్రదేశా లను, అమరేశ్వ రాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్ర మంలో మై భారత్ కేంద్రం జిల్లా ఉపసంచాలకులు దేవిరెడ్డి కిరణ్మయి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల యువత మధ్య జాతీయ ఐక్యత, సమగ్రతను పెంపొందించే లక్ష్యంతో యువ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. అమరావతి పర్యటనలో వారికి జనచైతన్య సమితి నిర్వాహకులు సహకరం అందించారు. సమితి కోఆర్డినేటర్ వి.అనిల్, టి సాంబశివరావు, బి.జయరావు, మై భారత్ పోగ్రాం అధికారి పృథ్వి, పేస్ సోసైటీ కార్యదర్శి పి.రమేష్ పాల్గొన్నారు.

బ్యాంక్ లాకర్‌లో నగలు మాయం

తుళ్లూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకటపాలెం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో బంగారు నగలు మాయం అయ్యాయి. ఎస్ఐ కలగయ్య సమాచారం మేరకు ఈ నెల 2న సేఫ్ లాకర్‌లో ఉంచిన రెండు పౌంచ్‌లలోని 328 గ్రాముల నగలు కనిపించడం లేదు. ప్రాథమిక అంతర్గత తనిఖీ, సీసీ టీవీ పరిశీలనలో అదే బ్రాంచ్‌లో పని చేస్తున్న ఉద్యోగి సంధ్యారాణి నగలు తీసుకెళ్లినట్లు అనుమానాలు వ్యక్తం చేస్తూ.. ఫిర్యాదులో మేనేజర్ పేర్కొన్నారు. ఈ మేరకు సంధ్యారాణి మీద కేసు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చేనేతల సంక్షేమం పట్టని పాలకులు

● బడ్జెట్‌లో న్యాయమైన వాటా కల్పించాలి
● మంగళగిరిలో చేనేతల భారీ ప్రదర్శన



నేతన్న విగ్రహానికి నూలు దండలు వేస్తున్న చేనేత జేఏసీ నాయకులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): దేశంలో అతి పెద్ద ఉపాధి కల్పన రంగాల్లో ఒకటైన చేనేతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించడం బాధాకరమని ఏపీ చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్ పిల్లలమర్రి నాగేశ్వరరావు అన్నారు. చేనేత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరిలో చేనేత గర్జన నిర్వహించారు. తొలుత చేనేత కార్మికులతో కలిసి మంగళగిరి గాలిగోపురం వద్ద నుంచి ప్రధాన రహదార్ల మీదుగా చినకాకాని నేతన్న సర్కిల్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. నేతన్న విగ్రహానికి నూలు దండలు వేసిన అనంతరం బహిరంగ సభను ఉద్దేశించి పలువురు జేఏసీ నేతలు ప్రసంగించారు. చేనేత రంగాన్ని కాపాడుకోవడం ద్వారా లక్షలాది కుటుంబాలకు ఉపాధి భద్రతను కల్పించవచ్చన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర బడ్జెట్‌లో చేనేతకు రూ.25 వేల కోట్లు, రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించి సకాలంలో నిధులు విడుదల చేయాలని, సహకార సంఘాలకు చెల్లించవలసిన రూ.203 కోట్లను విడుదల చేయాలని, ఏటా ప్రతి కార్మికుడికి రూ.25 వేల సాయం అందించాలని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అమలు చేయాలని, సహకార సంఘాల రుణాలను రద్దు చేసి, జిల్లా కోఆపరేటివ్ బ్యాంకుల రుణాలపై వడ్డీ రాయితీ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 11 రకాల చేనేత రిజర్వేషన్ చట్టాన్ని కఠినంగా అమలు జరపాలని, చేనేత ముడి సరుకులపై విధించిన జీఎస్టీని రద్దు చేసి సబ్సిడీ ధరలకు సరఫరా చేయాలని, రైతుల మాదిరిగా చేనేత వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేసి, రుణమాఫీ పథకాన్ని అమలు చేయాలని, ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపోయిన కార్మికులకు పరిహారం, నెలకు రూ.పది వేల చొప్పున రెండు నెలలపాటు ఆర్థికసాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ స్థాయిలో హ్యాండ్లూమ్ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. చేనేత గర్జన ద్వారా కార్మికుల సమస్యలపై చర్చించి ప్రభుత్వాలకు విన్నవించడమే తమ లక్ష్యమని, పాలకులు చేనేతల దుస్థితిని గమనించి న్యాయం చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘాల జేఏసీ కోకన్వీనర్లు బండారు ఆనందప్రసాద్, పిల్లలమర్రి బాలకృష్ణ, నేతలు కట్టా దుర్గారావు, వి.రమేష్, అల్లక తాతారావు, కృష్ణప్రసాద్, మాచర్ల మోహన్, దేవన వీరనాగేశ్వరరావు, రామనాథం పూర్ణచంద్రరావు, రాపోలు జగన్, నీలూరి రూహ్యంగప్ప, కూరపాటి కోటేశ్వరరావు, కాసుల రవికుమార్, సమతం రమణ మహేష్, ఇమ్మంది భీమేశ్వరరావు, షణ్ముఖ వర్మ పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో యువతికి వల.. నగదు వసూలు

● నిందితుడి బాధిత లిస్టులో మరికొందరు..
● ఫిర్యాదు చేయాలంటున్న సీఐ సాంబశివరావు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సాంబశివరావు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి పేరుతో మహిళలను మోసం చేస్తున్న వ్యక్తిని త్రీ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ సాంబశివరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొల్లిపర మండలం కొత్తూరు లంకకు చెందిన అరవపల్లి వంశీ తెనాలి పట్టణంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న మహిళను మోసం చేసి రూ.12.20 లక్షలు తీసుకున్నాడు. మోసపోయాయని గ్రహించిన మహిళ త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని గాలించి అరెస్టు చేశామన్నారు. మ్యాట్రిమోని ద్వారా పెళ్లి కాని అమ్మాయిల వివరాలు తెలుసుకుని తనకు విడాకులు అయ్యాయని మళ్లీ వివాహం చేసుకోవాలని మంచి మాటలతో నమ్మించేవాడు. అలానే బాధితురాలు పనిచేస్తున్న ఆఫీసుకు, ఇంటికి పలుమార్లు తిరిగి నమ్మించాడు. టిప్పర్ కొనుగోలు చేస్తున్నానని డబ్బులు అవసరమయ్యాయని చెప్పి తన తల్లితో కూడా మాట్లాడించేవాడు. ఆ మహిళ దగ్గర డబ్బులు లేకపోవడంతో బంగారు నగలు బ్యాంకులో తాకట్టు పెట్టించి, స్నేహితుల బ్యాంకు అకౌంట్లకు జమ చేయించాడు. ఈ నెల 8న వివాహం చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం పెట్టుకున్న అనంతరం మరింత డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. ఇవ్వలేనని చెప్పడంతో దాడి చేసి దూషించాడు. చంపుతానని, తన వ్యక్తిగత జీవితాన్ని అందరికి చెబుతానని బెదిరించినప్పటికి మహిళ ధైర్యంగా ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపారు. ఇదే విధంగా త్రీ టౌన్ పరిధిలో మరికొందరు మహిళలను మోసం చేసి రూ.40 లక్షల వరకు తీసుకున్నాడని సీఐ తెలిపారు. నిందితుడి సెల్‌ఫోన్ ఆధారంగా విచారణ చేస్తే మరికొందరు బాధితులు ఉన్నట్లు తెలిసిందన్నారు. పరువు కోసం ఎవరూ ముందుకు రాకపోవడంతో ఇలాంటి వారి ఆటలు సాగుతున్నాయన్నారు. అతని నుంచి రూ.1.20 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచనున్నట్లు చెప్పారు. నిందితుడి మోసాలకు గురైన మహిళలు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని, వారి వివరాలు గోప్యంగానే ఉంచుతామన్నారు.

రమేష్ హాస్పిటల్స్‌లో ఏఐ సీటీ కరోనరీ యాంజియోగ్రఫీ

● హాస్పిటల్స్ చీఫ్, కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు



మాట్లాడుతున్న ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చీఫ్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో దేశంలో తొలిసారిగా ఏఐ ఆధారిత సీటీ కరోనరీ యాంజియోగ్రఫీ (సీటీసీఏ), ఎఫ్ఎఫ్ఆర్, గైడెడ్ పీసీఐ సాంకేతికతలను ప్రవేశపెట్టిందని హాస్పిటల్స్ చీఫ్, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు వెల్లడించారు. గుంటూరులోని జింఖాన అడిటోరియంలో ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ సహకారంతో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో 100వ కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ, కేరళ, ఏపీలోని వైద్యులు, దాదాపు 800 మంది విద్యార్థులు హాజరయ్యారు. సదస్సులో విశ్లేసించిన అంశాలను మీడియా సమావేశంలో ఆయన వివరించారు. సీటీసీఏ సాంకేతికత ద్వారా కేవలం 15-20 నిమిషాల్లో కరోనరీ రక్తనాళాల పూర్తి త్రీడీ చిత్రాలు తీసి, బ్లాకేజ్ శాతాన్ని నొప్పి లేకుండా కచ్చితంగా నిర్ధారించవచ్చన్నారు. సీటీ ఎఫ్ఎఫ్ఆర్‌లో ప్లాక్ ముందు, వెనుక రక్త ప్రవాహ ఒత్తిడి వ్యత్యాసాన్ని కచ్చితంగా కొలుస్తుందన్నారు. విలువ 0.75 కంటే తక్కువగా ఉంటే స్టంట్ లేదా బైపాస్ సర్జరీ ద్వారా చికిత్స అందిచడంతో మెరుగైన ఫలితాలు వస్తాయని అన్నారు. ఆస్పత్రిలో దాదాపు 30వేల సీటీ కరోనరీ యాంజియోగ్రఫీ పరీక్షల డేటాను విశ్లేషించగా, ఈ సాంకేతికత లభించిందని తెలిపారు. రోగులందరికీ ఒకే విధంగా మందులు సూచించడం శాస్త్రీయంగా సమంజసం కాదని, లిపిడ్ ప్రొఫైల్, డయాబెటిస్, బీపీ, కుటుంబ చరిత్ర ఆధారంగా మాత్రమే చికిత్స నిర్ణయించాలన్నారు. ఈ సదస్సులో కార్డియాలజీ నిపుణులు డాక్టర్ రాజా రమేష్, డాక్టర్ అనూప్, డాక్టర్ రామ్ మనోహర్, డాక్టర్ ఎంఆర్ఎన్ మహేష్, డాక్టర్ స్వరాజ్యం, డాక్టర్ శబరి గిరీష్, డాక్టర్ కృష్ణప్రసాద్, డాక్టర్ ఎస్.వి.కె. రామకృష్ణ, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ అనూష పీడియాట్రిక్ కార్డియాలజిస్టులు డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, డాక్టర్ జ్యోతిప్రకాష్ రెడ్డి, డాక్టర్ శిల్పా చౌదరి, డాక్టర్ కార్తికేయ తదితరులు ప్రసంగించగా, ఐఎమ్ఏ గుంటూరు అధ్యక్షుడు డాక్టర్ సుబ్బారాయుడు, డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ గార్లపాటి నందకిశోర్ పర్యవేక్షించారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ డిప్యూటీ ఎమ్‌డీ డాక్టర్ రాయపాటి మమత, డాక్టర్ సుమ, డాక్టర్ నితిన్ తదితరులు పాల్గొన్నారు.

వీణ సంప్రదాయానికి ప్రతీక....ఈమని శంకరశాస్త్రి



పురస్కార గ్రహీతలతో డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ రామరాజు శ్రీనివాస్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): దేశంలో వీణా వాయిద్యానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన కళాకారుడు ఈమని శంకరశాస్త్రి అని మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.లక్ష్మీనారాయణ కొనియాడారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో రామరాజు ఫౌండేషన్, ఇన్‌ఫ్రా డెవెలపర్స్ అధినేత డాక్టర్ రామరాజు శ్రీనివాస్ దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం పద్మశ్రీ ఈమని శంకరశాస్త్రి పురస్కార ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్టీఆర్ జీవిత చరిత్ర రచనలో భాగంగా సీతా రాముల కల్యాణం చిత్రంలోని ఈమని శంకరశాస్త్రి వీణ సంగీతాన్ని గురించి రాసుకున్నానని గుర్తుచేసుకున్నారు. ఎన్టీఆర్ పాలనలో ప్రముఖులు రాష్ట్రానికి వస్తే ఆయన వీణ వాయిద్యాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. చంద్రబాబు పాలనలోనూ దీనిని కొనసాగించారన్నారు. రామరాజు శ్రీనివాస్ దంపతులు గుర్తుపెట్టుకుని ఆయన పేరుతో పురస్కారాలు అందజేయడం అభినందనీయ మన్నారు. అనంతరం ప్రముఖ వీణా విద్వాంసులు పారుపల్లి సుజనకు సాహితీ వేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం, గౌరవ అతిథులు ప్రముఖ సంగీత సాహితీ వేత్త డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, విజ్ఞేశ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ వంశీ రామరాజు, రామరాజు శ్రీనివాస్‌తో కలిసి కె.లక్ష్మీనారాయణ.. పద్మశ్రీ ఈమని శంకరశాస్త్రి పురస్కార ప్రదానం చేసి, ఘనంగా సత్కరించారు. ఉదయం వేదికపై జరిగిన ఆర్.లక్ష్మీశ్రీనివాస్, అయ్యగారి సత్యప్రసాద్ దంపతులు, డీవీఆర్ సీత, చిట్టా కార్తిక్, వి.లక్ష్మీగీత, కేఎస్.గోవిందరాజన్, కనకదుర్గ, వి.హరిప్రియ శ్రావ్యంగా పలు వాగ్గేయకారుల కీర్తనలను వీణలపై పలికించి సంగీతాభిమానులను అలరించారు. పారుపల్లి సుజన వీణ కచేరి ఆకట్టుకుంది.

సేవకులతో స్వర్ణాంధ్ర

(5వ పేజీ తరువాయి)

పరోక్ష పాత్ర పోషించిన ఘనత పోస్టల్ శాఖకు ఉందని కొనియాడారు. రాష్ట్రంలో సంక్షేమ లబ్ధిదారులకు 33 శాతం మేర డీబీటీ పోస్టల్ ద్వారానే అవ్వడం హర్షణీయ మన్నారు. జీడీఎస్ ఉద్యోగులకు ప్రత్యేక డ్రెస్ కోడ్ ఇచ్చి, ప్రత్యేక గౌరవం కల్పింయచేందుకు సింధియా కృషి చేస్తున్నారన్నారు. 2047 నాటికి దేశం నెంబర్ వన్ స్థానంలో ఉండేలా ప్రధాని మోదీ కృషి చేస్తు న్నారని, అది సాధ్యం కావాలంటే డాక్ సేవకులు అవసరమని అన్నారు. ఎక్కడికైనా పార్సిల్ వెళ్లాలంటే అది డాక్ సేవకులతోనే సాధ్యమన్నారు.

భరతమాత ఆభరణాలు..

గ్రామీణ డాక్ సేవకులు భారతమాత ధరించే మేలు ఆభరణాలని జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ ఇండి యా పోస్ట్ సేవలు అందిస్తోందన్నారు. ఉత్తరాఖండ్, కాశ్మీర్ రాష్ట్రాల్లో హిమాలయ ప్రాంతాల్లో డ్రోన్లతో సేవలు అందిస్తున్న ఘనత తపాలాదేనన్నారు. ఎ లాంటి పరిస్థితుల్లో అయినా, ఎలాంటి వాతావరణ మైనా 'తగ్గేదే లే' అంటూ పుష్ప సినిమా డైలాగ్ పంచ్‌తో వారి సేవలను కొనియాడారు. 2007 నుం చి డాక్ సేవకుల కుటుంబ పెద్దగా వారి బాగో గులు చూస్తున్నానన్నారు. వారికి గొడుగు, షూ, సైకిల్ అలెన్సుల కోసం పోరాడి, వాటిని ఏర్పాటు చేశానన్నారు. గుంటూరులో జరిగిన జీడీఎస్ దేశం లో కొత్త అధ్యాయానికి నాంది కావాలని సింధియా పిలుపునిచ్చారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ పోస్టల్ అభివృద్ధి కోసం రూ.5 వేల కోట్ల పెట్టుబడితో యాప్ సిద్ధం చేశామ ని చెప్పారు. దేశవ్యా ప్తంగా 7 శాతం వృద్ధి రేటు ఉన్న సమయంలో దేశానికే ఆదర్శంగా ఏపీలో 14శాతం సాధించారని జీడీఎస్ ఉద్యోగులను అభినందించారు. రాష్ట్రంలో పోస్టల్ డిపార్ట్మెంట్ ఖర్చు రూ.1,800 కోట్లు, ఆదాయం రూ.600 కోట్లు ఉందని ఖర్చుకు తగిన ఆదాయం పెంచేలా చూడాలన్నారు. రాబోయే రోజుల్లో మరింత లాజిస్టిక్, పార్సిల్, స్పీడ్ పోస్ట్, స్పెషల్ పార్సిల్ కౌంటర్, బార్ కోడింగ్ ట్రాకింగ్ తదితర సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్, బి.రామాంజనేయులు, గళ్ళా మాధవి, చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ శ్రీదేవి, ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్, జనసేన నేతలు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	128, 137, 148
చికెన్ విత్ స్కిన్(కిలో)	240.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	250.00

మరణంలోనూ వీడని బంధం

● ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం అక్కాచెల్లెలు మృతి



షేక్ పీరమ్మ, హుస్సేన్‌బి

గురజాలటౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ ఒకే తల్లి బిడ్డలు.. వారి భర్తలు కాలం చేశారు.. ఇరుగుపొరుగుగా ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ కడుపున పుట్టిన పిల్లలను పోషించుకుంటున్నారు. అలాంటి వీరిని మృత్యువు కూడా రోడ్డు ప్రమాదం రూపంలో ఒకేసారి కబలించింది. ఈ హృదయవిదారకర ఘటన ఆదివారం గురజాల పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో చోటుచేసుకుంది. మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కారంపూడి రోడ్డులో ఉన్న స్టేట్ బ్యాంకు వద్ద నుంచి కొత్త అంబాపురం మిర్చి కోతలకు సుమారు 15 మంది కూలీలతో ఆటో బయలుదేరింది. ఆటో వెనుక భాగాన ఉన్న డోరుపై గురజాల పట్టణానికి చెందిన అక్కా చెల్లెలు షేక్ పీరమ్మ (60), షేక్ హుస్సేన్‌బి (55)తోపాటు మరో మహిళ కూర్చున్నారు. పట్టణ శివారులోని మార్కెట్‌యార్డు దాటిన తరువాత హైవేకి దగ్గర్లో స్పీడ్ బ్రేకర్‌ను ఆటో డ్రైవర్ గమనించకుండా వేగంగా వెళ్లాడు. దీంతో ఒక్కసారిగా డోరుపై కూర్చున్న ముగ్గురు మహిళలు కిందపడిపోయారు. వీరిలో పీరమ్మ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందింది. హుస్సేన్‌బీ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమెను తోటి కూలీలు గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఆమెను నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. కాగా మరో మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. అక్కా చెల్లెలు ఒకే రోజు మృతిచెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. హుస్సేన్‌బీ స్వగ్రామం గురజాల మండలం పల్లెగుంత గ్రామం. ఆమె భర్త ఏడాది క్రితం అనారోగ్యంతో మరణించడంతో గురజాల పట్టణంలోని అక్క పీరమ్మ ఇంటి సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకొని జీవిస్తోంది. ఈమెకు ఇద్దరు కుమార్తెలు. పీరమ్మ భర్త కూడా అనారోగ్యంతో ఐదేళ్ల క్రితం మృతిచెందాడు. ఈమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. గురజాల పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

చెరుకుపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని జొన్నలగడ్డవారిపాలేనికి చెందిన ముత్యాలరావు(45) కావూరులోని జిల్లా పరిషత్ హై స్కూల్ వద్ద జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలుకావడంతో.. ఘటనా స్థలంలోనే మృతి చెందాడు.

నాయనమ్మకు.. మనుమరాలు అంత్యక్రియలు



లక్ష్మమ్మ అంత్యక్రియల్లో మనుమరాలు సునీత

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చిన్నతనంలోనే కన్నతల్లి దూరమైన ఆ యువతికి... నాయనమ్మే అన్నీ తానై చూసుకుంది. వృద్ధాప్యంతో నాయనమ్మ మృతి చెందడంతో అంత్యక్రియలు నిర్వహించి మనమరాలు రుణం తీర్చుకుంది. వివరాల్లోకి వెళితే... గుంటూరు నగరంలోని గుజ్జనగుండ్లకు చెందిన వృద్ధురాలు పాశం లక్ష్మమ్మ (88)కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొడుకు శ్రీనివాసరావు, కోడలు సుశీల కుటుంబ కలహాల నేపథ్యంలో మూడు దశాబ్దాల క్రితమే విడిపోయారు. వీరికి అప్పటికే ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడిని తల్లి సుశీల తన వెంట తీసుకుని వెళ్లిపోగా, ఏడాది వయస్సున్న సునీతను నాయనమ్మ లక్ష్మమ్మ చేరదీసి.. పెంచి పెద్ద చేసింది. మంగళగిరి మండలం ఎర్రబాలేనికి చెందిన నాగరాజుతో మనుమరాలికి వివాహం జరిపించింది. ఏడేళ్ల కిందట కొడుకు కూడా మృతి చెందడంతో వృద్ధురాలు ఎర్రబాలెంలోని తన మనువరాలి వద్దనే తలదాచుకంటోంది. లక్ష్మమ్మ శనివారం రాత్రి కన్నుమూసింది. చిన్నతనం నుంచి తల్లి కంటే మిన్నగా పెంచిన నాయనమ్మ లక్ష్మమ్మకు ఆదివారం సాయంత్రం మనుమరాలు సునీత అంత్యక్రియలు నిర్వహించి రుణం తీర్చుకుంది.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



భాష్యం ప్రవీణ్‌ను సత్కరిస్తున్న పాఠశాల డైరెక్టర్లు రామ్మోహన్‌రావు తదితరులు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

● పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు సెల్ ఫోన్, టీవీలకు బానిసలు కాకుండా భవిష్యత్తుకు ప్రణాళికలు తీర్చిదిద్దుకోవాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచించారు ఆదివారం రింగ్‌రోడ్డులోనే సాయి ఆదిత్య స్కూల్లో జరిగిన 33వ వార్షిక వేడుకల్లో ఆయన మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుంచి నైతిక విలువలు పెంపొందించుకోవాలని సూచించారు కార్యక్రమంలో డాక్టర్ ఆలా అనురాధ, ఏపీ రెరా డైరెక్టర్ దామరచర్ల శ్రీనివాసరావు పల్నాడు తెలుగుదేశం పార్టీ అధ్య క్షులు జానీ వారాహి ఇన్ఫ్రా డైరెక్టర్ కొండవీటి శ్రీనివాసరావు పాఠశాల డైరెక్టర్లు మోదే పల్లి రవీంద్రబాబు, సూరే రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ సీతా మహాలక్ష్మి, పాఠశాల ఇన్‌చార్జులు కృష్ణారావు, కోటి నాయక్ పాల్గొన్నారు.

విజ్ఞాన జ్యోతి.. అబుల్ కలాం ఆజాద్

● టీడీపీ, మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి లాల్ వజీర్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): దేశంలో విద్యాభివృద్ధికి బాటలు వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ లాల్ వజీర్ కొనియాడారు. స్థానిక అరండల్‌పేట, జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆదివారం అబుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లాల్ వజీర్ మాట్లాడుతూ 13వ ఏటనే అద్భుత సాహిత్య విమర్శను సృజించిన గొప్ప వ్యక్తి ఆజాద్ అని అన్నారు. పలు గ్రంథాలను రాసిన మహాకవిగా, పండితుడిగా, అద్భుత మేధాశక్తిగల ధార్మికవేత్తగా ఆయన ఎనలేని ఖ్యాతిని సాధించారని కొనియాడారు. చివరి శ్వాస వరకు హిందూ, ముస్లింల ఐక్యతను కాంక్షించిన ఆజాద్ కలలను నేరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో చిన్న బాజీ, షేక్ ఫిరోజ్, బాజీ మాస్టారు, షేక్ నజీర్ అహ్మద్, షేక్ ఆదం షఫీ, షేక్ సుభాని, రషీద్, కాలేషావలి, బాబుజీ, హరిబాబు, సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

రేపు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో మహా ధర్నా

గుంటూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆస్తుల పరిరక్షణ కోసం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న ఎన్‌టీఆర్ ఆర్టీసీ బస్టాండ్‌లో మహా ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు గుంటూరు-2 డిపో ఎన్‌ఎంయూ కార్యదర్శి, జేఏసీ ఛైర్మన్ పి.అమర్‌నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ పేరుతో కోట్లాది రూపాయలైన గుంటూరు-2 డిపో గ్యారేజ్‌ను ప్రైవేటు పరం చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఇప్పటికే రిలే నిరాహార దీక్షలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

పంచ్ పరివర్తనపై అవగాహన పెంపొందించుకోవాలి

● బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమరసత, స్వదేశీ భావజాలం, కుటుంబం ప్రబోధనలు, పౌర విధులు పాటించడం వంటి ఈ ఐదు సూత్రాలపై కార్యకర్తలు అవగాహన పెంచుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాదు అన్నారు. గుంటూరు, లాలుపురంలో వాజ్‌పేయి భవనంలో ఆదివారం పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ భావాలపై ప్రశిక్షణ, మహా అభియాన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాజం లో కుల, మత భేదాలు లేకుండా అందరం ఒకటే భావనతో కలిసి మెలిసి ఉండాలన్నారు. అట్టడుగు వర్గాలకు చెందిన మహనీయుల జయంతి వేడుక ల్లో పాల్గొని వారి గొప్పతనాన్ని, నీతిని మనం తెలుసుకొని మన భావి తరా లకు తెలపాలన్నారు. రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం మండల స్థాయిలో నిర్వహించాలని సూచించారు. కార్యకర్తలు పార్టీ సంస్థాగతంగా సిద్ధాంతాన్ని ప్రజలకు చేరువ చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో బిట్ర శివన్నారాయణ, జూపూడి రంగరాజు, టుబాకో బోర్డు ఛైర్మన్ యశ్వంత్, దర్శనపు శ్రీనివాస్, చరక కుమార్‌గౌడ్, చాగంటి హరి పావని, మేడూరు యశ్వంత్, దేసు సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మట్టా ప్రసాదు, వేదికపై వల్లూరి జయప్రకాష్ నారాయణ తదితరులు

వైభవంగా పుష్పయాగం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణనగర్, శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వారి 80వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరు గుతున్నాయి. మూడో రోజు ఆదివారం భక్తుల సందోహంతో గోవిందనామ స్మరణలతో మార్మోగుతూ ఆనందంగా జరిగాయి. ఉదయం సుప్రభాత సేవ, శ్రీవారి ఆరాధన, మంగళశాసనం, వేదం విన్నపాలు, వేదం ఆశీర్వచన, శ్రీ లక్ష్మీనారాయణ మంత్రం హవనం పూర్ణాహుతి సంప్రదాయ బద్ధంగా అద్భుతంగా జరిగాయి. వేలాది మంది భక్తులకు అన్న సంతర్పణ చేశారు. సాయంత్రం ఆరుగంటలకు శ్రీవారి మూల మూర్తులకు కోటి పుష్పయాగం నయనానందకరంగా జరిగింది. కార్యక్రమాన్ని ఆలయ వ్యవస్థాపకులు సీతారామానుజాచార్యులు పర్యవేక్షించారు.

పెన్షన్లు, నిత్యావసర వస్తువుల పంపిణీ

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేటలోని అవోపా (ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్) కార్యాలయంలో ఆదివారం వృద్ధులు, పేదలకు పెన్ష న్లను పంపిణీ చేశారు. అవోపా అధ్యక్షులు కేవీ బ్రహ్మం అధ్యక్షతన 108 మంది పేదలకు పెన్షన్లు, నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమం జరిగింది. గుంటూరు మిర్చి యార్డు డైరెక్టర్ కొనకళ్ళ సత్యం, చార్టెడ్ అకౌంటెంట్ రేపాల మంగేశ్వరరావు, డాక్టర్ కొత్త మాసు దినేష్ తదితరులు మాట్లాడుతూ పేదలకు చేయూతనివ్వడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రాధాకృష్ణయ్య, ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు ప్రోగ్రాం కోఆర్డినేటర్ మద్ది సాయి రమేష్, మట్టుపల్లి రవికుమార్, వడకట్టు సునీల్, స్వామి గుప్తా, అమర రమేష్ అడ్డగాళ్ళ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా స్వామి వారి వార్షిక బ్రహోత్సవాలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతీనగర్, శ్రీమారుతి దేవాలయ 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతు న్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అర్చకులు పూజ పుణ్యాహవాచనం, రుత్విక్ వరణం, యాగశాల ప్రవేశం, కలశస్థాపనలు చేశారు. ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్ష నాగవల్లీ దళార్చనలు జరిగాయి. ఈ కార్యక్రమాల్ని కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్, సభ్యుడు కొర్రపాటి రామారావు పర్యవేక్షించారు.

వైద్యానికి వస్తే సర్కస్ ఫీట్లు చేయాల్సిందే

● మురుగునీటిలో ఎన్జీవో కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 22 (ఆంధ్ర జ్యోతి): అక్కడికి వైద్యానికి వస్తే వయోబేధం లేకుండా ఎవరైనా సర్కస్ ఫీట్లు చేయా ల్సిందే. ఇందులో ఏమాత్రం తేడావచ్చినా మురుగునీటిలో పడిపోతారు. ఇదీ స్థానిక పశ్చిమ నియోజకవర్గం ఎన్జీవో కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం (అర్బన్ హెల్త్‌సెంటర్)లో నెలకొన్న దుస్థితి. వైద్య కేంద్రం రోడ్డుకంటే దిగువలో ఉండటంతో కాల్వ ల్లో మురుగునీరు ఊటలా ఆవరణలోకి వస్తోంది. దీంతో ఆవరణ మొత్తం పాచీపట్టి పోయింది. దీంతో లోపలికి వచ్చే రోగుల కోసం ఇటుకరాళ్ళు వేశారు. ఇటుకరాళ్ళపై సర్కస్ ఫీట్లు చేసుకుంటూ వైద్యం కోసం వెళ్ళాల్సి వస్తుంది. ప్రమాదశాత్తు కింద పడితే పరిస్థితి ఏమిటని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి మురుగునీరు కేంద్రం లోకి రాకుండా ఏర్పాట్లు చేయాలని వైద్యం కోసం వచ్చే ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎన్జీవో కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రం →





వైద్యం కోసం ఇటుక రాళ్ళను దాటి వస్తున్న మహిళ



వైద్యం కోసం వచ్చి ఫీట్లు చేస్తూ వెళుతున్న వ్యక్తి

చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు కోరుతూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నిర్వహిస్తున్న దశల వారి ఉద్యమ కార్యచరణలో ఈనెల 25న జరిగే చలో విజయవాడ కార్యక్రమానికి విజయవంతం చేయాలని ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు విజ్ఞప్తి చేశారు. ఆదివారం కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 12వ వేతన సంవత్సర సంఘాన్ని నియమించాలని, వేతన సవరణ సంఘం రిపోర్టు వచ్చేవరకు 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్, గ్యారెంటీ పెన్షన్ స్కీంలను రద్దుచేసి పాత పెన్షన్ విధా నాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ ఖాజావలి, గురుబ్రహ్మం, వి.శ్రీనివాసరావు, ఎంపీ సుబ్బారావు, సద్గుణరావు, జోసఫ్, వెంకయ్య,శంకర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న జోసఫ్ సుధీర్‌బాబు తదితరులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఎస్‌వీఎన్ కాలనీలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎస్‌వీ ఎన్ కాలనీ, తారకరామనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహ కరించాలని కోరారు.

ఏపీ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక

● అధ్యక్షుడిగా వేంపాటి పాపారావు

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం కలెక్టరేట్ ప్రాంగణంలోని డ్రైవర్ల అసోసి యేషన్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. కమిటీకి అధ్యక్షుడిగా వేంపాటి పాపారావు, గౌరవ అధ్యక్షుడిగా బీసీహెచ్ నాగులు, కార్య వర్గ సభ్యులుగా జే మునిబాబు, కే నాగేశ్వరరావు, ఏ కోటయ్య, జే ఏడుకొండలు, పీ నరసింహనాయుడు, ఎస్ భాస్కరబాబు, సాదిక్ బాషా, షేక్ మహబూబ్ సుభాని ఎన్నిక య్యారు. తొలుత పాపారావుతో పాటు కే నాగేశ్వరరావు, ఏ కోటయ్య, బీసీహెచ్ నాగులు నామినేషన్లు వేయగా అసోసియేషన్ పెద్దలు చర్చలు జరిపి ఎన్నిక ఏకగ్రీవం అయ్యేలా చేశారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డీఎస్ కొండయ్య, సహాయ ఎన్నికల అధికారిగా బి శ్రీనివాసరావు, పరిశీలకుడిగా వీ ప్రసన్నాంజనేయకుమార్ వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పాపారావు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ వాహన డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర నాయకత్వానికి నివేదించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.



ఏపీ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పాపారావు, ఇతర సభ్యులు

ఐలాపురం వెంకయ్య ఆశయాలు కొనసాగిస్తాం

● శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు ఏడుకొండలు

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య ఆశయా లను కొనసాగిస్తామని ఏపీ కుమ్మర శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు రాజవరపు ఏడుకొండలు అన్నారు. ఆదివారం ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డులో అసోసియేషన్ ఆధ్వ ర్యంలో ఐలాపురం వెంకయ్య సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏడుకొండలు మాట్లాడుతూ వెంకయ్య తన జీవితాంతం శాలివాహనుల సంక్షేమం కోసం పాటు పడ్డారన్నారు. ప్రభుత్వాలతో మాట్లా డి కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా, నగర నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఉచిత కంటి పరీక్షలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 22(ఆంధ్ర జ్యోతి): స్థానిక కుందుల రోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో ఆదివారం శంకర కంటి ఆస్పత్రి, పెదకాకాని సౌజన్యంతో విద్యార్థినులకు ఉచిత కంటి, బీపీ పరీక్షలు నిర్వహించారు. తొలుత ఈ శిబిరాన్ని కమ్మజనసేవా సమితి అధ్యక్ష, ఉపాధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి, మాదాల రత్నగిరిబాబు, పాలకవర్గ సభ్యుడు మర్రిపూడి సీతారామయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా 355 మందికి కంటి పరీక్షలు నిర్వహించి. అందులో 190 విద్యార్థినులకు కళ్లజోళ్లు అవసరమని వైద్యులు సూచించారు. ఈ కళ్లద్దాలను ఉచితంగా అందజేస్తానని మాదల రత్నగిరిబాబు హామీ ఇచ్చారు. ఈ పరీక్షల్లో డాక్టర్ మహితా, డాక్టర్ శృతి, స్వప్న, యశస్వీని, శివానీ, ప్రేమ మాధురి, ప్రసాదు, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న మాదల రత్నగిరిబాబు, పాల్గొన్న మల్లెల హరేంద్రనాథ్ చౌదరి

ఘనంగా జాతీయ స్థాయి నృత్య సంగీత కళా ఉత్సవం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో, శ్రీ మంజునాథ నాట్య క్షేత్రం ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ స్థాయి నృత్య సంగీతం, కళా ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా త్యాగరాజ, అన్నమయ్య కీర్తనలకు చిన్నారులు లయబద్ధంగా కూచిపూడిని ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అనంతరం ప్రతిభ చూపిన చిన్నారులకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్ని నాట్యక్షేత్ర వ్యవస్థాపకరాలు డాక్టర్ ఆర్ మనోజ్ఞ పర్యవేక్షించగా, కార్యక్రమం లో ప్రొఫెసర్లు కృష్ణకిషోర్, ఎస్ వెంకటరమణ ఫణికుమార్, డాక్టర్ ఎల్ రమణారావు, న్యాయవాదులు కె.శ్రీనివాసమూర్తి, కేవీఆర్‌ఎస్ లక్ష్మి తదితరు లు పాల్గొని చిన్నారులను అభినందించారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళి

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రథమ స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. ఈ మేరకు ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో ఆంగ్లేయుల గుండెల్లో నిద్రపోయిన ధీశాలి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని ఎస్ఐ సుబ్బారెడ్డి ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి చిత్రపటానికి ఆర్ఎస్ఐ సుబ్బారెడ్డి, సిబ్బంది పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రోడ్డుపై నడుచు కుంటూ వెళ్తున్న సుమారు 45-50 సంవత్సరాల మధ్య వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తిని ఒక కారు ఢీకొనగా, అతను కింద పడిపోయాడు. తక్షణమే స్థానికులు, పోలీసు సిబ్బంది సహాయంతో ఆ వ్యక్తిని ఆటో ద్వారా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించినాడు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తించగలిగిన వారు లేదా సంబంధిత సమాచారం తెలిసిన వారు వెంటనే ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్‌ను 8688831442 నంబర్లో సంప్రదించాలని పోలీసులు కోరారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

శ్రీ భ్రమర గ్రూప్స్ 'రాగ' మెలోడీ ఆఫ్ లివింగ్' ప్రాజెక్టుకు శ్రీకారం

గుంటూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మూస పద్ధతిలో కొనసాగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారంలో సమూలమైన మార్పులు చేపట్టి, వినూత్న ఆలోచనలతో, అద్భుతమైన వెంచర్లతో శ్రీభ్రమర గ్రూప్ గృహ నిర్మాణ రంగంలో అద్భుతాలు సృష్టిస్తోంది. ఇందు లో భాగంగా శ్రీభ్రమర గ్రూప్ ఆధ్వర్యంలో 'రాగ మెలోడీ ఆఫ్ లివింగ్' పేరుతో నారాకోడూరులో నూతన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. గుంటూరు నగరానికి అతి చేరువలో ఏపీ సీఆర్‌డీఏ, రెరా ఆమోదం పొంది, మామిడి తోటలో వీకెండ్ హోమ్స్ కాన్సెప్ట్‌తో ప్రాజెక్ట్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రాజెక్టు సైట్‌లో నిర్వహించారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్యఅతిథిగా హాజరై బ్రోచర్స్ ఆవిష్కరించారు. భ్రమర గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గళ్ళా రామచంద్రరావు, సంస్థ డైరెక్టర్లు, సభ్యులు, కస్టమర్లు, మార్కెటింగ్ మిత్రులు, ల్యాండ్ లార్డ్స్, పుర ప్రముఖులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. రియాల్టీ, నిర్మాణ రంగాల్లో అత్యాధునిక పోకడలతో శరవేగంగా దూసుకుపోతున్న శ్రీభ్రమర చేపట్టిన అద్భుతమైన ప్రాజెక్టు రాగ అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో మ్యాంగోస్ రిసార్ట్, కాటేజిలు, కాటేజి ప్లాట్లు ఉన్నాయి. మామిడి తోటలో సుందరంగా తీర్చిదిద్దిన ల్యాండ్ స్కేప్ గ్రీనరీ, థీమ్ పార్కులు, అద్భుతమైన ఎంట్రన్స్ ఆర్చ్, విశాలమైన రహదారులు, పిల్లల కోసం ప్రత్యేక పార్క్, పచ్చదనంతో నిండిన సహజ వాతావరణం అసాధారణమైన జీవనానుభూతిని అందిస్తాయని తెలిపారు.



నూతన ప్రాజెక్టు బ్రోచర్ విడుదల చేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, ఎండీ గళ్ళా రామచంద్రరావు, పలువురు డైరెక్టర్లు

మానవతా సేవా సమితి సేవలు అభినందనీయం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, పేద పిల్లల కు ఆర్థిక తోడ్పాటును అందిస్తున్న మానవతా సేవాసమితి సేవలు ప్రశంస నీయమని టీజేపీఎస్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్, కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ ఈవీ నారాయణ అన్నారు. స్థానిక శివారెడ్డిపాలెంలో మానవతా సేవాసమితి, శ్రీరాజేంద్రసూరి జైన్ సేవాసమితి వారి వయో వృద్ధుల, బాలుర ఆశ్రమం 28వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సమితి సభ్యులు చెన్నంశెట్టి రామారావు, సోలంకి సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఆశ్రమంలో రెండు దశాబ్దాలకు పైగా వయోవృద్ధులకు, బాలురకు ఉచితంగా భోజనం వసతి, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. సెంట్రల్ టాక్స్ - కస్టమ్స్ సూపరింటెండెంట్ చిట్టి వెంకటేశ్వరరావు, మహావీర్ జైన్ ఆసీస్ జైన్, రాజేంద్ర జైన్, కమలాదేవి, పీఎస్ మూర్తి, సౌత్ సెంట్రల్ రైల్వే ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మంజునాథ్, మార్కండేయులు, జి.దుర్గ పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ భవన్‌పై బీజేవైఎం కార్యకర్తల దాడులు హేయం

గుంటూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో దాడులు సహేతుకం కాదని ప్రజలు సరైన సమయంలో బీజేపీకి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యేలు మస్తాన్‌వలి, లింగంశెట్టి ఈశ్వరరావు తెలిపారు. బీజేవైఎం కార్యకర్తలు రాజీవ్ గాంధీ భవన్‌పై శనివారం కోడిగుడ్లతో దాడి చేయటాన్ని నిరసిస్తూ ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీముల్లా ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పసుపు, బ్లీచింగ్, సున్నం నీళ్ళతో కాంగ్రెస్ కార్యాలయం ఆవరణను శుద్ధి చేసే కార్యక్రమం చేపట్టా రు. ఎన్ఎస్‌యూఐ నాయకుడు కరీముల్లాతో పాటు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శశిలు బీజేవైఎం కార్యకర్తల దాడులను ఖండిస్తూ నిరసన తెలిపారు. ప్రజాస్వామ్యంలో భౌతికదాడులకు తావులేదని, ఇది బీజేపీ పిరికి పంద చర్యగా అభివర్ణించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రత్తయ్య, మౌలాలి, జానీ, రామకృష్ణ, మోషే, బుజ్జి, జానీ, హమీద్ తదితరులున్నారు.



కాంగ్రెస్ కార్యాలయం ఆవరణలో పసుపు నీళ్ళతో శుద్ధి చేస్తున్న ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు

జడ్పీ ఎదుట రోడ్డు ప్రమాదం

● యువకుడికి తీవ్ర గాయాలు... ● తప్పిన ప్రాణాపాయం

● మానవత్వం చాటుకున్న తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

గుంటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ బంగ్లా సమీపంలోని జడ్పీ మెయిన్ గేట్ ఎదుట ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓయువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మూడొంతెనల వద్ద గదిలో ఉంటూ చదువుకుంటూ మరో వైపు కేటరింగ్ పనులకు వెళ్తున్న మూడవ త్ శ్రీను నాయక్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం మధ్యాహ్నం శ్రీను నాయక్ కలెక్టర్ కార్యాలయం నుంచి మెడికల్ క్లబ్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అదే సమయంలో మెడికల్ క్లబ్ వైపు నుంచి కలెక్టరేట్ వైపు ఓ కారు వస్తోంది. ద్విచక్ర వాహనం అతివేగంతో ఎడమ వైపునున్న కారును ఢీ కొట్టబోయి తప్పించుకున్నాడు. అదే సమయంలో మెడికల్ క్లబ్ వైపు నుంచి కలెక్టరేట్ వైపు వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఒక్కసారిగా ద్విచక్ర వాహనం పది అడుగుల ఎత్తుకు ఎగిరిపడింది. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. అదే సమయంలో అటుగా వెళ్తున్న తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ గాయపడిన శ్రీను నాయక్‌ను జీజీహెచ్‌కు తరలించారు. వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన వ్యక్తికి సహాయం చేస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనంలో పాల్గొనేందుకు ఆదివారం గుంటూరు వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడుకు హెలీప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్ (తూర్పు), గళ్ళా మాధవి (పశ్చిమ), ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, మార్కెట్ యార్డు ఛైర్మన్ కుర్రా అప్పారావు

క్యాట్‌లో మంచి పర్సంటైల్ రాకున్నా

మేనేజ్‌మెంట్‌కు మార్గాలెన్నో!

క్యాట్(కామన్ అడ్మిషన్ టెస్ట్)లో మంచి పర్సంటైల్ రాకుంటే మేనేజ్‌మెంట్ కోర్సులు చేసేందుకు ప్రత్యామ్నాయం లేదని అర్థం కాదు. మేనేజ్‌మెంట్ చేయాలనుకునే వారికి క్యాట్ చుట్టూ అనేకానేక భ్రమలు ఉన్నాయి. అయితే అవన్నీ నిజం కావని, మేనేజ్‌మెంట్ కోర్సు చేసేందుకు మరిన్ని మార్గాలు ఉన్నాయని భువనేశ్వర్‌లోని జేవియర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌కు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ కల్పనా సాహు చెబుతున్నారు. అవేమిటో ఒకసారి పరిశీలిద్దాం.



క్యాట్‌లో మంచి పర్సంటైల్ రానంత మాత్రాన మేనేజ్‌మెంట్ చదువుకు ఫుల్‌స్టాప్ పడినట్లు కాదు. నిజానికి క్యాట్ చుట్టూ కట్టుదిట్టమైన కథలను మనకు మనమే అల్లుకున్నాం. ఇందులో ఏమంత వాస్తవం లేదు. సంబంధిత నైపుణ్యాలు, అనువర్తన, అనుభవం, నిరంతర అధ్యయనంతో మాత్రమే మేనేజ్‌మెంట్ కెరీర్ ఒక రూపుదిద్దుకుంటుంది. అంతేతప్ప ఒక పరీక్షలో సాధించిన స్కోర్ ఒక్కటి మాత్రమే కెరీర్‌పై ప్రభావం చూపలేదు. సందేహం లేదు, క్యాట్‌లో సాధించిన మెరుగైన పర్సంటైల్‌తో ఐఐఎం వంటి సుప్రసిద్ధ మేనేజ్‌మెంట్ సంస్థల్లో చేరేందుకు మార్గాన్ని సుగమం చేసుకోవచ్చు. అయితే అది రానిపక్షంలో అంతకు తగ్గట్టు ఉన్న ప్రత్యామ్నాయాల్లో మనకు అనువైనది ఎంచుకోవచ్చు. మేనేజ్‌మెంట్ అనేది ఒక విస్తృత రంగం. డైనమిజానికి తోడు కలుపుకొనిపోయే రంగం.

- క్యాట్ స్థాయిలో పలు ప్రామాణిక మేనేజ్‌మెంట్ ఎంట్రెన్స్ టెస్టులు ఉన్నాయి. వాటిలో సాధించిన ర్యాంకుతో మన దేశంలోనే వివిధ ప్రతిష్ఠాత్మక బిజినెస్ స్కూల్స్‌లో చేరవచ్చు. ఎక్స్‌ఏటీ(జాట్), సీఎంఏటీ(సీమ్యాట్), ఎన్ఎంఏటీ(ఎన్‌మ్యాట్), ఎస్ఎన్ఏపీ(స్నాప్), మ్యాట్, ఏటీఎంఏ(ఆత్మా), జీమ్యాట్ వంటి టెస్టుల్లో సాధించిన ర్యాంకులను పేరొందిన ప్రైవేట్, డీమ్డ్, యూనివర్సిటీ అనుబంధ బిజినెస్ స్కూల్స్ ఆమోదిస్తాయి.
- ఈ పరీక్షల స్ట్రక్చర్ వేర్వేరుగా ఉంటుంది. కష్టస్థాయి నుంచి మూల్యాంకన చేసే విధానం వరకు కొద్దిపాటి తేడాలు కూడా ఉంటాయి. ఉదాహరణకు ఎక్స్‌ఏటీని తీసుకుంటే డెసిషన్ మేకింగ్, జనరల్ నాలెడ్జ్ ఎక్కువ విలువనిస్తుంది. ఇవి కాకుండా ప్రతి రాష్ట్రంలో లోకల్ స్థాయిలో మేనేజ్‌మెంట్ టెస్టులు ఎలాగూ ఉన్నాయి. అవి కూడా యూనివర్సిటీ కాలేజీల నుంచి ఆ రాష్ట్రంలో ఉండే ప్రతిష్ఠాత్మక ప్రైవేటు కాలేజీల్లో చేరేందుకు వెసులుబాటు కల్పిస్తాయి. అందులో కొన్ని సంస్థలకు స్థానిక పరిశ్రమలతో మెరుగైన సంబంధాలు కూడా ఉంటాయి. వాటి నుంచి వచ్చిన గ్రాడ్యుయేట్లు కూడా విజయవంతమైన మేనేజర్లుగా కొనసాగుతుండటమే కాకుండా మంచి అలూమ్నీలు కూడా ఆ కాలేజీలకు ఉంటున్నాయి.
- మన దేశంలోని పలు యూనివర్సిటీలు స్పెషలైజ్డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లను అందిస్తున్నాయి. ఇందులో స్టేట్, సెంట్రల్ యూనివర్సిటీలు ఉన్నాయి. ఇవి ఎంబీఏ కోర్సును అందిస్తుంటాయి. తమదైన అడ్మిషన్ ప్రాసెస్ కూడా వాటికి ఉంటుంది. ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూలు, అకడమిక్ పర్ఫార్మెన్స్ లేదా పనిఅనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని మరీ చేర్చుకుంటాయి. హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్, రూరల్ మేనేజ్‌మెంట్, అగ్రిబిజినెస్, స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సస్టయినబిలిటీ, అనలిటిక్స్, టూరిజమ్ మేనేజ్‌మెంట్ వంటి స్పెషలైజ్డ్ ప్రోగ్రామ్‌లను కూడా అందిస్తున్నాయి. వీటిలో కొన్ని కోర్సులు - పరిశ్రమలకు అవసరమైన విధంగా రూపుదిద్దుకుని ఉంటాయి. సదరు పరిశ్రమలు ఈ గ్రాడ్యుయేట్లకు అవకాశాలూ కల్పిస్తుంటాయి. అలా జనరల్ ఎంబీఏ కంటే మంచి అవకాశాలను ఆ కోర్సులు చేసిన విద్యార్థులు పొందవచ్చు.
- ఇంటిగ్రేటెడ్ అలాగే ఎగ్జిక్యూటివ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్స్ కూడా ఉన్నాయి. ఎంట్రీ పాయింట్స్ కూడా వీటికి వేరుగా ఉంటాయి. అందులో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏను ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులకు అందిస్తారు. ఈ కోర్సులో చేరితే సమయమూ ఆదా అవుతుంది. త్వరగా ప్రొఫెషన్‌లో చేరవచ్చు. వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ఉద్దేశించినది ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ. ఈ కోర్సుల్లో ప్రత్యేకించి ప్రాక్టికల్ అప్లికేషన్, నాయకత్వ అభివృద్ధి, సహచరులతో కలిసి పనిచేయడం వంటి వాటికి ప్రాధాన్యం ఇస్తాయి. ఇక్కడ ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో సాధించిన ఘనత ఒక్కటే ప్రాముఖ్యం వహించదు. వృత్తిలో మరింత పురోగతి కోసం ఫుల్ టైమ్ ఎంబీఏ కంటే ఇలాంటి కోర్సులకు వర్కింగ్ ప్రొఫెషనల్స్ ప్రాధాన్యం ఇస్తుంటారు.
- మేనేజ్‌మెంట్ డొమైన్స్‌లో ప్రొఫెషనల్ సర్టిఫికేషన్స్, డిప్లొమాలు మరొకటి. సంప్రదాయ ఎంబీఏ కోర్సులకు మించినవి కూడా ఇవి. కొన్ని ప్రత్యేకతలను కలిగి ఉంటాయి. ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్(పీఎంపీ ప్రిన్స్ 2), హ్యూమన్ రిసోర్సెస్(ఎస్‌హెచ్ఆర్ఎం, సీఐపీడీ), ఫైనాన్స్(సీఎఫ్ఏ, ఎఫ్ఆర్ఎం, సీపీఏ), మార్కెటింగ్(డిజిటల్ మార్కెటింగ్, బ్రాండ్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ అనలిటిక్స్), సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్‌లో సర్టిఫికేషన్స్‌కు ఎంప్లాయిర్స్ చాలా విలువనిస్తారు. రియల్ వరల్డ్ ప్రాబ్లెమ్ సాల్వింగ్‌కు తోడు పరిశ్రమలకు అనువైన కోర్సులు ఇవి. సంస్థలో పలు హోదాల్లో పనులు చేసేందుకు అకడమిక్ డిగ్రీల కంటే ఇవి ఎంతో మేలు చేస్తాయి.
- చివరాఖరుగా ఒక్క విషయం, మేనేజ్‌మెంట్ అనేది ఒక విస్తృత డిసిప్లిన్. వ్యక్తుల సామర్థ్యం, తెలివితేటలు, నేర్చుకున్న విధానం, సాధించిన అనుభవం, పరిణతి తదితరాలన్నీ ఒక వ్యక్తిని మంచి మేనేజర్‌గా నిలబెడతాయని తెలుసుకోవాలి. లక్ష్యంలో స్పష్టత, నేర్చుకోవాలన్న ఉత్సుకత, అనువర్తన, నిరంతరం కష్టపడటంతో విజయం సాధించగలమని ఎవరైనా బలంగా నమ్ముకోవాలి.

> పని అనుభవంతో మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను నేర్చుకోవడం కూడా ఒక పద్ధతే. ఎంట్రీ లెవెల్‌లో చేరిన చాలా మంది, పనిలో భాగంగా సాధించిన నైపుణ్యం, అనుభవంతో మేనేజ్‌మెంట్‌లో కీలకమైన పదవులను సాధిస్తూ ఉంటారు. సేల్స్ ఆపరేషన్స్, హాస్పిటాలటీ, హెల్త్‌కేర్, మాన్యుఫాక్చరింగ్, స్టార్టప్స్, ఎన్జీవోలు, ఫ్యామిలీ బిజినెస్‌లో వీరు ఎక్కువగా రాణిస్తుంటారు. సంప్రదాయ పద్ధతులు లేదా వ్యవస్థలోనే వీరు మేనేజ్‌మెంట్ వ్యవహారాలను సునిశితంగా, చాలా బాగా నేర్చుకుంటారు. పీపుల్ మేనేజ్‌మెంట్ నుంచి డెసిషన్ మేకింగ్, కాన్‌ఫ్లిక్ట్ రిజల్యూషన్, పర్ఫార్మెన్స్ మేనేజ్‌మెంట్ వరకు తరగతి గదుల్లో నేర్చుకోవడానికి మించి తెలుసుకుంటారు. కొన్ని సందర్భాల్లో వీరే పటిష్ఠమైన మేనేజర్లుగానూ అవతరిస్తారు.

దిక్సూచి



ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల్లో

యంత్ర ఇండియా లిమిటెడ్ - వివిధ విభాగాల్లో ఉన్న 3,979 అప్రెంటిస్ ఖాళీలకు దరఖాస్తులు కోరుతోంది. భారత ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న స్కిల్ ఇండియా మిషన్‌ను ప్రమోట్ చేసే చర్యలో భాగంగా ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఇండియన్ ఆర్డినెన్స్, ఆర్డినెన్స్ ఎక్విప్‌మెంట్ ఫ్యాక్టరీల్లో ఈ ఖాళీలు ఉన్నాయి. అభ్యర్థులు వాటిలో ఏదైనా ఒక్కదానికి మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఖాళీల సంఖ్య తాత్కాలికం.

- నలంద(బిహార్), జబల్‌పూర్, ఇటార్సీ, కట్నీ (మధ్యప్రదేశ్), పుణె, థానె, బాంద్రా, భుసావల్, చంద్రాపూర్, వరంగాన్, కిర్కీ, నాగపూర్(మహారాష్ట్ర), బొలంగీర్ (ఒడిషా), ఆవడి, తిరుచ్చిరాపల్లి (తమిళనాడు), మురద్‌నగర్, కాన్పూర్, షాజన్‌పూర్, హజరత్‌పూర్(యూపీ), డెహ్రాడూన్(ఉత్తరాఖండ్), కోల్‌కతా, ఇషాపూర్, కాశీపూర్(పశ్చిమబెంగాల్), చండీగఢ్‌లలో ఉన్న ఫ్యాక్టరీల్లో వేకెన్సీలు ఉన్నాయి.

విభాగాలు: మెషినిస్ట్, ఫిట్టర్ ఎలక్ట్రీషియన్, టర్నర్, వెల్డర్

పోస్టులు:

- ఎక్స్-ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్(2843 ఖాళీలు) - కనీసం 50 శాతం(మ్యాథ్స్, సైన్స్‌లో కలిపి 50 శాతం) మార్కులతో టెన్త్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత
- నాన్-ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్(1136 ఖాళీలు)-పైన నిర్దేశించిన విధంగా టెన్త్‌కు తోడు కనీసం 50 శాతం మార్కులతో ఐటీఐ ట్రేడ్ ఉత్తీర్ణత

వయస్సు: ఈ ఏడాది మార్చి 3నాటికి 14-35సంవత్సరాలు

ఎంపిక: విద్యార్హతల్లో సాధించిన మెరిట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా.

దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 3

వెబ్‌సైట్: www.apprenticeship.gov.in, https://recruitgov.com.

అప్రెంటిస్‌షిప్

ఐఓసీఎల్

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీఎల్) - డిగ్బాయ్ రిఫైనరీలో 48 అప్రెంటిస్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు: టెక్నీషియన్ అప్రెంటిస్ 14, ట్రేడ్ అప్రెంటిస్ 34

విభాగాలు: కెమికల్, మెకానికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్

అర్హత: పోస్టును బట్టి డిప్లొమా లేదా బీఎస్సీ ఉత్తీర్ణత

దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 25(రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎన్ఏటీఎస్ 2.0, ఎన్ఏపీఎస్ కింద జరుపుకోవాలి.)

వెబ్‌సైట్: www.iocl.com

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ - నవీ ముంబై యూనిట్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు: గ్రాడ్యుయేట్ 27, డిప్లొమా 15, ఐటీఐ 30, మొత్తం 72

అర్హత: ఖాళీనిబట్టి డిగ్రీ, ఇంజనీరింగ్ డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ కోర్సు ఉత్తీర్ణత

ఎంపిక: నవీ ముంబైలో నిర్వహించే రాత పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా. గ్రాడ్యుయేట్/ డిప్లొమా అప్రెంటిస్ కోసం ఫిబ్రవరి 28న, ఐటీఐ అప్రెంటిస్ కోసం మార్చి 2న టెస్టు జరుగుతుంది.

దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 27(రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎన్ఏటీఎస్ 2.0, ఎన్ఏపీఎస్ కింద జరుపుకోవాలి.)

వివరాల కోసం: namuhr@bel.co.in.



హెచ్‌పీసీఎల్

భారత ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్) 608 గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏపీలో 62, తెలంగాణలో 22 ఖాళీలు కూడా ఇందులోనే కలిసి ఉన్నాయి.

విభాగాలు: సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్

అర్హత: సంబంధిత విభాగాల్లో కనీసం 60 శాతం మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీని పూర్తి చేసి ఉండాలి. 2023 ఏప్రిల్ 1 తరవాత ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక: మెరిట్ ఆధారంగా స్క్రీనింగ్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఫిట్‌నెస్ ఆధారంగా.

దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 2

వెబ్‌సైట్: http://jobs.hpcl.co.in/Recruit_New/recruitlogin.jsp, http://jobs.hpcl.co.in/Recruit_New/recruitlogin.jsp

బిజినెస్

కాకినాడ పెన్సిలిన్-జీ ప్లాంట్‌లో
10 వేల టన్నులకు ఉత్పత్తి

- అరబిందో ఫార్మా సీఎఫ్ఓ సుబ్రమణియన్



న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా ఉన్న అరబిందో ఫార్మా తన పెన్సిలిన్-జీ ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరిస్తోంది. కాకినాడలోని ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజెడ్)లో ఏర్పాటు చేసిన ఈ పెన్సిలిన్ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం వచ్చే ఏడాది కాలంలో 10,000 టన్నులు మించిపోతుందని ఇన్వెస్టర్స్ కాల్‌లో సంస్థ సీఎఫ్ఓ సుబ్రమణియన్ చెప్పారు. ముందు ముందు ఈ ప్లాంట్ స్థాపిత వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 15,000 టన్నులకు చేరుతుందన్నారు.

పెన్సిలిన్-జీ ప్రాధాన్యత : పెన్సిలిన్-జీ అనేక కీలక యాంటీ బయాటిక్స్ ఔషధాలకు ప్రధాన ముడి పదార్థం. ప్రస్తుతం ఈ ముడి పదార్థం కోసం మన దేశ ఫార్మా కంపెనీలు ఎక్కువగా చైనా కంపెనీలపై ఆధారపడుతున్నాయి. దీన్ని తగ్గించేందుకు పెన్సిలిన్-జీతో సహా ఫార్మా పరిశ్రమకు అవసరమైన కీలక ముడి పదార్థాలను దేశీయంగా ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహక చర్యలు ప్రకటించింది. అందులో భాగంగా అరబిందో ఫార్మా కాకినాడలో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి క్రమంగా ఉత్పత్తి పెంచుతోంది. మరోవైపు పెన్సిలిన్-జీ దిగుమతికి కనీస ధర నిబంధనను ప్రభుత్వం మరో ఏడాది పొడిగించడం సానుకూల పరిణామమని సుబ్రమణియన్ అన్నారు.

రెండేళ్లలో కొత్తగా 150 స్టోర్లు

అపోలో ఫార్మసీ సీఈఓ జయ కుమార్

ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే రెండేళ్ల కాలంలో కొత్తగా 150 ఫార్మసీ స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్లు అపోలో ఫార్మసీ సీఈఓ జయ కుమార్ వెల్లడించారు. ఆదివారం నాడు విశాఖపట్నంలో కొత్త స్టోర్‌ను ప్రారంభించటం ద్వారా రాష్ట్రంలో మొత్తం స్టోర్ల సంఖ్య 1,000కి చేరుకుందని ఆయన వివరించారు. అపోలో ఫార్మసీ ప్రస్తుతం ఏపీలోని 15 జిల్లాల్లో 7,000 మంది ఉద్యోగులతో 1,000 స్టోర్లను నిర్వహిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో సంస్థ కార్యకలాపాలను మరింత పటిష్ఠం చేసేందుకు వచ్చే రెండేళ్లలో మరో 150 ఫార్మసీ స్టోర్లను ప్రారంభించాలని చూస్తున్నట్లు కుమార్ వెల్లడించారు.

327 రోజులు.. 8 కోట్ల టన్నులు

సరుకు రవాణాలో విశాఖ పోర్టు రికార్డు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): సరుకు రవాణాలో విశాఖ పోర్టు సరికొత్త రికార్డు సృష్టించిందని విశాఖ పోర్టు అథారిటీ (వీపీఏ) చైర్మన్ ఎం.అంగముత్తు పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 327 రోజుల్లో (ఫిబ్రవరి 21 వరకు) 8 కోట్ల టన్నుల సరుకును హ్యాండ్లింగ్ చేసి రికార్డు సృష్టించినట్లు ఆయన తెలిపారు. ఇదే ఉత్సాహంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 9 కోట్ల టన్నుల లక్ష్యాన్ని విజయవంతంగా చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. 2023-24లో 362 రోజుల్లో, 2024-25లో 357 రోజుల్లో 8 కోట్ల టన్నుల సరుకు రవాణా చేయగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేవలం 327 రోజుల్లోనే ఈ లక్ష్యాన్ని అధిగమించినట్లు తెలిపారు.

ఒడిశాలో ఆర్‌బీఐ రెండో డేటా కేంద్రం

చైనా, పాక్ దాడుల నుంచి రక్షణ

భూకంపాల నుంచి రక్షణ కవచం

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన కీలక డేటా పరిరక్షణ కోసం భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మరిన్ని చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఒడిశాలోని భువనేశ్వర్ వద్ద అత్యంత భద్రతా ఏర్పాట్లతో కూడిన రెండో ప్రత్యేక డేటా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. అత్యంత వ్యూహాత్మకంగా ఆర్‌బీఐ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని భావిస్తున్నారు. ఈ కేంద్రంలో ఆర్‌బీఐ కరెన్సీ నిర్వహణ, చెల్లింపులు, సెటిల్‌మెంట్ కార్యకలాపాలు, రెగ్యులేటరీ డేటా, విశ్లేషకులు, అధికారుల విధులకు అవసరమైన కీలక కంప్యూటర్ వ్యవస్థలను ఏర్పాటు చేసింది.



కీలక డేటా కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని భావిస్తున్నారు.

ఎందుకంటే?

ముంబైలో ఇప్పటికే ఆర్‌బీఐ ప్రత్యేక డేటా కేంద్రాన్ని నిర్వహిస్తోంది. చైనా లేదా పాక్ ఈ కేంద్రంపై దాడి చేస్తే ఈ కేంద్రంలోని దేశ ఆర్థిక లావాదేవీలు, చెల్లింపులకు సంబంధించిన కీలక డేటాతో పాటు అందుకు సంబంధించిన మౌలిక సదుపాయాల వ్యవస్థలు కూడా తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితుల నుంచి బయటపడేందుకే ఆర్‌బీఐ భువనేశ్వర్ సమీపంలో ఈ కీలక డేటా కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని భావిస్తున్నారు.

ఇతర కారణాలు

భువనేశ్వర్ భూకంపాల వంటి ప్రకృతి విపత్తుల జోన్‌లకు కూడా దూరంగా ఉంది. దీనికి తోడు ముంబై, చెన్నై, బెంగళూరు,హైదరాబాద్ నగరాల్లోలా భువనేశ్వర్‌లో పెద్ద ఎత్తున డేటా కేంద్రాలు లేవు. దీంతోపాటు ఒడిశా తీరానికి విదేశాల నుంచి అండర్‌సీ కేబుల్ వ్యవస్థా లేదు. దీంతో సైబర్ కేటుగాళ్ల నుంచి పెద్దగా భయం ఉండకపోవచ్చు. ఆర్‌బీఐ తన రెండో డేటా కేంద్రాన్ని భువనేశ్వర్‌లో ఏర్పాటు చేయడానికి ఇది కూడా మరో కారణమని భావిస్తున్నారు.

ఆపరేషన్ సిందూర్ అనుభవం

ఆపరేషన్ సిందూర్ సమయంలో మన దేశానికి చెందిన ఒక ప్రముఖ వాణిజ్య బ్యాంకు కీలకమైన తన డేటా కేంద్రాన్ని రాత్రికి రాత్రి ఆఘమేఘాల మీద జైసల్మేర్ నుంచి ముంబైకి తరలించింది. పాక్ ఆ డేటా కేంద్రంపై దాడి చేసే అవకాశం ఉందనే భయాలే ఇందుకు కారణం. ముంబైతో పోలిస్తే భువనేశ్వర్ చైనా, పాక్ సరిహద్దులకు దూరంగా ఉంది. దీంతో ఈ రెండు దేశాల ఉగ్రవాదులు గానీ, యుద్ధ విమానాలు, డ్రోన్లు గానీ అడ్డు లేకుండా భువనేశ్వర్ వరకు వచ్చే అవకాశం తక్కువ. రెండో డేటా సెంటర్ కోసం ఆర్‌బీఐ భువనేశ్వర్‌ను ఎంచుకోవడం వెనక ఇది కూడా ఒక బలమైన కారణంగా కనిపిస్తోంది. అమెరికా వంటి దేశాల కేంద్ర బ్యాంకులు కూడా తమ దేశాల కీలక ఆర్థిక, చెల్లింపుల లావాదేవీల డేటా పరిరక్షణ కోసం ఇలాంటి చర్యలే తీసుకుంటున్నాయి. ఆర్‌బీఐ కూడా వీటి బాటలోనే పయనిస్తోంది.

25,850 పైన బుల్లిష్

(ఫిబ్రవరి 23-27 తేదీల మధ్య వారానికి)

గత వారం నిఫ్టీ : 25571 (+100)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 25,829-25,279 పాయింట్ల మధ్యన కదలాడి 100 పాయింట్ల లాభంతో 25,571 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,850 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20,50,100,200 రోజుల చలన సగటు స్థాయిలు 25,565, 25,742, 25,717, 25,325 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25,850

బ్రేక్‌డౌన్ స్థాయి: 25,200

నిరోధ స్థాయిలు: 25,775, 25,875, 25,975 (25,675 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 25,375, 25,275, 25,175 (25,475 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	465	విజయవాడ	500
వరంగల్	467	గోదావరి	465
చిత్తూరు	553	విశాఖపట్నం	480
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	115
వరంగల్	115	గుంటూరు	115
కరీంనగర్	115	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	117
కర్నూలు	115	నెల్లూరు	122
విశాఖపట్నం	115	అనంతపురం	122
గోదావరి	115		

26,000 స్థాయిలో గట్టి పరీక్ష



వి. సుందర్ రాజా — టెక్ వ్యూ

గత వారం నిఫ్టీ గరిష్ఠ స్థాయిల్లో మైనర్ అప్‌ట్రెండ్ కనబరిచినప్పటికీ 25,880 స్థాయిల్లో బలమైన రియాక్షన్ సాధించింది. 26,000 వద్ద అప్రమత్తతకు ఇది సంకేతం. నిఫ్టీ గత వారం మొత్తం మీద 100 పాయింట్ల లాభంతో 25,570 వద్ద ముగిసింది. ఎన్నో నెలల నుంచి ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా గరిష్ఠ స్థాయిల్లో నిలదొక్కుకోలేకపోతోంది. గత మూడు నెలల్లోనే 26,000 పాయింట్ల వద్ద మూడు సార్లు నిఫ్టీ విఫలమయింది. మార్కెట్ మరోసారి ఈ నిరోధం వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు. అంతర్జాతీయ పరిణామాల ప్రభావం వల్ల సోమవారం నిఫ్టీ కాస్తంత పై స్థాయిలోనే పాజిటివ్‌గా ప్రారంభం కావచ్చు. సానుకూలత కోసం నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ కాస్తంత పై స్థాయిలో ప్రారంభమయ్యే ఆస్కారం ఉన్నందు వల్ల ఆటుపోట్లు ఎదుర్కొనవచ్చు. వ్యత్యాసం కూడా భారీగా ఉండవచ్చు. ప్రధాన నిరోధం 25,900 వద్ద కన్సాలిడేట్ కావచ్చు. ఈ స్థాయిని బ్రేకౌట్ చేసినట్టయితే సానుకూలత కోసం మానసిక అవధి 26,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 25,600 వద్ద విఫలమైతే మైనర్ బలహీనత ప్రదర్శిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయిలు 25,600, 25,500, 25,400. మూడో ప్రధాన మద్దతు స్థాయి 25,400 వద్ద కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనతగా భావించి అప్రమత్తం కావాలి.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ మాత్రం గత వారం వెయ్యి పాయింట్ల మేరకు ర్యాలీ సాధించి జీవితకాల గరిష్ఠ స్థాయి 61,170 వద్ద పటిష్ఠంగా క్లోజయింది. పాజిటివ్‌గా ప్రారంభమైతే ప్రధాన నిరోధం, మానసిక అవధి 62,000 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైనా భద్రత కోసం మద్దతు స్థాయి 61,000 వద్ద నిలదొక్కుకుని తీరాలి.

పాటర్న్: మార్కెట్ 100, 200 డీఎంఏల వద్ద నిరంతరం పరీక్ష ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఈ స్థాయిల కన్నా పైన నిలదొక్కుకోవాలి. అలాగే సానుకూలత కోసం 26,000 స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్స్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,830, 25,900
మద్దతు	25,600, 25,500

ఆచితూచి అడుగేయండి..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమ ధోరణిలో సాగే అవకాశం ఉంది. డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేయటం శుభపరిణామం అయినప్పటికీ మళ్లీ ప్రత్యేక సుంకాలను విధించటం అనిశ్చితికి దారితీసింది. మరోవైపు అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధ వాతావరణ పరిస్థితులు నెలకొనటం, ద్రవ్యోల్బణం వంటి అంశాలు సూచీలను ప్రభావితం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మదుపరులు ఎంపిక చేసిన షేర్లలో జాగ్రత్తంగా మదుపు చేయటం మంచిది. కచ్చితమైన స్టాప్‌లాస్‌ను మెయింటెయిన్ చేయాలి. లేదంటే దీర్ఘకాలిక దృక్పథంతో పెట్టుబడులు పెట్టాలి.

స్టాక్ రికమండేషన్స్

హ్యుండయ్ మోటార్స్: జీవితకాల గరిష్ఠం తర్వాత 25 శాతం మేర దిద్దుబాటుకు లోనైన ఈ కౌంటర్ తాజా ఆర్థిక ఫలితాల తర్వాత టర్న్ అరౌండ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కొన్ని రోజులుగా ఈ షేరు రూ.2,200 స్థాయిలో కన్సాలిడేటెడ్ అవుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ క్రమంగా పెరుగుతోంది. గత శుక్రవారం భారీ వాల్యూమ్‌తో రూ.2,293 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.2,280 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.2,430 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.2,220 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కెనరా బ్యాంక్: గత ఏడాది మార్చి నుంచి అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం జీవితకాల గరిష్ఠ స్థాయికి సమీపంలో కదలాడుతోంది. మూమెంటమ్ లభిస్తే దాన్ని అధిగమించి మరింత ముందుకు సాగే అవకాశం ఉంది. గరిష్ఠ స్థాయిల్లో అక్యుములేషన్ కొనసాగుతోంది. నిఫ్టీతో పోల్చితే జోరు ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం రూ.154 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.150 ఎగువన ఎంటరై రూ.225 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.144 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ: కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు ప్రస్తుతం రూ.480 మద్దతు స్థాయి వద్ద కదలాడుతోంది. తాజా ఫలితాల తర్వాత కొంత మూమెంటమ్ పెరిగింది. గత శుక్రవారం రూ.493 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.480 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.550 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.450 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎన్‌టీపీసీ: ఈ ఏడాది ఆరంభం నుంచి ఈ షేరు 17 శాతం మేర రాణించింది. గత ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు చక్కని బేస్ ఏర్పడింది. ప్రస్తుతం కీలక నిరోధ స్థాయి రూ.372కి చేరింది. దీన్ని అధిగమిస్తే లాంగ్ టర్మ్ బుల్లిష్ ట్రెండ్ మొదలవుతుంది. గత శుక్రవారం రూ.372 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.370 ఎగువన ప్రవేశించి రూ.440 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.355 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ లైఫ్: ఏడాది కాలంలో 56 శాతం రాబడిని అందించిన ఈ షేరు ప్రస్తుతం జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతోంది. స్వల్ప పుల్‌బ్యాక్ తర్వాత మళ్లీ పుంజుకున్నాయి. రిలేటివ్ స్ట్రెంత్ బాగుంది. గత శుక్రవారం రూ.2,080 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.2,050 వద్ద పొజిషన్ తీసుకుని రూ.2,200 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.2,000 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.



అంతరిక్షంలో అద్భుతాలు సృష్టించే శాస్త్రవేత్త.. వేదికపై అభినయ ముద్రలు వేసే కళాకారిణి. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాలో 'స్పేస్‌సూట్లు' డిజైన్ చేస్తూనే, తిరుమల నాదనీరాజనం వేదికపై భరతనాట్యంతో పరవశింపజేసిన డాక్టర్ కావ్య కమల్ మన్యపు స్ఫూర్తిదాయక ప్రయాణం ఇది.

నాసా శాస్త్రవేత్త.. అభినయ శారద

ప్రపంచ దేశాలను శాసించే అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాలో ఆమె ఒక మేధావి. అంగారక గ్రహంపై మానవుడు అడుగుపెట్టేందుకు అవసరమైన 'స్పేస్‌సూట్లు' తయారుచేసే కీలక బాధ్యత ఆమెది. కానీ, ఆ ప్రయోగశాల నుంచి బయటకు రాగానే ఆమె ఒక అభినయ శారద. తన పాదముద్రలతో భరతనాట్య వైభవాన్ని విశ్వవ్యాప్తం చేస్తున్న డాక్టర్ కావ్య కమల్ హైదరాబాద్ మట్టిలో పుట్టి, అమెరికా ఆకాశంలో మెరుస్తున్న ఆణిముత్యం.



కూతురి కల కోసం నాన్న త్యాగం

కావ్య విజయానికి పునాది ఆమె తండ్రి రాఘవరావు చేసిన అపురూపమైన త్యాగం. హైదరాబాద్‌లోని ఇండియన్ బ్యాంకులో మేనేజర్‌గా స్థిరమైన ఉద్యోగం చేస్తున్న ఆయన తన కూతురిలో అంతరిక్షం పట్ల ఉన్న అమితమైన ఆసక్తిని గమనించారు. చిన్నతనంలో చందమామను చూపిస్తూ తల్లి మంజుల చెప్పిన కథలు కావ్యలో శాస్త్రవేత్త కావాలనే బీజాన్ని నాటాయి. కూతురి కల నెరవేరాలంటే అమెరికా వెళ్లడం ఒక్కటే మార్గమని భావించిన రాఘవరావు 45 ఏళ్ల వయసులో సాఫ్ట్‌వేర్ కోర్సులు నేర్చుకుని, ఉద్యోగాన్ని వదిలి మరీ విదేశాలకు వెళ్లారు. అక్కడ అన్ని సౌకర్యాలు సమకూర్చుకుని కుటుంబాన్ని తీసుకెళ్లడం వెనుక ఓ తండ్రి పడిన శ్రమ కావ్యను నేడు నాసాలో అత్యున్నత స్థాయికి చేర్చింది.

విద్యా ప్రస్థానంలో విజయకేతనం

హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన కావ్య అమెరికా వెళ్లాక విద్యారంగంలో అప్రతిహత విజయాలు సాధించారు. జార్జియా టెక్ నుంచి ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో బీఎస్, ప్రతిష్ఠాత్మక ఎంఐటీ నుంచి ఎంఎస్, అనంతరం యూనివర్సిటీ ఆఫ్ నార్త్ డకోటా నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. 2006లో ప్రారంభమైన ఆమె అంతరిక్ష ప్రయాణం నేడు 19 ఏళ్ల అనుభవంతో పరిణితి చెందింది. ప్రముఖ వ్యోమగామి సునీత విలియమ్స్ ప్రయాణించిన స్టార్ లైనర్ మిషన్‌కు పనిచేసిన అనుభవం ఆమెకుంది. ప్రస్తుతం నాసా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఆర్టెమిస్' ప్రోగ్రాంలో భాగంగా చంద్రుడు, అంగారక గ్రహ యాత్రలకు వ్యోమగాములు ధరించే అత్యంత క్లిష్టమైన స్పేస్‌సూట్ల అభివృద్ధిపై ఆమె పరిశోధనలు చేస్తున్నారు. ఆమె మేధస్సుకు నిదర్శనంగా ఎనిమిది పేటెంట్లు, ముప్పైకిపైగా అంతర్జాతీయ పరిశోధన పత్రాలు ఉండటం విశేషం.

> **ముప్వల సవ్వడితో ఆధ్యాత్మిక ప్రయాణం**
>
> శాస్త్రవేత్తగా ఎంత ఎదిగినా తనలోని కళాకారిణిని కావ్య ఎన్నడూ విస్మరించలేదు. తన నానమ్మ కమలాదేవి గొప్ప గాయని కావడంతో ఆమె వద్దే నాట్యంపై ఆసక్తిని పెంచుకున్నారు. నాలుగేళ్ల వయసులో దూరదర్శన్ నృత్య ప్రదర్శనలు చూస్తూ అభినయం నేర్చుకున్న కావ్య ఆరేళ్ల వయసు నుంచి మంజుల రామస్వామి, వీఎస్ రామమూర్తి వంటి దిగ్గజాల వద్ద శిష్యరికం చేశారు. మట్టికుండలపై, ఇత్తడి ప్లేట్లపై ఆమె చేసే నాట్య ప్రదర్శనలు చూసి తల్లిదండ్రులు మురిసిపోయేవారు. అమెరికా వెళ్లాక కూడా డాక్టర్ రత్నకుమార్ వద్ద భరతనాట్యంలో డిప్లొమా పూర్తిచేసి ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా సుమారు 500కుపైగా ప్రదర్శనలు ఇచ్చారు. 1998లో అప్పటి రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ చేతుల మీదుగా 'బాలశ్రీ' అవార్డును అందుకోవడంతోపాటు రాష్ట్రపతి భవన్‌లో నాట్యం చేయడం ఆమె జీవితంలో మరపురాని ఘట్టం.

శ్రీవారి సన్నిధిలో స్వప్న సాకారం

ప్రపంచంలో ఎన్ని వేదికలపై ఆడినా తిరుమల శ్రీవారి సన్నిధిలో నాట్యం చేయాలన్నది కావ్య చిరకాల వాంఛ. ఏడేళ్ల నిరీక్షణ తర్వాత ఇటీవల నాదనీరాజనం వేదికపై ఆమె కల సాకారమైంది. తన తోటి కళాకారులు డాక్టర్ సృష్టి భూదూర్, సింధు రామచంద్రన్‌లతో కలిసి త్రిదేవ స్తుతి, బ్రహ్మకడిగిన పాదము, దశావతారం వంటి కీర్తనలకు ఆమె చేసిన నృత్యం భక్తులను ఆధ్యాత్మిక లోకంలోకి తీసుకెళ్లింది. తన ఆరేళ్ల కుమార్తె చంద్రికతో కలిసి వేదికను పంచుకోవడం తనకు దేవుడిచ్చిన వరమని ఆమె చెప్పుకొచ్చారు. భర్త చేతన్ వేముల ప్రోత్సాహంతో అటు వృత్తిని, ఇటు కళను సమన్వయం చేసుకుంటూ కావ్య సాగిస్తున్న ప్రయాణం అద్వితీయం.

పర్వతారోహణతో సామాజిక సేవ

కావ్య వ్యక్తిత్వంలో మరో కోణం ఆమెలోని సామాజిక స్పృహ. కేవలం నాసా ప్రయోగాలు, నాట్య ప్రదర్శనలకే పరిమితం కాకుండా పర్వతారోహణ ద్వారా సామాజిక సేవకు శ్రీకారం చుట్టారు. 'ప్రాజెక్ట్ సఖి' పేరుతో పేద బాలికల విద్య కోసం నిధులు సేకరిస్తూ అనేక ఎత్తైన పర్వతాలను అధిరోహించారు. వృత్తి, ప్రవృత్తి, సామాజిక బాధ్యత.. ఈ మూడింటినీ ఒకేలా ప్రేమిస్తూ ముందుకు సాగుతున్న కావ్య కమల్ ప్రతి భారతీయుడు గర్వించదగ్గ అరుదైన వ్యక్తిత్వం. భౌతిక ప్రపంచంలోని రహస్యాలను ఛేదిస్తూనే, ప్రాచీన కళా వైభవాన్ని కాపాడుతున్న ఆమె ప్రస్థానం భావితరాలకు ఒక స్ఫూర్తి మంత్రం.



నాసా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఆర్టెమిస్' ప్రోగ్రాంలో భాగంగా చంద్రుడు, అంగారక గ్రహ యాత్రలకు వ్యోమగాములు ధరించే అత్యంత క్లిష్టమైన స్పేస్‌సూట్ల అభివృద్ధిపై కావ్య పరిశోధనలు చేస్తున్నారు.

• జగదీష్ జంగం, తిరుమల

సమ్మర్ వెకేషన్స్ ప్లాన్ చేస్తున్నారా?

ఎండల వేడిమి నుంచి తప్పించుకోవడానికి చాలామంది హిల్ స్టేషన్లకు క్యూకడతారు. అయితే, ప్రయాణంలో కొన్ని జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి.



గమ్యస్థానాల ఎంపిక: ఊటీ, కొడైకెనాల్ వంటి రద్దీ ప్రదేశాల కంటే.. కాస్త ప్రశాంతంగా ఉండే అరకు, వయనాడ్ వంటి ప్రాంతాలను ఎంచుకోండి.

ఫస్ట్ ఎయిడ్ కిట్: ప్రయాణంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, గ్లూకోజ్, సన్‌స్క్రీన్‌తోపాటు తక్షణ శక్తినిచ్చే నట్స్‌ను వెంట ఉంచుకోండి.

సమయం ముఖ్యం: ప్రయాణాలను ఉదయం లేదా సాయంత్రం ప్లాన్ చేసుకోండి. మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు ఎండలో తిరగడం మానుకోండి.

తేలికపాటి లగేజ్: సాధ్యమైనంత వరకు తక్కువ లగేజ్, ఎక్కువ కాటన్ దుస్తులు తీసుకెళ్లడం వల్ల ప్రయాణం భారంగా అనిపించదు.

ఈ పండ్లే మీకు శ్రీరామ రక్ష

వేసవిలో ఆకలి కంటే దప్పిక ఎక్కువగా ఉంటుంది. కాబట్టి శరీరానికి కావాల్సిన నీటి శాతాన్ని అందించే ఆహారాన్ని ఎంచుకోవాలి.

వాటర్ కంటెంట్: పుచ్చకాయ, కర్బూజ, కీరదోస వంటి 90 శాతం నీరు ఉండే పండ్లను మీ డైట్‌లో భాగంగా చేసుకోండి.

తాటి ముంజలు: ఇవి వేసవిలో ప్రకృతి ప్రసాదించిన వరం. ఇవి కడుపులోని మంటను తగ్గించి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి.

మామిడి పండ్లు: మామిడి పండ్లను మితంగా తీసుకోండి. అతిగా తింటే శరీరంలో వేడి పెరిగే అవకాశం ఉంది.

పెరుగు అన్నం: మధ్యాహ్న భోజనంలో పెరుగు అన్నం తప్పనిసరిగా ఉండాలి. ఇది జీర్ణ వ్యవస్థను చల్లబరుస్తుంది.



రేపటి పౌరులకు ఆమె భరోసా

"అవసరంలో ఉన్నవారిని ఆదుకోవడానికి లక్షలకు లక్షలు విరాళాలే అవసరం లేదు... తమకు ఉన్నదానిలో కాస్త పంచుకోవాలనే ఆలోచన ప్రజల్లో కలిగిస్తే చాలు" అని చెప్పడమే కాదు... ఆ దిశగా కృషి చేసి మంచి ఫలితాలు కూడా సాధిస్తున్నారు మునీషా బాలమురుగన్. చెన్నైలో ఏడేళ్ల క్రితం ఆమె ప్రారంభించిన సంస్థ అట్టడుగు వర్గాలకు చెందిన వందలమంది పిల్లల ఆహార, విద్యా అవసరాలను తీరుస్తోంది. మహిళల్లో నైపుణ్యాలను మెరుగుపరిచి... వారి ఆర్థిక సుస్థిరతకు దోహదం చేస్తోంది.



'ప్రపంచంలో ఏ మార్పును నువ్వు కోరుకుంటావో... ఆ మార్పు నువ్వే కావాలి' అనే మహాత్మా గాంధీ మాటలు మునీషా బాలమురుగన్‌లో పేద ప్రజలకు తన వంతుగా ఏదైనా చేయాలనే తపనను పెంచాయి. పోస్ట్ గ్రాడ్యుయేషన్, మెడికల్, సైకియాట్రిక్ సోషల్ వర్క్‌లో స్పెషలైజేషన్ చేసిన మునీషా... తన కోర్సులో భాగంగా క్షేత్రస్థాయి సందర్శనలకు, ముఖ్యంగా గ్రామీణ బాలల కోసం నిర్వహించే శిబిరాలకు వెళ్ళేవారు. "అక్కడ నేను చూసిన సామాజిక సమస్యలు నా దృక్పథాన్ని పూర్తిగా మార్చాయి. సమాజంలో వ్యత్యాసాల తాలూకు వాస్తవికత... నేను డిప్లమా పూర్తి చేయకుండానే సామాజిక సేవలోకి తీసుకొచ్చింది" అని గుర్తు చేసుకున్నారు మునీషా.

విద్యార్థులు భాగస్వాములుగా...

అయితే ఇది అంత సులువుగా ప్రారంభం కాలేదు. ఆమె చెన్నైకి చెందిన ఒక మధ్యతరగతి కుటుంబంలో తొలి మహిళా గ్రాడ్యుయేట్. "నాకు త్వరగా వివాహం చేయాలని కుటుంబ సభ్యులు భావించేవారు. కానీ మా నాన్న నాకు నచ్చిన దారిలో వెళ్ళాలని ప్రోత్సహించారు. అనాథలు, నిరాశ్రయులు, పేదరికం కారణంగా కుటుంబానికి భారమైన, ఎవరూ పట్టించుకోని పిల్లలు ఎంతోమంది వీధుల్లో, సముద్ర తీరంలో కనిపిస్తూ ఉంటారు. వారి ఆకలి తీర్చడం, బడికి దూరమైన ఆ పిల్లలకు చదువు నేర్పించడం, వారి మానసిక ఆరోగ్యానికి దోహదం చేయడం లక్ష్యంగా 2019లో 'నామ్ విధైకాలమ్' అనే సంస్థను ప్రారంభించాను" అని చెప్పారు మునీషా. చెన్నై కేంద్రంగా పలు ప్రాంతాల్లో ఈ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. దీనికోసం వివిధ ప్రాజెక్టులకు మునీషా రూపకల్పన చేశారు. వాటిలో విద్యార్థులను ప్రధాన భాగస్వాములుగా చేశారు. వీటిలో బాగా విజయవంతమైన వాటిలో '63 ప్రాజెక్ట్' ఒకటి. దీనికోసం పాఠశాల విద్యార్థులు తమకు ఇచ్చే పాకెట్ మనీ నుంచి నెలకు 63 రూపాయలు కేటాయిస్తే... నిరాశ్రయులైన వారికి ఆహారాన్ని అందజేస్తారు. కొవిడ్ తరువాత చిన్న స్థాయిలో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఇప్పుడు వేలాదిమంది ఆకలి తీరుస్తోంది. విద్యార్థులు కూడా ఎంతో ఉత్సాహంగా దీనిలో పాలుపంచుకుంటున్నారు.



సేవలతో పాటు జీవన భద్రత

ఈ సంస్థ ఆధ్వర్యంలో ఒక కమ్యూనిటీ ట్యూషన్ సెంటర్ రోజూ నడుస్తోంది. తమ బడుల్లో పొందని నైపుణ్యాలను, విద్యాపరమైన అంశాలను పిల్లలు అందులో నేర్చుకుంటారు. స్థానిక మహిళల కోసం సమావేశాలు నిర్వహిస్తున్నారు. అక్కడ వారికి న్యాయపరమైన, ఆర్థికపరమైన, వ్యక్తిగతమైన సమస్యలకు సలహాలు, పరిష్కారాలు, సహాయం అందిస్తారు. 'నామ్ విధైకాలమ్' కార్యక్రమాల్లో ఇప్పుడు ఎన్నో సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయి. "మానసిక ఆరోగ్యంపై నేను శిక్షణ తీసుకున్నాను. మురికివాడల్లో దాని గురించి ఎవరూ పట్టించుకోరు. యువత తరచూ ఒత్తిడికి, ఆందోళనకు గురవుతుంది. వారికోసం తరచుగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాను. దీనివల్ల దాదాపు రెండువేలమంది ప్రయోజనం పొందారు. పర్యావరణ పరిరక్షణపై పౌరుల్లో అవగాహన కల్పించడానికి కూడా కార్యక్రమాలు చేపట్టాం. సంప్రదాయకమైన జానపద కళారూపాలను వీధుల్లో ప్రదర్శిస్తూ... ప్లాస్టిక్ రహితమైన జీవనం, పచ్చదనాన్ని పెంచడం గురించి ప్రచారం చేస్తున్నాం. మహిళలకు సబ్బులు, కొవ్వొత్తులు, కాగితపు సంచుల తయారీలాంటి అంశాల్లో ఇస్తున్న శిక్షణ వారు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి తోడ్పడుతోంది. యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సేవకులు లేకుండా ఇదంతా సాధ్యమయ్యేది కాదు. కేవలం సేవలు కాదు... పేద పిల్లలు, మహిళల జీవితాలకు భద్రత కల్పించడం మా లక్ష్యం. చిన్న స్థాయిలో వ్యవస్థాగతమైన మార్పుల కోసం మేము చేస్తున్న కృషి... దీర్ఘకాలంలో పెద్ద ఫలితాలను ఇస్తుందని మా ఆశ" అంటున్నారు మునీషా.

కాటన్‌తోనే అసలైన కంఫర్ట్

వేసవి ఎండల నుంచి ఉపశమనం పొందాలంటే మనం ధరించే దుస్తులే మనకు రక్షణ కవచాలు. స్టైల్ కంటే సౌకర్యానికే పెద్దపీట వేయాల్సిన సమయం ఇది.

సహజ సిద్ధమైన నూలు: ప్యూర్ కాటన్, మల్మల్, లెనిన్ వంటి వస్త్రాలు చర్మంపై గాలి ఆడేలా చేసి శరీరాన్ని చల్లగా ఉంచుతాయి.

సింథటిక్ వద్దు: నైలాన్, పాలిస్టర్ దుస్తులు చెమటను పీల్చుకోలేవు, పైగా చర్మంపై రాషెస్ (మచ్చలు) వచ్చేలా చేస్తాయి.

రంగుల ఎంపిక: తెలుపు, స్కైబ్లూ, పీచ్ వంటి లేత రంగులు వేడిని గ్రహించకుండా సూర్యరశ్మిని ప్రతిబింబిస్తాయి.



లూజ్ ఫిటింగ్: బిగుతుగా ఉండే జీన్స్ కంటే ప్లాజోలు, కాటన్ కుర్తీలు, ఫ్లోరల్ మ్యాక్సీ డ్రెస్సులు ధరిస్తే ఎండలోనూ హాయిగా ఉండొచ్చు.

మీ ఇల్లు చల్లగా ఉండాలంటే

ఏసీలు, కూలర్లు ఉన్నా సహజ సిద్ధమైన పద్ధతుల్లో ఇంటిని చల్లగా ఉంచుకోవడం వల్ల మానసిక ప్రశాంతతోపాటు విద్యుత్ కూడా ఆదా అవుతుంది.

లైట్ కర్టెన్స్: కిటికీలకు చిక్కటి రంగు తెరలు కాకుండా లేత రంగు కాటన్ తెరలు వాడితే గదిలోకి వేడి రాదు.

ఇండోర్ ప్లాంట్స్: స్నేక్‌ప్లాంట్, మనీప్లాంట్, అలోవెరా వంటివి ఇంట్లో పెంచడం వల్ల ఆక్సిజన్ పెరిగి చల్లదనం లభిస్తుంది.

వెంటిలేషన్: సాయంత్రం వేళల్లో కిటికీలు తెరిచి ఉంచడం వల్ల గాలి మారుతుంది. మధ్యాహ్నం మాత్రం కిటికీలు మూసి ఉంచడం శ్రేయస్కరం.

మట్టి కుండలు: ఫ్రిజ్ నీళ్ల కంటే మట్టి కుండలోని నీటిని తాగడం గొంతుకు, శరీరానికి ఎంతో మంచిది.



చిన్న వయసులోనే పెళ్లి. ఎన్నో ఆశలతో కాపురానికి అమెరికా వెళ్లిన ఆమె ఆనందం ఎంతో కాలం నిలవలేదు. ముగ్గురు ఆడపిల్లలను... తనను వదిలేసి... వేరే దారి చూసుకున్నాడు భర్త. ఆ బాధను భరించి... కుటుంబ భారాన్ని నెత్తికెత్తుకున్న ఆమె... నేడు ఒక ప్రపంచ శక్తిగా ఎదిగారు. పారిశ్రామికవేత్తగా అవతరించి... ఎన్‌యూఐసీసీ వ్యవస్థాపకురాలిగా... సీఈఓగా... భారత్- అమెరికా మధ్య బంధానికి బలమైన వారధిగా మారారు. ఇటీవల ముగిసిన దావోస్ సదస్సులో అందర్నీ ఆకర్షించిన డాక్టర్ పూర్ణిమా వోరియా కథ ఇది.

సంకల్పం



రాజస్థాన్ నుంచి దావోస్ దాకా

పూర్ణిమ జీవితంలో ఊహించని మలుపులు... ముంచెత్తిన ఉపద్రవాలు... ఎదురైన సవాళ్లు ఎన్నో. కానీ పడి లేచిన కెరటంలా ఆత్మవిశ్వాసం కూడగట్టుకొని... కుంగుబాటు నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు ఆమె. రాజస్థాన్ అజ్మీర్‌లోని సంప్రదాయ కుటుంబంలో పుట్టిన పూర్ణిమ... జైపూర్‌లో పెరిగారు. పద్ధెనిమిదేళ్లకే తల్లిదండ్రులు పెళ్లి చేశారు. భర్తతో కలిసి అమెరికా వెళ్లిన ఆమె తన పూర్తి సమయాన్ని కుటుంబానికే కేటాయించారు. చిన్న చిన్న ఒడుదొడుకులు మినహా కాపురం సాఫీగా సాగిపోతున్న తరుణంలో ఉన్నట్టుండి పెద్ద కుదుపు. 1992లో ఆమె భర్త తనను, తన ముగ్గురు ఆడపిల్లలను వదిలేసి వెళ్లిపోయాడు. దేశం కాని దేశం. ఆపై కుటుంబ భారం. ఎలా నెట్టుకురావాలి? ఏంచేయాలి? ఆమెకు దిక్కుతోచలేదు. "నేను, నా ముగ్గురు పిల్లలు... బతకడానికి ఏ దారీ దొరకలేదు. భారత్‌కు వచ్చేద్దామని అనుకున్నా. అయితే ఆ క్షణంలో నా కూతుళ్ల భవిష్యత్తు గుర్తుకువచ్చింది. అమెరికా పౌరులుగా వారికి లభించే అవకాశాలను చేజేతులా నాశనం చేయడం తగదని భావించాను. అందుకే రాజస్థాన్ వెళదామన్న ఆలోచన విరమించుకున్నాను" అంటూ నాటి రోజులు గుర్తు చేసుకున్న పూర్ణిమ... ఆ తరువాత చిన్న చిన్న ఉద్యోగాలు చేశారు.


రెండు గంటలే నిద్ర...

కుటుంబ భారాన్ని నెత్తికెత్తుకున్న పూర్ణిమ... తొలుత డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో పని చేశారు. అక్కడ అమెరికా వినియోగదారుల తీరు, అభిరుచులతో పాటు ప్రాథమిక వ్యాపార లావాదేవీలు అర్థం చేసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి టప్పర్‌వేర్ ఉత్పత్తులు విక్రయించారు. 'వ్యాపారం నా రక్తంలోనే ఉంది' అంటారు పూర్ణిమ. ఆమె తండ్రి రాజస్థాన్‌లో పారిశ్రామికవేత్త. ఒకే సమయంలో పలు రకాల ఉద్యోగాలు చేయడంవల్ల ఆమెకు క్షణం తీరిక దొరికేది కాదు. అమెరికాలోని కొలరాడోలో నివాసం ఉండే పూర్ణిమ... రాత్రిళ్లు కనీసం రెండు గంటలు కూడా నిద్ర పోని రోజులు ఎన్నో.

మరో మలుపు...

అవకాశం ఉన్న పనులు చేసుకొంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న పూర్ణిమ జీవితం 2000లో మరో మలుపు తీసుకుంది. వై2కే ప్రభావంతో అనేకమంది ఉద్యోగాలు కోల్పోయారు. దీంతో అవుట్ సోర్సింగ్‌పై, ముఖ్యంగా భారత్ పట్ల ప్రజల్లో ఆగ్రహం పెరుగుతోంది. ఆ ప్రతికూల పరిస్థితులను ఆమె తనకు అనుకూలంగా మలుచుకున్నారు. అందుబాటులో ఉన్న రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, విధాన రూపకర్తలను కలిశారు. తద్వారా భారత్- అమెరికా దేశాల మధ్య బలమైన వాణిజ్య బంధానికి ప్రయత్నాలు ప్రారంభించారు. అవి ఫలించాయి. యూఎస్ వాణిజ్య శాఖ ఆమెను సలహాదారుగా నియమించింది. ఆ తరువాత పదేళ్లపాటు పూర్ణిమ ఫెడరల్ ఏజెన్సీలతో కలిసి పని చేశారు. అమెరికా, భారత్ అధ్యక్ష, ప్రధానులు పాల్గొన్న అత్యున్నత స్థాయి కార్యక్రమాల్లో భాగమయ్యారు. 2014లో నాటి యూఎస్ సెక్రెటరీ ఆఫ్ కామర్స్... పెన్నీ ప్రిట్జ్‌కర్‌కు సలహాదారుగా నియమితులయ్యారు. మాజీ ఉపరాష్ట్రపతి భైరాన్‌సింగ్ షెకావత్ ప్రోత్సాహంతో పూర్ణిమ 'నేషనల్ యునైటెడ్ స్టేట్స్ ఇండియా చాంబర్ ఆఫ్ కామర్స్' (ఎన్‌యూఐసీసీ)ని నెలకొల్పారు. భారత్- అమెరికా దేశాల మధ్య వాణిజ్యాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో ఏర్పాటైన సంస్థ ఇది.

> **ప్రధానులకు ఆతిథ్యం...**
>
> అనతికాలంలోనే పూర్ణిమ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అరుదైన వ్యక్తిగా ప్రశంసలు అందుకున్నారు. అమెరికా అధ్యక్షులు, భారత ప్రధానులు పాల్గొన్న పలు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. పారిశ్రామిక దిగ్గజాలతో వేదిక పంచుకున్నారు. ఇరు దేశాల్లో పెట్టుబడుల వైపు వారిని ప్రోత్సహించారు. ఆమె సేవలకు గానూ 'కాంగ్రెషనల్ మెడల్ ఆఫ్ డిస్టింక్షన్', వాల్ స్ట్రీట్ జర్నల్ 'బిజినెస్ ఉమన్ ఆఫ్ ది ఇయర్'తో పాటు ఐక్యరాజ్య సమితి నుంచి కూడా గౌరవ పురస్కారం అందుకున్నారు. ఇటీవల స్విట్జర్లాండ్ దావోస్‌లో ముగిసిన సదస్సులో పూర్ణిమ భారత్‌తో పాటు తన సొంత రాష్ట్రం రాజస్థాన్‌కు ప్రాతినిధ్యం వహించారు. పలు కీలక అంశాలపై నిర్వహించిన చర్చలకు ప్యానల్ స్పీకర్‌గా వ్యవహరించారు. "మా అమ్మానాన్నలే నాకు ఉత్తమ ఉపాధ్యాయులు. నాన్న మిశ్రీలాల్ నగర్ స్వశక్తితో ఎదిగిన మిలియనీర్" అంటూ చెప్పుకొచ్చిన పూర్ణిమ... మహిళా శక్తికి నిలువెత్తు సాక్ష్యం.





మనమ్మాయిలే 'రైజింగ్ స్టార్స్'

రెండోసారి ఆసియా కప్ టీ20 టోర్నీ కైవసం

- తేజల్ హాఫ్ సెంచరీ
- తిప్పేసిన ప్రేమ
- 46 పరుగులతో బంగ్లాదేశ్ చిత్తు


తేజల్ (51 నాటౌట్)

బ్యాంకాక్: ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టీ20 టోర్నీని మళ్లీ భారత అమ్మాయిలే దక్కించుకున్నారు. తేజల్ హసబ్నిస్ (34 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సలతో 51 నాటౌట్) మెరుపు హాఫ్ సెంచరీకి తోడు లెగ్ స్పిన్నర్ ప్రేమా రావత్ (3/12) తిప్పేసిన వేళ ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్ 'ఎ' 46 పరుగులతో బంగ్లాదేశ్ 'ఎ'ను చిత్తు చేసింది. తొలుత భారత్ 'ఎ' 20 ఓవర్లలో 134/7 స్కోరు చేసింది. కెప్టెన్ రాధా యాదవ్ (36), దినేశ్ వ్రింద (19) కీలక ఇన్నింగ్స్ ఆడారు. స్పిన్నర్ ఫహీమా ఖాతూన్ నాలుగు వికెట్లు పడగొట్టింది. ఛేదనలో భారత బౌలర్ల ధాటికి బంగ్లాదేశ్ 'ఎ' 19.1 ఓవర్లలో 88 పరుగులకే కుప్పకూలింది. తనూజా కన్వర్, సోనియా మెంధియా చెరో రెండు వికెట్లు సాధించారు. తేజల్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది.

44/4 నుంచి..: టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ ఓ దశలో 44 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడింది. ఈ దశలో తేజల్, రాధా యాదవ్ ఐదో వికెట్‌కు 89 పరుగులు జోడించడంతో భారత్ తేరుకుని పోరాడే స్కోరు చేసింది. ఆపై ఛేదనలో భారత బౌలర్ల విజృంభణకు బంగ్లాదేశ్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. 2023లో తొలిసారి నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లోనూ బంగ్లాదేశ్‌నే ఓడించిన భారత్ విజేతగా నిలవడం విశేషం.

సంక్షిప్త స్కోర్లు

భారత్ 'ఎ': 20 ఓవర్లలో 134/7 (తేజల్ హసబ్నిస్ 51 నాటౌట్, రాధా యాదవ్ 36, దినేశ్ వ్రింద 19, ఫహీమా ఖాతూన్ 4/25)

బంగ్లాదేశ్ 'ఎ': 19.1 ఓవర్లలో 88 ఆలౌట్ (షమీమా సుల్తానా 20, సర్మిన్ సుల్తానా 18, ఫహీమా ఖాటున్ 14, ప్రేమా రావత్ 3/12, తనూజా కన్వర్ 2/11, సోనియా 2/21).

తెలంగాణ, పుదుచ్చేరి గెలుపు

దక్షిణ భారత పోలీస్ టీ-20 క్రికెట్ పోటీలు


తెలంగాణ జట్టు

విజయవాడ సిటీ (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత పోలీస్ టీ-20 క్రికెట్ పోటీల్లో తెలంగాణ, పుదుచ్చేరి జట్లు గెలుపొందాయి. మూలపాడు ఏసీఏ క్రికెట్ మైదానంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ 124 పరుగుల తేడాతో ఎన్ఎస్‌జీపై నెగ్గింది. మొదట తెలంగాణ 20 ఓవర్లలో 259/2 స్కోరు చేసింది. లోకనాథ్ నాయక్ (119) సెంచరీతో మెరవగా, హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి సీవీ ఆనంద్ 40 రన్స్ రాబట్టారు. ఛేదనలో ఎన్ఎస్‌జీ 18.3 ఓవర్లలో 135 రన్స్‌కు ఆలౌటైంది. మరో మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్‌పై 4 వికెట్లతో పుదుచ్చేరి నెగ్గింది. తొలుత రాహుల్ (141) శతకంతో రాణించడంతో ఏపీ 20 ఓవర్లలో 217/6 స్కోరు సాధించింది. ఛేదనలో ప్రభు (121) సెంచరీతో సత్తా చాటడంతో పుదుచ్చేరి 18.4 ఓవర్లలోనే 221/6 స్కోరు చేసి గెలిచింది.

నేటి మ్యాచ్ జింబాబ్వే X వెస్టిండీస్ (రా. 7 గం. నుంచి)

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా: మార్‌క్రమ్ (సి) హార్దిక్ (బి) అర్ష్‌దీప్ 4, డికాక్ (బి) బుమ్రా 6, రికెల్టన్ (సి) దూబే (బి) బుమ్రా 7, బ్రెవిస్ (సి) అభిషేక్ (బి) దూబే 45, మిల్లర్ (సి) తిలక్ (బి) వరుణ్ 63, స్టబ్స్ (నాటౌట్) 44, యాన్సెన్ (సి) రింకూ (బి) అర్ష్‌దీప్ 2, బాష్ (సి అండ్ బి) బుమ్రా 5, రబాడ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 187/7. వికెట్ల పతనం:** 1-10, 2-12, 3-20, 4-117, 5-152, 6-158, 7-167; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-28-2, బుమ్రా 4-0-15-3, వరుణ్ 4-0-47-1, సుందర్ 2-0-17-0, హార్దిక్ 4-0-45-0, దూబే 2-0-32-1.

భారత్: ఇషాన్ (సి) రికెల్టన్ (బి) మార్‌క్రమ్ 0, అభిషేక్ (సి) బాష్ (బి) యాన్సెన్ 15, తిలక్ (సి) డికాక్ (బి) యాన్సెన్ 1, సూర్యకుమార్ (సి) బ్రెవిస్ (బి) బాష్ 18, సుందర్ (సి) డికాక్ (బి) బాష్ 11, దూబే (సి) ఎన్‌గిడి (బి) యాన్సెన్ 42, హార్దిక్ (సి) స్టబ్స్ (బి) కేశవ్ 18, రింకూ (సి) స్టబ్స్ (బి) కేశవ్ 0, అర్ష్‌దీప్ (సి) స్టబ్స్ (బి) కేశవ్ 1, వరుణ్ (నాటౌట్) 0, బుమ్రా (సి) మార్‌క్రమ్ (బి) యాన్సెన్ 0; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 18.5 ఓవర్లలో 111 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-0, 2-5, 3-26, 4-43, 5-51, 6-86, 7-86, 8-88, 9-111, 10-111; **బౌలింగ్:** మార్‌క్రమ్ 1-0-5-1, యాన్సెన్ 3.5-0-22-4, రబాడ 4-0-32-0, ఎన్‌గిడి 4-0-15-0, కేశవ్ 3-0-24-3, బాష్ 3-0-12-2.


అభిషేక్ క్యాచ్‌ను అందుకుంటున్న కార్బిన్ బాష్

1
- టీ20 వరల్డ్‌కప్‌లో అత్యధిక వికెట్లు (33) తీసిన భారత బౌలర్‌గా నిలిచిన బుమ్రా. అశ్విన్ (32)ను అధిగమించాడు.
- టీ20ల్లో వరుసగా అత్యధిక ఇన్నింగ్స్‌లో (18) కనీసం ఓ వికెట్ అయినా తీసిన భారత బౌలర్‌గా వరుణ్. అర్ష్‌దీప్ (17)ను అధిగమించాడు.
- అంతర్జాతీయ టీ20ల్లో ఒకే ఓవర్‌లో మూడు క్యాచ్‌లు అందుకున్న ఏకైక ఫీల్డర్‌గా స్టబ్స్.


సూర్యకుమార్ (18)

ఒకటి కాదు.. రెండు కాదు.. ఐసీసీ ఈవెంట్లలో వరుసగా 18 మ్యాచ్‌ల్లో టీమిండియాకు ఓటమనేదే లేదు. 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ పరాభవం తర్వాత అప్రతిహతంగా సాగుతున్న ఈ విజయ పరంపరకు బ్రేక్ పడింది. ఎట్టకేలకు దక్షిణాఫ్రికా జట్టు భారత్‌పై ప్రతీకారం తీర్చుకుంది. రెండేళ్ల క్రితం టీ20 వరల్డ్‌కప్ ఫైనల్లో ఆఖరి క్షణాల్లో టైటిల్‌ను దూరం చేసిన టీమిండియాకు గట్టిగానే ఝలక్ ఇచ్చింది. మిల్లర్, బ్రెవిస్, స్టబ్స్ బ్యాటింగ్‌లో చెలరేగగా.. ఆ తర్వాత బౌలర్లు విసిరిన పంజాకు భారత బ్యాటర్లు విలవిల్లాడారు. వీరిని కట్టడి చేసేందుకు పకడ్బందీ వ్యూహంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికా అద్భుత విజయాన్నందుకుంది.

నేలకు దించారు!

భారత్ జైత్రయాత్రకు బ్రేక్

- 76 రన్స్‌తో దక్షిణాఫ్రికా ఘనవిజయం
- మిల్లర్ హాఫ్ సెంచరీ
- యాన్సెన్‌కు 4 వికెట్లు


బ్రెవిస్ (45) మిల్లర్ (63)

అహ్మదాబాద్: టీ20 వరల్డ్‌కప్‌లో అజేయంగా దూసుకెళుతున్న భారత జట్టుకు దక్షిణాఫ్రికా షాక్ ఇచ్చింది. ఆదివారం జరిగిన సూపర్-8 గ్రూప్ 1 మ్యాచ్‌లో చెలరేగిన సఫారీ బౌలర్లు మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేశారు. చెత్త బ్యాటింగ్‌తో నిరాశపర్చిన భారత జట్టులో శివమ్ దూబే (37 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 42) ఒక్కడే ఆకట్టుకున్నాడు. దీంతో ఏకంగా 76 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా ఘనవిజయాన్నందుకుంది. ముందుగా సౌతాఫ్రికా 20 ఓవర్లలో 7 వికెట్లకు 187 పరుగులు చేసింది. మిల్లర్ (35 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 63), బ్రెవిస్ (29 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 45), స్టబ్స్ (24 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 44 నాటౌట్) రాణించారు. పేసర్ బుమ్రాకు 3, అర్ష్‌దీప్‌నకు 2 వికెట్లు లభించాయి. ఛేదనలో భారత్ 18.5 ఓవర్లలో 111 పరుగులకే కుప్పకూలింది. దూబే తర్వాత హార్దిక్ పాండ్యా (18), సూర్యకుమార్ (18)లదే అత్యధిక స్కోరు. పేసర్ యాన్సెన్‌కు 4, స్పిన్నర్ కేశవ్‌కు 3, బాష్‌కు 2 వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా మిల్లర్ నిలిచాడు.

దూబే ఒక్కడే..: ఛేదనలో భారత్‌ను సఫారీ బౌలర్లు కుదురుకోనీయలేదు. దూబే మినహా మరే బ్యాటరూ కనీసం 20 పరుగులైనా చేయకపోవడం గమనార్హం. ఈసారి ఓపెనర్ ఇషాన్ డకౌట్‌గా వెనుదిరిగాడు. తొలి ఓవర్‌లోనే ఇషాన్ వికెట్‌ను మార్‌క్రమ్ తీశాడు. ఇక రెండో ఓవర్‌లో తిలక్ (1)ను యాన్సెన్ అవుట్ చేయగా.. అటు అభిషేక్ (15) హ్యాట్రిక్ డకౌట్ల నుంచి తప్పించుకుని క్రీజులో నిలిచేలా కనిపించాడు. కానీ అతడిని కూడా యాన్సెన్ వెనక్కి పంపడంతో 26 రన్స్‌కే జట్టు 3 వికెట్లు కోల్పోయింది. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుగా వచ్చిన వాషింగ్టన్ సుందర్ (11) సైతం నిరాశపర్చగా.. కెప్టెన్ సూర్య ఆదుకునే ప్రయత్నం చేసినా, తన ఇన్నింగ్స్‌లో వేగం కనిపించలేదు. పేసర్ బాష్ వరుస ఓవర్లలో ఈ ఇద్దరినీ అవుట్ చేశాడు. అయితే క్రీజులో దూబే-హార్దిక్ ఉండడంతో భారత్ విజయంపై ఆశలు వదులుకోలేదు. కానీ కట్టుదిట్టమైన బౌలింగ్ కారణంగా వీరికీ పరుగులు రాబట్టడం కష్టమైంది. ఇక ఆరు ఓవర్లలో 102 పరుగులు కావాల్సిన వేళ భారత్‌కు ఓటమి తప్పదనిపించింది. పైగా స్పిన్నర్ కేశవ్ 15వ ఓవర్‌లో హార్దిక్, రింకూ (0), అర్ష్‌దీప్ (1)ల వికెట్లు తీయడంతో జట్టు కోలుకోలేకపోయింది. చివర్లో దూబే మెరుపులు ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగాయి. 19వ ఓవర్‌లో యాన్సెన్ 2 వికెట్లు తీయడంతో భారత్ ఇన్నింగ్స్ ముగిసింది.

ఆదుకున్న మిల్లర్-బ్రెవిస్: 4, 6, 7.. భారత పేసర్ల జోరుకు దక్షిణాఫ్రికా టాప్-3 బ్యాటర్ల స్కోర్లివి. టాస్ గెలిచిన వెంటనే బ్యాటింగ్ ఎంచుకుని కెప్టెన్ మార్‌క్రమ్ తప్పు చేశాడా? అనిపించేలా వీరి ఆట సాగింది. తొలి ఓవర్‌లోనే స్వింగ్ రాబట్టిన అర్ష్‌దీప్‌తో పాటు బుమ్రా లెంగ్త్ బంతులతో సఫారీలను కట్టడి చేశారు. అయితే మిడిలార్డర్‌లో మిల్లర్, బ్రెవిస్, స్టబ్స్ మాత్రం భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొని సవాల్ విసిరే స్కోరందించారు. ఆరంభంలో పిచ్‌ను అర్థం చేసుకోకుండా భారీ షాట్లకు వెళ్లిన డికాక్ (6), మార్‌క్రమ్ (4), రికెల్టన్ (7) తొలి నాలుగు ఓవర్లలోనే పెవిలియన్ చేరారు. బుమ్రా ఒకే ఓవర్‌లో రెండు వికెట్లతో ఝలకిచ్చాడు. పరిస్థితి ఇబ్బందికరంగా మారిన వేళ మిల్లర్-బ్రెవిస్ జోడీ కాస్త ఊరటనిచ్చింది. చక్కటి టచ్‌లో ఉన్నట్టు కనిపించిన మిల్లర్ ఐదు, ఆరో ఓవర్లలో రెండేసి ఫోర్లు బాదగా పవర్‌ప్లేలో జట్టు స్కోరు 41/3కి చేరింది. ఇక వరుణ్‌ను లక్ష్యంగా చేసుకుంటూ మిల్లర్ 6, బ్రెవిస్ 4, 6తో తొమ్మిదో ఓవర్‌లో 17 రన్స్ రాబట్టారు. దూబే ఓవర్‌లో బ్రెవిస్ 4,6తో 15 రన్స్‌తో స్కోరును వేగాన్ని మరింతగా పెంచాడు. అయితే చివరికి బ్రెవిస్‌ను దూబేనే అవుట్ చేయడంతో నాలుగో వికెట్‌కు 97 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. అటు మిల్లర్ మాత్రం ఓ సిక్సర్‌తో 26 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేశాడు. డెత్ ఓవర్లలో సఫారీలు ఒక్కసారిగా తడబడ్డారు. 14-19 ఓవర్ల మధ్య 39 పరుగులే సాధించారు. 16వ ఓవర్‌లో మిల్లర్‌ను స్పిన్నర్ వరుణ్ అవుట్ చేయంతో అతడి తుఫాన్ ఇన్నింగ్స్ ముగిసింది. ఆ తర్వాత పేసర్లు అర్ష్‌దీప్, బుమ్రా టపటపా వికెట్లు తీశారు. కానీ ఆఖరి ఓవర్‌లో స్టబ్స్ ఓ ఫోర్, రెండు భారీ సిక్సర్లతో 20 రన్స్ రాబట్టడంతో సఫారీల స్కోరు 180 దాటింది.

పాయింట్ల పట్టిక

గ్రూప్-1

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	ర.రే
దక్షిణాఫ్రికా	1	1	0	0	2	3.800
భారత్	1	0	1	0	0	-3.800
వెస్టిండీస్	0	0	0	0	0	0.000
జింబాబ్వే	0	0	0	0	0	0.000

గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	ర.రే
ఇంగ్లండ్	1	1	0	0	2	2.550
న్యూజిలాండ్	1	0	0	1	1	0.000
పాకిస్థాన్	1	0	0	1	1	0.000
శ్రీలంక	1	0	1	0	0	-2.550

మ్యా: మ్యాచ్‌లు; గె: గెలుపు; ఓ: ఓటమి; ర: రద్దు; పా: పాయింట్లు; ర.రే: రన్‌రేట్


మ్యాచ్‌కు ముందు మైదానంలో వరల్డ్ కప్ ట్రోఫీతో సునీల్ గవాస్కర్, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్.



కుమారుడికి ప్రేమతో.. రూ.4 కోట్ల కారు గిఫ్ట్

ముంబై: నాలుగేళ్ల తన కుమారుడికి భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా అతి ఖరీదైన బహుమతిని అందించాడు. ప్రస్తుతం తల్లి నటాషా స్టాంకోవిచ్‌వద్దే ఉంటున్న ఐదేళ్ల అగస్త్యకు ల్యాండ్‌రోవర్ డిఫెండర్ కారును గిఫ్ట్‌గా ఇవ్వడం వైరల్‌గా మారింది. లగ్జరీ విభాగానికి చెందిన ఈ కారు ధర ఏకంగా రూ. 4 కోట్లు ఉంటుందట. స్థానిక షోరూమ్‌లో తల్లీ కొడుకు కలిసి కారు తాళాలు అందుకున్న ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. రెండేళ్ల క్రితం హార్దిక్ దంపతులు విడిపోగా.. అగస్త్య పెంపకంలో మాత్రం ఇద్దరూ రాజీ పడడం లేదు. ప్రస్తుతం కొత్త ప్రేయసి మహికా శర్మతో పాండ్యా చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్న విషయం తెలిసిందే.

లంకను పడగొట్టారు

- అదరగొట్టిన జాక్స్, ఆర్చర్
- సాల్ట్ అర్ధ శతకం
- ఇంగ్లండ్ గెలుపు



విల్ జాక్స్ (3/22)

పల్లెకెలె: విల్ జాక్స్ (21, 3/22) ఆల్‌రౌండ్ షోతోపాటు పేసర్ జోఫ్రా ఆర్చర్ (2/20) చెలరేగడంతో.. ఓ మాదిరి స్కోరును ఇంగ్లండ్ కాపాడుకొంది. ఫిల్ సాల్ట్ (62) ఒంటరి పోరాటం చేయడంతో.. టీ20 వరల్డ్‌కప్ సూపర్-8లో భాగంగా ఆదివారం జరిగిన గ్రూప్-2 మ్యాచ్‌లో ఇంగ్లండ్ 51 పరుగుల తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. తొలుత ఇంగ్లండ్ 20 ఓవర్లలో 146/9 స్కోరు చేసింది. దునిత్ వెల్లలగే మూడు వికెట్లు పడగొట్టగా.. మధుశంక, తీక్షణ చెరో రెండు వికెట్లు దక్కించుకొన్నారు. ఛేదనలో లంక 16.4 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూలింది. షనక (30) మినహా మిగతా బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. డాసన్, రషీద్ చెరో రెండు వికెట్లు తీశారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా జాక్స్ నిలిచాడు.

పెవిలియన్‌కు క్యూ..: ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే కట్టడి చేశామనే లంక ఆనందం ఎంతోసేపు నిలవలేదు. ఆర్చర్‌తోపాటు ఆఫ్ స్పిన్నర్ జాక్స్ విజృంభించడంతో పవర్‌ప్లే లోపే లంక 34/5తో ఐదు టాపార్డర్ వికెట్లు చేజార్చుకొని పీకల్లోతు కష్టాల్లో పడింది. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ నిస్సాంక (9)ను ఆర్చర్ స్వల్ప స్కోరుకే పెవిలియన్‌కు చేర్చడంతో పతనం ఆరంభమైంది. కుశాల్ మెండిస్ (4), పవన్ (0)ను జాక్స్ ఒకే ఓవర్‌లో వెనక్కిపంపగా.. ఓపెనర్ కమిల్ మిషార (6)ను ఆర్చర్ అవుట్ చేయడంతో లంక ఏమాత్రం కోలుకోలేక పోయింది. కెప్టెన్ షనక కొంతసేపు పోరాడినా.. అతడికి సహకారం అందించే వారే కరువయ్యారు.

స్పిన్ దెబ్బకు విలవిల: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్.. లంక స్పిన్నర్ల ధాటికి విలవిల్లాడింది. ఒకవైపు వికెట్లు టపటపా రాలుతున్నా.. మరో ఎండ్‌లో ఓపెనర్ సాల్ట్ క్రీజులో నిలవడంతో జట్టు పోరాడగలిగే స్కోరు చేసింది. బట్లర్ (7), బెథెల్ (3) సింగిల్ డిజిట్‌కే వెనుదిరగడంతో.. పవర్‌ప్లేలో ఇంగ్లండ్ 37/2 స్కోరు చేసింది. సాల్ట్ మాత్రం వీలుచిక్కినప్పుడల్లా షాట్లు ఆడుతూ స్కోరు బోర్డును నడిపించాడు. బాంటన్ (6) రనౌట్ కాగా.. కెప్టెన్ బ్రూక్ (14)ను వెల్లలగే ఎల్బీగా వెనక్కి పంపాడు. 13వ ఓవర్‌లో హేమంత బౌలింగ్‌లో సింగిల్‌తో సాల్ట్ ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. కర్రాన్ (11)ను చమీర, సాల్ట్‌ను వెల్లలగే వెనక్కి పంపడంతో ఇంగ్లండ్ 106/6తో కష్టాల్లో పడింది. ఈ దశలో ధాటిగా ఆడిన జాక్స్ టీమ్ స్కోరును 150 మార్క్‌కు చేరువ చేశాడు.

సంక్షిప్త స్కోర్లు

ఇంగ్లండ్: 20 ఓవర్లలో 146/9 (సాల్ట్ 62, జాక్స్ 21; వెల్లలగే 3/26, మధుశంక 2/25).

శ్రీలంక: 16.4 ఓవర్లలో 95 ఆలౌట్ (షనక 30; జాక్స్ 3/22, ఆర్చర్ 2/20).

వైభవ్ సూర్యవంశీకి రూ.50 లక్షల నజరానా

పట్నా: అండర్-19 వరల్డ్‌కప్‌లో అదరగొట్టిన వైభవ్ సూర్యవంశీ ఆదివారం బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను కలుసుకున్నాడు. ఈ సందర్భంగా మెగా టోర్నీలో విశేషంగా రాణించినందుకు 14 ఏళ్ల వైభవ్‌కు సీఎం రూ.50 లక్షల చెక్‌ను అందించారు. వైభవ్ ఆ టోర్నీలో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌తో పాటు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గానూ నిలిచాడు.

భారత సంతతి క్రికెటర్లు.. ఆ దేశాలకు పేరు తెస్తున్నారు


'మన్ కీ బాత్'లో ప్రధాని టీ20 వరల్డ్ కప్ ప్రస్తావన

న్యూఢిల్లీ: భారత సంతతి ప్రజలు ఆయా దేశాలకు గర్వ కారణంగా నిలుస్తున్నారని ప్రధాని మోదీ కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడికి వెళ్లినా..భారతీయులు తమ మూలాలకు అనుసంధానమై ఉంటున్నారని గుర్తు చేశారు. ఈక్రమంలో తాము నివసిస్తున్న దేశాల అభివృద్ధికి దోహదపడుతున్నారని తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న టీ20 ప్రపంచ కప్‌లో భారత సంతతి క్రికెటర్లు ఆయా దేశాల తరపున రాణిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. 'టీ20 వరల్డ్ కప్‌ను మీరంతా వీక్షిస్తున్నారనుకుంటా. ఆ జెర్సీ వేరే దేశానికి చెందినది. కానీ పేరు వినగానే ఆ క్రికెటర్ మన దేశానికి చెందిన వాడని అనిపిస్తుంది. ఆ సమయంలో మీ మది పులకిస్తుంది' అని ప్రధాని అన్నారు. కెనడా జట్టులో అత్యధిక సంఖ్యలో భారత సంతతి ఆటగాళ్లున్న విషయాన్ని గుర్తు చేశారు.

చిత్రజ్యోతి


★ SINCE 1965 ★

వేసవికి వస్తోన్న బంగారం



ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బేనర్‌పై సమంత ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. దిగంత్, గుల్షన్ దేవయ్య కీలకపాత్రలు పోషిస్తున్నారు. నందినీ రెడ్డి దర్శకత్వంలో రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు నిర్మిస్తున్నారు. ఆదివారం చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. మే 15న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. బలమైన భావోద్వేగాలతో పాటు ఉత్కంఠను రేపే యాక్షన్ ఎలిమెంట్స్‌ను బ్యాలెన్స్ చేస్తూ, దర్శకురాలు నందినిరెడ్డి ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కిస్తున్నారని మేకర్స్ తెలిపారు. సంగీతం: సంతోష్ నారాయణన్, సినిమాటోగ్రఫీ: ఓం ప్రకాశ్

నేను మెడ ముట్టుకుంటే తొడ కొట్టినట్టే



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. మార్చి 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం రెండో పాట 'ఆరా ఆఫ్ ఉస్తాద్'ను విడుదల చేసింది. 'నేను మెడ ముట్టుకుంటే తొడ కొట్టినట్టే' లాంటి లైన్‌లు ఆకట్టుకున్నాయి. చంద్రబోస్ సాహిత్యం అందిచగా, దేవి శ్రీ ప్రసాద్ ఈ పాటను స్వరపరిచారు. పవన్ కల్యాణ్ నుంచి ఆయన అభిమానులు కోరుకునే అన్ని అంశాలు ఈ సినిమాలో ఉంటాయి అని హరీశ్ శంకర్ అన్నారు. 'ఉస్తాద్ భగత్‌సింగ్' చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు.

ఫిల్మ్ ఫేర్ పురస్కారాల్లో 'పుష్ప2' హవా



కేరళలోని కొచ్చిలో 70వ ఫిల్మ్ ఫేర్ అవార్డుల ప్రదానోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. కేరళ టూరిజం శాఖతో కలసి ఫిల్మ్ ఫేర్ ఈ వేడుకను నిర్వహించింది. దక్షిణాది సినీ తారలు హాజరవడంతో ఈ వేడుక ప్రత్యేక శోభను సంతరించుకుంది. అల్లు అర్జున్ రాకతో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో భాగంగా 2024లో థియేటర్లలో రిలీజైన తెలుగు, తమిళ్, మలయాళ, కన్నడ చిత్రాలకు సంబంధించి.. ఉత్తమ చిత్రాలు, ఉత్తమ టెక్నీషియన్లకు పురస్కారాలు అందజేశారు. ఉత్తమ నటుడు అల్లు అర్జున్, ఉత్తమ దర్శకుడు సుకుమార్‌తో పాటు మరో నాలుగు విభాగాల్లో పుష్ప-2 అవార్డులు దక్కించుకుంది. '35 చిన్న కథ కాదు' సినిమాకు గాను నివేదా థామస్ ఉత్తమ నటి అవార్డు అందుకున్నారు.

అవార్డులు పొందిన నటులు - టెక్నీషియన్లు



- ఉత్తమ నటుడు (క్రిటిక్స్) - తేజ సజ్జా(హను-మాన్)
- ఉత్తమ నటి (క్రిటిక్స్)- కాజల్ అగర్వాల్(సత్యభామ)
- ఉత్తమ సహాయ నటుడు- అమితాబ్ బచ్చన్(కల్కి 2898 ఏడీ)
- ఉత్తమ సహాయ నటి - అంజలి(గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి)
- ఉత్తమ మ్యూజిక్ అల్బమ్- దేవిశ్రీ ప్రసాద్(పుష్ప 2: ది రూల్)
- ఉత్తమ లిరిక్స్- రామ జోగయ్య శాస్త్రి(చుట్టమల్లే - దేవర)
- ఉత్తమ గాయని- శిల్పారావు(చుట్టమల్లే - దేవర)
- ఉత్తమ నటి (డెబ్యూ)- నయన్ సారిక(గం గం గణేశ)
- ఉత్తమ నటుడు (డెబ్యూ) - సందీప్ సరోజ్(కమిటీ కుర్రోళ్లు)
- ఉత్తమ దర్శకుడు (డెబ్యూ)-యధు వంశీ(కమిటీ కుర్రోళ్లు)



'జై హనుమాన్'కు శ్రీకారం

పాన్ ఇండియా స్థాయిలో ఆదరణ పొందిన 'హను-మాన్' చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న 'జై హనుమాన్' పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. హనుమంతుని జన్మస్థలంగా భావించే హంపిలోని అంజనాద్రిలో ఆదివారం చిత్రీకరణకు శ్రీకారం చుట్టారు. టీ-సిరీస్ అధినేత భూషణ్‌కు మార్ క్లాప్ ఇవ్వగా, అనిల్ థడాని ఫస్ట్ షాట్‌కు కెమెరా స్విచ్చాన్ చేశారు. తేజా సజ్జా తొలిషాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాతలు నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ కలసి ప్రశాంత్‌వర్మకు స్క్రిప్ట్‌ను అందించారు. జాతీయ అవార్డు గ్రహీత, 'కాంతార' ఫేమ్ రిషబ్‌శెట్టి ఈ చిత్రంలో ఆంజనేయ స్వామి పాత్రలో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, టీ- సిరీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. దర్శకుడు ప్రశాంత్‌వర్మ ఈ సినిమాను అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కిస్తున్నారు. సంగీతం: ఎం.ఎం కీరవాణి. సినిమాటోగ్రఫీ: ఎస్. తిరునావుక్కరసు.

ఏకసభ్య కమిటీపై

సుప్రీంకు స్వామి!

- కోర్టు ముందుకు మరోసారి తిరుమల లడ్డూ వ్యవహారం
- నేడు విచారించనున్న సీజేఐ ధర్మాసనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారం మరోసారి సుప్రీంకోర్టు ముందుకు రానుంది. సీబీఐ సారథ్యంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇచ్చిన నివేదికపై రాష్ట్రప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్‌కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిటీని నియమించడంపై బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్యం స్వామి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన తర్వాత ఈ నెల 11న ఆయన రిట్ పిటిషన్ (సివిల్ 234/2026) వేశారు. ప్రతివాదుల జాబితాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ముఖ్యమంత్రి చంద్రబాబు, సిట్, సీబీఐ, టీటీడీలను చేర్చారు. ఈ వ్యాజ్యం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీతో కూడిన ధర్మాసనం ఎదుట సోమవారం విచారణకు రానుంది. జగన్ హయాంలో లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యిని వినియోగించారనే అభియోగాలపై సమగ్ర విచారణకు సీబీఐ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. నెయ్యి కల్తీ ఆరోపణలు వాస్తవమేనని సిట్ నెల్లూరు ఏసీబీ కోర్టులో చార్జిషీటు దాఖలుచేసింది. నెయ్యి టెండర్ల పర్యవేక్షణ, నిబంధనల సడలింపులో లోపాలు, వైఫల్యాలతోనే కల్తీ జరిగిందని రాష్ట్రప్రభుత్వానికి కూడా నివేదిక సమర్పించింది. ఈ క్రమంలో ఆ నివేదికను పరిశీలించి ఎవరెవరిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలియజేస్తూ ప్రభుత్వం ఇటీవల రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్‌కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిటీని నియమించింది. 45 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

కర్నూలులో 37 డిగ్రీలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ఆదివారం ఎండ తీవ్రత కొనసాగింది. ఆకాశం నిర్మలంగా ఉండడంతో సూర్యకిరణాలు నేరుగా భూమిని తాకుతుండంతో ఎండ ప్రభావం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. వరుసగా రెండో రోజు కూడా దేశంలోనే అత్యధికంగా కర్నూలులో 37 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని ఐఎండీ ప్రకటించింది. రాత్రి ఉష్ణోగ్రతలు కొన్ని ప్రాంతాల్లో సాధారణంగా, మరికొన్నిచోట్ల ఒకటి రెండు డిగ్రీలు ఎక్కువ లేదా తక్కువగా నమోదయ్యాయి.

కోస్తా, సీమలో వర్షాలు

నైరుతి బంగాళాఖాతంలో ఉన్న అల్పపీడనం ఆదివారం ఉదయానికి బలపడి తీవ్ర అల్పపీడనంగా మారింది. ఆ తరువాత పశ్చిమ వాయువ్యంగా పయనించి సాయంత్రానికి ఈశాన్యంగా దిశ మార్చుకుంది. రానున్న 36 గంటల్లో ఈశాన్య దిశలో పయనించి మధ్య బంగాళాఖాతం దిశగా వెళ్లనున్నది. తీవ్ర అల్పపీడనం ప్రభావంతో రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

అభివృద్ధి పరుగులు

ప్రజలందరికీ సంక్షేమం అందిస్తున్నాం: చంద్రబాబు

● ఎంత టెక్నాలజీ వచ్చినా గ్రామీణ డాక్ సేవకులు లేకపోతే గ్రామాల్లో లాజిస్టిక్ సేవలు అందించలేరు. లేఖలు, వస్తువులను చేర్చలేరు. బ్యాంకింగ్ సేవలు, బీమా సేవలు, డీబీటీ, ఈ కామర్స్ సేవలతో ఇండియా పోస్ట్ సేవలు విస్తరించాయి. - సీఎం చంద్రబాబు

● దేహానికి గుండెలాగే భారత మాతకు జీడీఎస్‌లే గుండెకాయ! ఈ దేశంలోని చిట్టచివరి ప్రాంతం వరకూ ఇండియా పోస్ట్ సేవలు అందిస్తోంది. - కేంద్ర మంత్రి సింధియా



డాక్ సేవక్ సమ్మేళన్‌లో పోస్టుఉమన్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, సీఎం చంద్రబాబు, పక్కన కేంద్ర మంత్రి పెమ్మసాని

- గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి
- ప్రజా రాజధాని అమరావతినీ పూర్తిచేసి రాష్ట్ర ప్రజలకు కానుకగా ఇస్తాం
- తపాలా సేవలకు సాటి లేదు: సీఎం చంద్రబాబు
- జీడీఎస్‌లు భారత మాతకు ఆభరణాలు
- కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడి

గుంటూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సంక్షేమాన్ని రాష్ట్ర ప్రజలందరికీ అందిస్తున్నామని.. అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రజలకు అందే సంక్షేమంలో 33 శాతం తపాలా శాఖ ద్వారానే అందుతున్నట్లు చెబుతున్నారని.. ఈ నిజాలన్నీ జనాలకు తెలియాల్సి ఉందని చెప్పారు. కేంద్ర, రాష్ట్రాలు చేసే మంచిని గ్రామీణ డాక్ సేవక్ (గ్రామీణ తపాలా సేవకులు-జీడీఎస్)లే వారికి చేర్చాలన్నారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర- 2047 లక్ష్య సాధనలో వారు భాగం కావాలని పిలుపిచ్చారు. ఆదివారం గుంటూరు శివారులో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనానికి సీఎం, కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చంద్రబాబు మాట్లాడుతూ.. టెక్నాలజీ ఎంత పెరిగినా.. ఎన్ని ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చినా జీడీఎస్‌లను మించి ఎవరూ నిర్వర్తించలేరని స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్‌సిక్స్ హామీలు సూపర్ సక్సెస్ అయ్యాయంటే అందుకు కారణం వారేనన్నారు. తపాలా సేవలకు ప్రత్యామ్నాయం లేదని తేల్చిచెప్పారు. గత ప్రభుత్వ పెద్దలు పోలవరం ప్రాజెక్టును గోదావరిలో కలిపేశారని.. కానీ తాము 2027 గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేసి జాతికి కానుకగా ఇస్తామన్నారు. 'దేవతల రాజధాని అమరావతిని శ్మశానమన్నారు. కానీ నేడది ప్రజా రాజధాని. దానిని పూర్తిచేసి రాష్ట్ర ప్రజలకు కానుకగా ఇస్తాం! కేంద్ర సహకారంతో విశాఖ స్టీల్‌ను లాభాల బాటలో పెట్టాం' అని తెలిపారు. జీడీఎస్ ఉద్యోగులకు ప్రత్యేక డ్రెస్‌కోడ్ ఇచ్చి, ప్రత్యేక గౌరవం కల్పించేందుకు సింధియా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. 'ఎన్ని యంత్రాలు వచ్చినా, కృత్రిమ మేధ ఎంత వచ్చినా.. మానవీయ స్పర్శతో పనిచేయడం సమర్థులైన జీడీఎస్‌లకే సాధ్యం. వారికి విద్యుత్ సైకిళ్లు ఇవ్వాలని సింధియా యోచించడం హర్షణీయం. ఏపీ నుంచే దానిని ప్రారంభించాలని.. రాష్ట్రంలోని 17 వేల మందికి విద్యుత్ సైకిళ్లు ఇవ్వాలని కోరుతున్నాను' అని తెలిపారు.

పాత రోజులు గుర్తొస్తున్నాయి..

'ఈ సభలో జీడీఎస్‌లను చూస్తుంటే పాత రోజులు గుర్తొస్తున్నాయి. మేం చదువుకునే రోజుల్లో పోస్టుమ్యాన్‌పైనే ఆధారపడేవాళ్లం.. ఎప్పుడు లెటర్ వస్తుందా.. మనీ ఆర్డర్ వస్తుందా అని ఎదురుచూసేవాళ్లం. ఇప్పుడు ప్రతిచేతిలో మొబైల్ సేవలు అందుబాటులో ఉన్నాయి. అయినా తపాలా శాఖకు ప్రత్యామ్నాయం లేదు' అని సీఎం చెప్పారు. రాష్ట్రంలో 9,100 పోస్టాఫీసుల్లో 17 వేల మంది జీడీఎస్‌లు సేవలు అందిస్తున్నారని తెలిపారు.

యూత్ కాంగ్రెస్ తీరును ఖండించాలి

'ప్రపంచం గర్వించదగ్గ స్థాయిలో ఢిల్లీలో ఏఐ సదస్సు జరిగింది. 80 దేశాలు పాల్గొన్నాయి. వ్యవసాయం, ఆరోగ్యం, పాడి పరిశ్రమరంగంలో మనం చేస్తున్న ఏఐ అన్వయంపై ఆ దేశాలు ఆశ్చర్యపోయాయి. అలాంటి కార్యక్రమం వద్ద దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేలా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన చేయడం సరికాదు' అని చంద్రబాబు అన్నారు. అక్కడ అర్ధనగ్న ప్రదర్శనతో దేశం పరువు తీశారని ధ్వజమెత్తారు.

భారత మాతకు జీడీఎస్‌లే గుండెకాయ: సింధియా

'తెలుగు సినిమా పుష్పలో ఒక ఫేమస్ డైలాగ్ ఉంది.. అది.. 'తగ్గేదే లే!'.. ప్రకాశం నుంచి ఢిల్లీకైనా.. తెనాలి నుంచి ముంబైకైనా, ప్రపంచ దేశాలకైనా నెల్లూరు రొయ్యలు.. గుంటూరు కారం యూరప్, యూఎస్, పశ్చిమాసియాకైనా.. ఎక్కడి నుంచి ఎక్కడికైనా.. గ్రామీణ డాక్ సేవకులు తగ్గేదే లే! ఎండ, వర్షం, చలి, మంచు కొండలు, ఏ వాతావరణం అయినా, ఏ ప్రాంతమైనా కనిపించేది గ్రామీణ డాక్ సేవకులే!' అని సింధియా అన్నారు. విజనరీ లీడర్ చంద్రబాబుతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని చెప్పారు. 'జీడీఎస్‌లు భారత మాతకు గొప్ప ఆభరణాలు. వారితో నాకు 2007నుంచీ సంబంధబాంధవ్యాలు ఉన్నాయి. అప్పుడు కేంద్ర సహాయ మంత్రిగా ఉండి, పట్టుబట్టి వారికి గొడుగు, షూ, సైకిల్ అలవెన్సులు ఏర్పాటు చేశాం. కేంద్రీయ విద్యాలయాల్లో వారి పిల్లలకు ప్రవేశాలు కల్పించాం' అని చెప్పారు. టెక్నాలజీని పోస్టల్ సేవలకు జోడిస్తామని.. సేవలను మరింత మెరుగుపరుస్తూ 'ముందుకే వెళ్తాం' అని సింధియా మరో తెలుగు పంచ్ డైలాగ్ వదిలారు. పెమ్మసాని మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 7 శాతం వృద్ధి రేటు ఉన్న సమయంలో ఏపీని దేశానికే ఆదర్శంగా నిలుపుతూ.. 14 శాతం వృద్ధి సాధించిన జీడీఎస్‌లకు శుభాకాంక్షలు తెలిపారు.

పోస్ట్‌మాస్టర్లకు సన్మానం

తొలుత చిత్తూరు, కర్నూలు, విశాఖపట్నం, కడప డివిజన్, కర్నూలు రీజియన్‌ల నుంచి 10 మంది జీడీఎస్ బ్రాంచ్ పోస్టు మాస్టర్, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లను సింధియా, చంద్రబాబు సన్మానించారు. వారికి జ్ఞాపికలు అందించారు. సింధియా ఉత్తమ సేవకులకు స్వయంగా కోట్లు తొడిగి, గుండీలుపెట్టి వారిని ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్, గళ్లా మాధవి, బి.రామాంజనేయులు, చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సింధియా.. సింధియాను సందర్శించాలి: చంద్రబాబు

సింధియా కుటుంబంతో తన అనుబంధం దశాబ్దాలుగా కొనసాగుతోందని చెప్పారు. 'రాజమాత వసుంధరరాజె సింధియాతో కలిసి పనిచేశాను. ఎన్టీఆర్ అంటే ఆమె ఎంతో అభిమానంగా ఉండేవారు. సింధియా తండ్రి మాధవరావు సింధియాతోనూ పనిచేశాను. వారిది రాజకుటుంబమైనా చాలా సాధారణ వ్యక్తిలా ఉండేవారు. వినయ సంపన్నుడు. సింధియా పూర్వీకులు వందేళ్లక్రితం షిప్ బిల్డింగ్ యూనిట్ నిర్మించిన సింధియా అనే తీర గ్రామం నేడు గాజువాకలో ఉంది. త్వరలోనే ఆ గ్రామాన్ని జ్యోతిరాదిత్య సందర్శించాలని కోరుకుంటున్నా' అని తెలిపారు. కేంద్రమంత్రి స్పందిస్తూ.. విశాఖలో ఆ ప్రదేశం ఇప్పటికీ సింధియాగా విరాజిల్లుతుండడం తమ అనుబంధానికి నిదర్శనమన్నారు.

అసెంబ్లీలో 'కల్తీ నెయ్యి'పై చర్చ!

- గత ప్రభుత్వ పాపాలను ప్రజలకు వివరించే యోచనలో సర్కారు
- ప్రజల దృష్టి మరల్చేందుకు మండలిలో వైసీపీ ఎత్తులు
- వాటికి చెక్ పెట్టేలా కల్తీనెయ్యిపై చర్చకు నిర్ణయం
- తొలుత శాసనసభలో, తర్వాత మండలిలోనూ చర్చ

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడకం అంశాన్ని శాసనసభలో చర్చకు పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కల్తీ నెయ్యి వ్యవహారం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు ఉద్దేశపూర్వకంగా హెరిటేజ్ అంశాన్ని తెరపైకి తెచ్చి మండలిలో వైసీపీ రాద్ధాంతం చేస్తోందనే అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చింది. అక్కడ తమ వాణిని బలంగా వినిపించేందుకు ప్రయత్నిస్తున్నా.. వైసీపీ సభ్యులు బలప్రయోగంతో మండలిని తప్పుదారి పట్టిస్తున్నారని ఎన్డీయే కూటమి సభ్యులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో కల్తీనెయ్యి అంశంలో ప్రజలకు వాస్తవాలను, గత ప్రభుత్వ పాపాలను తెలియజేసేందుకు శాసనసభే సరైన వేదిక అని అధికార కూటమి భావిస్తోంది. ఇప్పటికే బడ్జెట్‌పై చర్చ ముగిసినందున కల్తీ నెయ్యి అంశాన్ని కూడా సభలో చర్చకు పెట్టాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు. చెప్పులు, బూట్లు ధరించి శ్రీవారి చిత్రపటాలను పట్టుకుని మండలి వేదికగా వైసీపీ ఎమ్మెల్సీలు శ్రీవారిని కించపరిచేలా వ్యవహరించారని, ఇదేమని ప్రశ్నిస్తే పచ్చి అబద్ధాలతో ఎదురుదాడికి దిగుతున్నారని మండిపడుతున్నారు. ఇలాంటి అంశాలన్నీ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలంటే శాసనసభే సరైన వేదిక అని ప్రభుత్వం భావిస్తోంది. ముందుగా శాసనసభలో చర్చించి తర్వాత అవసరాన్ని బట్టి మండలిలోనూ చర్చించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఈ వారంలో ఏదో ఒక రోజు కల్తీ నెయ్యి అంశంపై శాసనసభలో చర్చించే అవకాశం కనిపిస్తోంది.

సీఎంను కలిసిన 'డైనమాటిక్' ప్రతినిధులు

- విమానయాన, రక్షణ ఉత్పత్తుల తయారీపై ప్రజంటేషన్



చంద్రబాబుతో భేటీ అయిన డైనమాటిక్ టెక్నాలజీస్ ప్రతినిధులు

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): డైనమాటిక్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. విమానయాన రంగం, రక్షణ ఉత్పత్తుల తయారీలో తమ సంస్థ కార్యకలాపాలపై ప్రజంటేషన్ ఇచ్చారు. ఆ సంస్థ చైర్మన్, సీఈవో ఉదయంత్ మల్హోత్రా, ఏరోస్పేస్ విభాగం ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ పి.చలపతి, డైరెక్టర్ అహిల్యా మల్హోత్రా, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆండ్రియా మిలానీ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ క్రిస్టినా లిడేగార్డ్ తదితరులు ఆదివారం సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబును కలిశారు. తమ ప్రభుత్వ విధానాలు, రక్షణ, విమానయాన రంగాల్లో పెట్టుబడులకు రాష్ట్రంలో ఉన్న అవకాశాలను ఈ సందర్భంగా సీఎం వివరించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'ఉయ్యాలవాడ'కు సీఎం నివాళి



అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సీఎం చంద్రబాబు నివాళులర్పించారు. సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉయ్యాలవాడ గొప్పతనాన్ని సీఎం స్మరించుకున్నారు.



శెట్టిబలిజ సంఘం స్థూపం ఆవిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

ఆంధ్రలోకి బీఆర్ఎస్ వస్తే తొక్కిపడేస్తాం

- తెలంగాణలో శెట్టిబలిజలకు కేసీఆర్ అన్యాయం: మంత్రి సుభాష్

అంబాజీపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ లో శెట్టిబలిజలను ఓసీల్లోకి చేర్చి గత సీఎం కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారని, ఆయన నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీ ఆంధ్రలోకి అడుగుపెడితే శెట్టిబలిజ సంఘీయులంతా తొక్కిపడేస్తామని మంత్రి వాసంశెట్టి సుభాష్ ఘాటు విమర్శలు చేశారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారం సెంటర్‌లో ఏర్పాటు చేసిన శెట్టిబలిజ సంఘం స్థూపం ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో శెట్టిబలిజలను తిరిగి బీసీల్లో చేర్చాలని అక్కడ కమిషన్‌ను కలిసి విన్నవించినట్లు పేర్కొన్నారు. పార్టీలు, పదవులు శాశ్వతం కాదని కుల ఐక్యతతో ముందుకు సాగాలని నాయకులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ శెట్టిబలిజలు అన్ని రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. తెలంగాణ శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు గుత్తుల మీరాకుమార్ మాట్లాడుతూ ఏపీలో శెట్టిబలిజలు రాజ్యాధికారాన్ని శాసించేలా అడుగులు వేయాలన్నారు. శాసనమండలి డిప్యూటీ మాజీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు ఎం.ఎం.శెట్టి, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

- ఏలూరు జిల్లా రజక మహాసభ డిమాండ్
- గతంలోనే అసెంబ్లీలో తీర్మానం: మంత్రి పార్థసారథి



మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

నూజివీడు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేలా కూటమి ప్రభుత్వం కేంద్రాన్ని ఒప్పించాలని ఏలూరు జిల్లా రజక మహాసభ విజ్ఞప్తి చేసింది. ఆదివారం ఏలూరు జిల్లా నూజివీడులో జరిగిన జిల్లా రజక ఆత్మీయ మహాసభలో పాల్గొన్న రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి ఈ మేరకు విన్నవించారు. మంత్రి పార్థసారథి మాట్లాడుతూ టీడీపీకి బీసీలతో ఉన్న అనుబంధం ఎవరూ విడదీయలేదని పేర్కొంటూ.. గతంలోనే టీడీపీ హయాంలో.. రజకులను ఎస్సీల జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు గుర్తుచేశారు. జగన్ పాలనలో బీసీలకు తీరని అన్యాయం జరగగా కూటమి పాలనలో బీసీలకు జరుగుతున్న మేళ్లను బీసీ వర్గాలు గమనించాలన్నారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షిస్తోందని, దీని వల్ల యువతకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగవుతాయన్నారు. అయితే, విధ్వంసం తప్ప అభివృద్ధి చేయడం చేతకాని జగన్ ఈ ఫలాలు మనకు దక్కనీయకుండా గోబెల్స్ ప్రచారాలు చేస్తున్న విషయాన్ని ప్రజలు గమనించి కూటమి ప్రభుత్వానికి భవిష్యత్‌లో కూడా అండగా ఉండాలని మంత్రి కోరారు.

తిరుమలలో అత్యాధునిక ఫుడ్ ల్యాబ్

(మొదటి పేజీ తరువాయి)



సురక్షితమైన, నాణ్యత కలిగిన ప్రసాదాలు, ఆహారాన్ని అందించేందుకు ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అత్యాధునిక పరికరాలు, యంత్రాలతో సిద్ధం చేస్తున్న ఈ ల్యాబ్ కార్యకలాపాలు మార్చిలో ప్రారంభమవుతాయని వెల్లడించారు. రూ.25 కోట్లతో ఏర్పాటవుతున్న ఈ ల్యాబ్‌లో స్వామి వారి ప్రసాదాల తయారీకి ఉపయోగించే నెయ్యి, జీడిపప్పు, కిస్మిస్, బాదంపప్పు, శనగలు, చక్కెర, యాలకులు, పసుపు, కారం వంటి 60 రకాల ముడిసరకులు, ప్రసాదాల నాణ్యతను పరీక్షిస్తారని చెప్పారు. ల్యాబ్ ఏర్పాటు పనులు 90 శాతం వరకు పూర్తయ్యాయని చెప్పారు. కల్తీ నెయ్యిని దృష్టిలో ఉంచుకుని ఈ ల్యాబ్‌లో ప్రత్యేకంగా "ఈ-టంగ్ అండ్ ఈ-నోస్" మిషన్లను రూ.3.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఫ్రాన్స్ నుంచి తీసుకొస్తున్న ఈ మిషన్లు నెయ్యి నాణ్యతలో అత్యంత సూక్ష్మస్థాయిలో లోపం ఉన్నా పసిగడతాయని తెలిపారు. ఈ పరికరాలు మే తర్వాత అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ ల్యాబ్ కోసం ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) రూ.25 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఆరోగ్యశాఖ, ఎఫ్ఎస్ఎస్ఏఐ మధ్య ఒప్పందం 2024 అక్టోబరు 8న ఢిల్లీలో జరిగిందని చెప్పారు. టీటీడీ అధికారులు కూడా తిరుమలలోని పిండిమిల్లు ఆవరణలోని పాత భవనాన్ని కేటాయించారన్నారు.

ల్యాబ్‌లో 200 రకాల పరీక్షలు..

ఆహార పదార్థాలు, ప్రసాదాల్లో 200 రకాల పురుగు మందుల అవశేషాలను గుర్తించే సామర్థ్యం కలిగిన యంత్రాలు ఈ ల్యాబ్ ద్వారా అందుబాటులోకి వస్తున్నాయని మంత్రి సత్యకుమార్ అన్నారు. ఈ ల్యాబ్‌లో టీటీడీ జలప్రసాదాల నమూనాలను కూడా పరీక్షిస్తారని, వీటన్నింటి కోసం మొత్తం 50 రకాల పరికరాలు ఈ ల్యాబ్‌లో ఉంటాయని చెప్పారు. ఈ ల్యాబ్ నిర్వహణ కోసం వివిధ హోదాల్లో కలిపి 40 మంది ఉద్యోగులను వైద్య ఆరోగ్యశాఖ, టీటీడీ సంఅందుబాటులోకి తీసుకువస్తున్నాయని తెలిపారు. ఈ ల్యాబ్ నిర్వహణపై వైద్య ఆరోగ్యశాఖ, టీటీడీ మధ్య త్వరలో మరో ఒప్పందం జరుగుతుందన్నారు.

ఏపీకి మేం సహకరిస్తున్నామా?

- నీళ్లపై చౌకబారు ఆరోపణలు చేయొద్దు
- తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచినవారు అలాంటి పనిచేస్తారా?: రేవంత్‌రెడ్డి

వరంగల్/హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నీళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు సహకరిస్తోందన్న బీఆర్ఎస్ నేతల ఆరోపణలను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఖండించారు. ప్రజా జీవితంలో ఉండి తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచిన వారెవరైనా ఆ పని చేస్తారా అని నిలదీశారు. ఏపీ నుంచి వలసవచ్చి ఇక్కడ సెటిలైన వ్యక్తులైనా సహకరిస్తారా అని ప్రశ్నించారు. ఇలాంటి చౌకబారు ఆరోపణలతో ప్రయోజనం ఉండదన్నారు. ఆ రాష్ట్రంలోని ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలో దేవాదుల ప్రాజెక్టును సందర్శించాక ఆయన విలేకరులతో మాట్లాడారు. గోదావరి జలాలపైనే గాక కృష్ణా జలాలపైనా అనేక అపోహలు కల్పిస్తున్నారని విమర్శించారు. పక్క రాష్ట్రానికి నీటిని తరలించడానికి తాము సహకరిస్తున్నామని అంటున్నారని తప్పుబట్టారు. 'కృష్ణా జలాలపై శాసనసభలోనే పూర్తి స్థాయి చర్చ చేపట్టాం. బహిరంగ సభలు పెట్టి ఊకదంపుడు ఉపన్యాసాలివ్వడం వద్దు. ఉమ్మడి రాష్ట్రంలో ఏం జరిగింది.. తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ హయాంలో హరీశ్‌రావు మంత్రిగా ఉన్నప్పుడు ఏం జరిగింది.. రెండేళ్లుగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు ఏం జరిగిందో చర్చించేందుకు అసెంబ్లీకి ఆహ్వానిస్తున్నాం. కృష్ణా జలాలకు సంబంధించిన అంశాలపై మొన్నటి సభలో వివరణ ఇచ్చాం. మీ తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి మాపై ఆరోపణలు చేయడం సబబు కాదు. మీరు తప్పు చేశారా లేదా అన్నది ప్రజలు గుర్తించారు.. శిక్షించారు. గోదావరి జలాలపై సభలో కూర్చుని చర్చ చేద్దాం. మేం ఏదైనా సవరించుకోవాల్సి ఉంటే అందుకు అభ్యంతరం లేదు' అని స్పష్టం చేశారు. కేసీఆర్ తెలంగాణ సమాజానికి ఉపయోగపడే మంచి పుస్తకాలు చదవాలని, చిన జీయర్‌స్వామి సూక్తులు, మంచి ప్రవచనాలు వినాలని సూచించారు. అంతేతప్ప ప్రజలపై విషం కక్కవద్దని.. తమ వారసత్వ ఆస్తిని ఎవరో కొల్లగొట్టారన్నట్లుగా కడుపులో బాధ పెట్టుకుంటే ఆరోగ్యం దెబ్బతింటుందని రేవంత్ వ్యాఖ్యానించారు.

హెరిటేజ్‌పై వైసీపీ దుష్ప్రచారం

అత్యంత నీచమైన పాపం చేసి ఎదురుదాడి.. హిందూ దేవుళ్లపై జగన్‌కు విశ్వాసం లేదు

- స్వామి ఆగ్రహానికి గురైతే వైసీపీకి భవిష్యత్తు ఉండదు
- తిరుమల ఊసెత్తే అర్హత జగన్‌కు లేదు
- టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేల ఆగ్రహం
- హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్న వైసీపీ: బొలిశెట్టి








(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

తిరుమల లడ్డూ వివాదంతో ఎటువంటి సంబంధం లేని హెరిటేజ్ కంపెనీపై వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రులు మండిపడ్డారు. మండలిలో వైసీపీ ఎమ్మెల్సీల తీరును తీవ్రంగా తప్పుపట్టారు. చెప్పులు వేసుకుని స్వామివారి పటాలను ఊరేగించి, దేవదేవుడికి అపచారం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం మంత్రులు విలేకరులతో మాట్లాడారు. మంత్రి పార్థసారథి మాట్లాడుతూ హెరిటేజ్‌పై వైసీపీ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారంపై మండిపడ్డారు. లడ్డూ విషయంలో అత్యంత నీచమైన పాపంచేసి మళ్లీ సిగ్గూ.. లజ్జా లేకుండా వైసీపీ నేతలు ఎదురుదాడి చేస్తున్నారన్నారు. అప్పటి టీటీడీ చైర్మనే లడ్డూలో కల్తీ జరిగిందని చెబుతున్నా, సీబీఐ రిపోర్టు అంటూ ప్రజల్ని తప్పుదోవ పట్టించే దుర్మార్గ ప్రచారం చేస్తున్నారన్నారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ కౌన్సిల్‌లో వైసీపీ నేతలు వ్యవహరించిన తీరును ప్రజలందరూ గమనించాలని కోరారు. హిందూమతం, హిందువుల ఆచారాలు, దేవుళ్లపై జగన్మోహన్‌రెడ్డికి ఏమాత్రం విశ్వాసంలేదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. వైసీపీ ఎమ్మెల్సీలు శాసనమండలిలో చెప్పులు వేసుకుని స్వామి చిత్రపటాలను ప్రదర్శించడం ద్వారా నీచ రాజకీయాలకు పాల్పడ్డారన్నారు. స్వామివారి చిత్రపటాలను అక్కడే చెల్లాచెదురుగా పడేసి వేంకటేశ్వరస్వామిని అవహేళన చేయడం క్షమార్హం కాదన్నారు. స్వార్థ రాజకీయాల కోసం వైసీపీ నాయకులు వేంకటేశ్వరస్వామిని వాడుకోవడం సిగ్గుచేటని మంత్రి డీఎస్‌బీవీ స్వామి మండిపడ్డారు. దేవుడితోపెట్టుకుంటే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఎమ్మెల్యేలు ఉగ్ర నరసింహారెడ్డి, దామచర్ల జనార్దన్‌తో కలిసి మంత్రి విలేకరులతో మాట్లాడారు. వైసీపీ హయాంలో జగన్ తన చిన్నాన్నను టీటీడీ చైర్మన్‌గా నియమించి అనేక అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో టీటీడీలో జరిగిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావని దుయ్యబట్టారు. వైవీ సుబ్బారెడ్డి పీఏ అప్పన్న అకౌంట్‌లోకి రూ.4.69 కోట్లు ఎలా వచ్చాయో చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. తిరుమల వేంకటేశ్వర స్వామివారి దర్శనానికి వెళితే డిక్లరేషన్ ఇవ్వాల్సి వస్తుందన్న సాకుతో.. దర్శనాన్నే మానుకున్న జగన్‌రెడ్డికి తిరుమల ఊసెత్తే అర్హత లేదని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఆయన మాట్లాడారు. అధికారం కోల్పోయిన ఈ 18 నెలల కాలంలో జగన్‌రెడ్డి ఒక్కసారి కూడా స్వామిని దర్శించుకోలేదన్నారు. స్వామి వారికి తాను చేసిన అపకారం... అపచారం గుర్తొచ్చే జగన్ దర్శనానికి వెళ్లడం లేదన్నారు. చట్టసభల్లో దేవదేవుడిని అవమానించేలా వ్యవహరించిన జగన్‌రెడ్డికి తగిన గుణపాఠం తప్పదని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేవస్థానం మాడ వీధుల్లో చెప్పులేసుకుని తిరిగిన వ్యక్తి జగన్‌రెడ్డి అన్నారు. చట్టసభల్లోకి వేంకటేశ్వరస్వామి ఫొటోలు తీసుకొచ్చి రాజకీయం చేయాలని ప్రయత్నం చేశారన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ ఐదేళ్లలో టీటీడీ నిధుల్ని తిరుపతి కార్పొరేషన్‌కు డైవర్ట్ చేసుకున్నారన్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ రాములవారి ప్రసాదానికి కూడా కల్తీ లడ్డూలే పంపించారని, ప్రధాన మంత్రికి కూడా కల్తీ లడ్డూలే పెట్టారన్నారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ జగన్‌రెడ్డి అరాచకాలు అన్నీ బయటపడటంతో తప్పించుకునేందుకు హెరిటేజ్‌పై నిందలేస్తున్నారన్నారు. హిందువుల మనోభావాలను వైసీపీ దెబ్బతీస్తున్నదని ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. నెల్లూరులో ఆదివారం జరిగిన పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవుడితో కూడా రాజకీయాలు చేసే వైసీపీ నేతల వైఖరిని ఖండిస్తున్నామన్నారు. హిందూ ధర్మానికి వ్యతిరేకంగా వైసీపీ చేసే కార్యక్రమాలను కూటమి నాయకులు ప్రజలకు తెలియజేయాలన్నారు. వైసీపీ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నదని మండిపడ్డారు.

రాష్ట్రంలో నెయ్యి కథ నడుస్తోంది

గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు



విజయనగరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో విచిత్రంగా నెయ్యిపై కథ నడుస్తోందని, స్వచ్ఛమైన పాల నుంచి నెయ్యి తయారవుతుందని అందరికీ తెలిసిందేనని, ఈ విషయం మరిచిపోయేలా గత పాలకులు వ్యవహరించారని గోవా గవర్నర్, మాన్సాస్ చైర్మన్ అశోక్ గజపతిరాజు విమర్శించారు. విజయనగరం కోటలో ఆదివారం ఆయన మాట్లాడారు. నెయ్యి సరఫరా విషయంలో గత పాలకులు అనాలోచితంగా వ్యవహరించారని ధ్వజమెత్తారు. ఆ ప్రభుత్వ హయాంలో ఎంతో మంది బాలలు బడి బయట ఉండిపోయారని, ఇందుకు కారణం ఆ ప్రభుత్వ విధానాలేనని అన్నారు. గత పాలకులు మాన్సాస్‌పై కక్ష గట్టారని, ఉద్యోగులకు జీతాలు అందని పరిస్థితి తీసుకువచ్చారన్నారు. మాన్సాస్‌కు శిస్తులు కట్టకూడదని ఆదేశాలు జారీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు మంచి విధానాలతో ముందుకు వెళితే, ఆ రాష్ట్రం, ప్రజలు బాగుంటారన్నారు. మాన్సాస్ సంస్థలు సుదీర్ఘకాలం విలువలతో కూడిన విద్యను అందించాలని, అందుకు అనుగుణంగా మంచి ప్రణాళికతో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.

బస్సుల కోసం బెంగళూరు..!



కడప-మదనపల్లె-బెంగళూరు బస్సు టాప్ ఎక్కి ప్రయాణిస్తున్న దృశ్యం

- 'ప్రజా ప్రయోజనం' పేరుతో సామాజిక మాధ్యమాల్లో పోరాటం
- ఆర్టీసీ సర్వీసులు పెంచాలంటూ డిమాండ్
- ప్రైవేటులో ప్రయాణాలపై ప్రయాణికుల్లో గుబులు
- సరిహద్దుల్లో సమస్య మరింత తీవ్రం

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

ఆర్టీసీ బస్సు సర్వీసుల కోసం చేస్తున్న ప్రజా ఉద్యమానికి సామాజిక మాధ్యమాలు వేదికగా నిలిచాయి. రాష్ట్రంలోని పలు ముఖ్యమైన ప్రాంతాల నుంచి కర్ణాటక రాజధాని బెంగళూరుకు బస్సులు నడపాలంటూ చేస్తున్న డిమాండ్ ఊపందుకుంటోంది. 'ప్రజా ప్రయోజనం' పేరుతో ఫేస్‌బుక్, ఇన్‌స్టా వేదికగా ఈ ఉద్యమం రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు పాకింది. గతంలో ఆంధ్రలోని వివిధ ప్రాంతాల నుంచి బెంగళూరుకు 25 సర్వీసుల వరకు నడిచేవి. ప్రస్తుతం ఆ సంఖ్య తొమ్మిదికి పడిపోయింది. వీటిలో ఎనిమిది విజయవాడ నుంచి కాగా, ఒకటి కాకినాడ నుంచి నడుస్తోంది. ఆర్టీసీ సర్వీసులు తగ్గిపోవడాన్ని, తగినన్ని రైళ్లు లేకపోవడాన్ని ప్రైవేటు ఆపరేటర్లు తమకు అనుకూలంగా మలుచుకున్నారు. సుమారు 40 బస్సులు ఉత్తరాంధ్ర, కోస్తాంధ్రల నుంచి నడుస్తున్నాయంటూ డిమాండ్ ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. కేఎస్ఆర్టీసీ, ఏపీఎస్ఆర్టీసీ మధ్య అంతర్రాష్ట్ర ఒప్పందం జరిగినప్పటికీ బస్సుల సంఖ్య పెరగకపోవడాన్ని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. అందుబాటులో ప్రైవేటు బస్సులు ఉన్నా... ఈ మధ్య కాలంలో వరుసగా జరుగుతున్న ప్రమాద ఘటనలు పలువురిని ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ సర్వీసుల కోసం, కొత్త రైళ్ల కోసం డిమాండ్ పెరిగింది.

సరిహద్దు జనాల కష్టం వర్ణనాతీతం

కర్ణాటక నుంచి ఏపీ సరిహద్దు జిల్లాలకు కేఎస్ఆర్టీసీ బస్సులు చాలా తక్కువ. మదనపల్లె నుంచి చింతామణి, బెంగళూరు-కడప, చింతామణి-బెంగళూరు-తిరుపతి, తిరుపతి నుంచి ఫైలర్ మదనపల్లె, చింతామణి, యలహంక, బెంగళూరు రూట్లలో రెండు రాష్ట్రాల ఆర్టీసీ బస్సుల సంఖ్య తక్కువగానే ఉంది. ఈ మార్గంలో ప్రయాణీకుల డిమాండ్ ఎక్కువ. దీంతో ప్రైవేటు బస్సులదే రాజ్యం. కడప-మదనపల్లె-బెంగళూరు రూటుతో పాటు మరికొన్ని ప్రాంతాల నుంచి బెంగళూరు వెళ్లే బస్సుల్లో ఇసుక వేస్తే రాలనంతగా జనాన్ని కుక్కేస్తారు. పై రూట్లలో ఏపీఎస్ఆర్టీసీ ప్రతి అర్ధగంటకు బస్సు నడపాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ఈ రూట్లలో బస్సులు నడిపితే ఆర్టీసీకి మంచి ఆదాయం వస్తుందని చెబుతున్నారు.



సోషల్ మీడియాలో 'ప్రజా ప్రయోజనం' పోరు పోస్టర్

ఆ పోలీసులపై క్రిమినల్ చర్యలు?

- ఎమ్మెల్సీ అనంతబాబుకు కొమ్ముకాసిన ఫలితం

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఎమ్మెల్సీ అనంతబాబుకు కొమ్ముకాసిన పోలీసు అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకునే దిశగా ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. 2022లో జరిగిన ఈ హత్యోదంతంపై అప్పటి వైసీపీ ప్రభుత్వంలోని పలువురు పోలీసు అధికారుల తీరు కేసును తాత్సారం చేసిందన్న విమర్శలతో పాటు కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా దర్యాప్తులో పురోగతి లోపించడంపై రాష్ట్ర పోలీస్ బాస్‌నే సుప్రీం కోర్టు ఆక్షేపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డీజీపీ సిఫారసులతో ప్రభుత్వం తక్షణ చర్యలకు ఉపక్రమించింది. తొలుత బాధ్యులైన అప్పటి పోలీసు అధికారులను సస్పెండ్ చేసింది. ఈ కేసులో అట్రాసిటీ చట్టం కింద కూడా నేరాభియోగాలు ఉండటంతో బాధ్యులైన పోలీసుల నిర్లక్ష్యాన్ని అదే చట్టంలోని సెక్షన్-4 కింద నేరంగా పరిగణించవచ్చన్న ప్రాసిక్యూషన్ సూచనలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. అడ్వకేట్ జనరల్‌తో పాటు ఇతర న్యాయ నిపుణుల సూచన మేరకు ఆయా పోలీసు అధికారులపై సెక్షన్-4 కింద అభియోగాలు దాఖలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

రిటైర్మెంట్ వరకూ సస్పెన్షన్‌లోనే!

- ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ సస్పెన్షన్ పొడిగింపు

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్ అధికారి పి.వి. సునీల్‌కుమార్ సస్పెన్షన్‌ను ప్రభుత్వం జూన్ 30వరకూ పొడిగించింది. ఈ నెల 24 నాటికి ఆయన సస్పెన్షన్ గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నేతృత్వంలో 18న భేటీ అయిన రివ్యూ కమిటీ ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించింది. ప్రస్తుతం నాలుగు కేసుల్లో ఆయనపై విచారణ జరుగుతున్నందున సస్పెన్షన్ ఎత్తివేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని దర్యాప్తు అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా రివ్యూ కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఆయన సస్పెన్షన్‌ను తొలగించడం సబబు కాదని ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఆయనపై ఉన్న క్రిమినల్ ప్రొసీడింగ్స్ పూర్తయ్యే వరకూ లేదా పదవీ విరమణల్లో ఏది ముందైతే అప్పటి వరకూ సస్పెన్షన్‌లో కొనసాగించాలని కమిటీ చేసిన సిఫారసులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు సీఎస్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా విదేశీ పర్యటనలకు వెళ్లారన్న అభియోగాలపై సునీల్‌కుమార్‌ను ప్రభుత్వం తొలుత 2025 మార్చి 2న సస్పెండ్ చేసింది. అప్పటి నుంచీ ఆయన సస్పెన్షన్‌లో ఉన్నారు. అగ్రిగోల్డ్ నిధుల దుర్వినియోగంతో పాటు అప్పటి వైసీపీ ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును కస్టడీలో హింసించిన కేసుల్లో సునీల్ కుమార్‌పై విచారణ కొనసాగుతోంది. వీటితో పాటు ప్రభుత్వం తీసుకున్న క్రమశిక్షణ చర్యలపై సోషల్ మీడియా వేదికగా ఆయన వ్యాఖ్యలు చేసిన అంశంపై విచారణాధికారి తన నివేదికను సమర్పించాల్సి ఉంది.

అన్నింట్లో ఆయనే!



(మొదటి పేజీ తరువాయి)

నెరవేర్చే క్రమంలో ఆయన లేఖలు దశదిశలా వ్యాపించాయి. చివరికి రాష్ట్రాన్ని కుదిపేసిన ఆర్థిక నేరాలు, కుంభకోణాలు, ఇతర మహాపచారాల్లోనూ ఆయన లేఖలు కలకలం రేపాయి. అందుకే ఇప్పుడు అన్ని చోట్లా ఆయన పేరే వినిపిస్తోంది. నాటి వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ అడ్వైజర్ హోదాలో అజేయ కల్లంరెడ్డి చేసిన పనులు రాష్ట్రాన్ని కుదిపేస్తున్న కుంభకోణాలు, కేసుల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. మొన్నటికి మొన్న.. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా కేసులో కీలక నిందితుడు, నాటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి పీఏగా పనిచేసిన చిన్నప్పన్నను ఏపీ భవన్‌లో అధికారిగా నియమించిన వ్యవహారంలో అజేయ కల్లంరెడ్డి పాత్ర వెలుగులోకి వచ్చింది. అలాగే రాష్ట్రాన్ని కుదిపేస్తున్న 3,500 కోట్ల లిక్కర్ కుంభకోణంలో కేంద్ర సర్వీసు రైల్వే ట్రాఫిక్‌లో ఉన్న వాసుదేవ రెడ్డిని, ఎక్సైజ్‌లో ఉన్న సత్యప్రసాద్‌ను బేవరేజెస్ కార్పొరేషన్‌లో నియమించడం వెనక ఆయన లేఖాస్త్రాలే పనిచేశాయని వెలుగులోకి వచ్చింది. నాటి ముఖ్యమంత్రి కార్యాలయంలోని ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు చేయలేని పనులు ప్రిన్సిపల్ అడ్వైజర్ హోదాలో అజేయ కల్లంరెడ్డి చేశారని ఇప్పుడు తేట తెల్లమవుతోంది. నాటి ముఖ్యమంత్రి జగన్ అభీష్టాన్ని నెరవేర్చడంలో ముందున్న ఆయన.. కీలక కేసుల్లో ఆయన లేఖల ప్రస్తావన వెలుగులోకి వచ్చినా ఇప్పటి వరకు విచారణ ఎదుర్కోకపోవడం గమనార్హం.

జగన్ పంచన చేరారు.. ఇక అంతే

కానీ విచిత్రం ఏమో.. రిటైర్ అయిన తర్వాత అజేయ కల్లంరెడ్డి ఒక్కసారిగా నాటి టీడీపీ ప్రభుత్వ వ్యతిరేకిగా మారారు. ఆ తర్వాత వైసీపీ అధినేత జగన్‌కు దగ్గరయ్యారు. 2019 ఎన్నికలకు వైసీపీ సన్నద్ధమయ్యే దశలో ఆ పార్టీ మ్యానిఫెస్టో రూపకల్పన కమిటీలో చోటు దక్కించుకున్నారు. 2019 మార్చి 15న జగన్ బాబాయ్ వివేకానందరెడ్డి హత్య జరిగింది. ఈ కేసును విచారించిన సీబీఐ అజేయ కల్లంరెడ్డి నుంచి విట్‌నెస్ స్టేట్‌మెంట్ తీసుకుంది. వివేకా హత్య కేసులో ఆయన ప్రస్తావన రావడానికి ఓ నేపథ్యం ఉంది. 2019 మార్చి 15న తెల్లవారుజామున జగన్ ఇంట్లో మ్యానిఫెస్టో కమిటీ సమావేశం జరుగుతున్న సమయంలోనే వివేకా హత్య సమాచారం జగన్‌కు చేరింది. సరిగ్గా ఆ సమయంలో జగన్‌తో అజేయ కల్లంరెడ్డి మీటింగ్‌లో ఉన్నారు. వివేకా హత్య గురించి జగన్‌కు ఎప్పుడు? ఎలా? తెలిసిందన్న కోణంలో ఆరా తీసిన సీబీఐ.. నాడు జగన్ వెంటే ఉన్న అజేయ కల్లం దగ్గర స్టేట్‌మెంట్ తీసుకుంది. ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆ తర్వాత సీబీఐ చార్జిషీట్ వేసినప్పుడు బయటకొచ్చింది. ఇప్పుడు ఇతర కీలక కేసుల్లో ఆయన ప్రస్తావన గురించి వెలుగులోకి వస్తోంది.

ఆ ఇద్దరినీ తీసుకురావడంలోనూ..

రాష్ట్రాన్ని కుదిపేస్తున్న లిక్కర్ కుంభకోణం కేసులోనూ ఇప్పుడు అజేయ కల్లం సిఫారసుల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఎక్కడో రైల్వే ట్రాఫిక్ సర్వీసులో ఉన్న వాసుదేవరెడ్డిని ఏపీకి డిప్యుటేషన్‌పై తీసుకొచ్చి బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా నియమించాలని నాటి ప్రభుత్వం భావించింది. అలాగే ఎక్సైజ్ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న సత్యప్రసాద్‌ను బేవరేజెస్ కార్పొరేషన్‌లో ప్రత్యేక అధికారిగా నియమించడం వెనక జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాల్లోనూ అజేయ కల్లం లేఖలు బయటకొచ్చాయి. సీఎం అభీష్టం మేరకే ఆ ఇద్దరినీ బేవరేజెస్ కార్పొరేషన్‌లో నియమించాలని నాటి సీఎస్‌కు ప్రధాన సలహాదారుగా ఆయన లేఖలు రాశారు. రూ.3,500 కోట్ల లిక్కర్ కుంభకోణంలో కుట్రదారు, పాత్రధారులైన ఏ2, ఏ3లను బేవరేజెస్ కార్పొరేషన్‌కు తీసుకురావాలనుకుంది నాటి ప్రభుత్వ పెద్దలే అయినా, వారి నియామకం వెనక పనిచేసిన లేఖలు అజేయ కల్లంవే అని సిట్ దర్యాప్తులో వెలుగుచూసింది. లిక్కర్ కుంభకోణంలో ఇంకా వెలుగుచూడని సూత్రధారులను కనిపెట్టేందుకే ఈ కేసులో ఏ2గా ఉన్న వాసుదేవరెడ్డిని సిట్ అరెస్ట్ చేసి, ఆయన్ను జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించింది.

అప్పన్న నియామకం వెనుక..

జగన్ ప్రభుత్వం వచ్చీ రాగానే.. 2019 మేలో అధికారంలోకి రాగా జూన్ 4న అజేయ కల్లంను ప్రిన్సిపల్ అడ్వైజర్‌గా నియమించారు. సీఎంగా జగన్ ప్రమాణస్వీకారం చేసిన ఐదు రోజులకే ఈ నియామకం జరిగింది. ఇక అప్పటి నుంచి 2024 జూన్ 11 వరకు ఆయన సీఎంకు ప్రధాన సలహాదారుగానే పనిచేశారు. నిజానికి అందరి ముఖ్యమంత్రుల్లాగానే జగన్‌కు కూడా సీఎంవో ఉండేది. అందులో ముఖ్య కార్యదర్శి, కార్యదర్శి స్థాయి అధికారులు ఉన్నారు. వారంతా ఐఏఎస్‌లే. కానీ జగన్ మనసెరిగిన మనిషిగా.. ఆయన అభీష్టాలు చాలా వరకు అజేయ కల్లం ద్వారానే బయటకొచ్చాయని ఇప్పుడు పలు కేసుల్లో వెల్లడైన ఆధారాలు నిరూపిస్తున్నాయి. ఇందులో మొదటిది చిన్నప్పన్న నియామకం. తిరుమల కల్తీ నెయ్యి కేసులో సీబీఐ సిట్ దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్‌లో అజేయ కల్లం పేరు ఉంది. వైవీ సుబ్బారెడ్డికి పీఏగా పనిచేసిన చిన్నప్పన్నను ఢిల్లీలోని ఏపీ భవన్‌లో స్పెషల్ లైజనింగ్ అధికారిగా నియమించాలనుకున్నారు. వైవీ సుబ్బారెడ్డినే ఇందుకు సిఫారసు చేయవచ్చు. కానీ ఆ పనిని నాటి సీఎం ప్రధాన సలహాదారు అజేయ కల్లంరెడ్డితో చేయించారు. చిన్నప్పన్నను ఏపీ భవన్‌లో స్పెషల్ లైజనింగ్ అధికారిగా నియమించాలంటూ అజేయ కల్లం నాటి చీఫ్ సెక్రటరీకి లేఖ రాశారు. ఆ తర్వాతే ఆయన్ను అక్కడ నియమించారు. ఆ తర్వాత ఇదే చిన్నప్పన్న ఢిల్లీలోని ఏపీ భవన్‌ను అడ్డాగా మార్చుకొని టీటీడీ వ్యవహారాల్లో రాచకార్యాలు నెరవేర్చారు. టీటీడీకి నెయ్యి సరఫరా చేసే కంపెనీలను బెదిరించడం, ఢిల్లీలోని ఎంపీల నివాసాలకు పిలిపించి బేరాలాడటం వంటి ఘనకార్యాలు చేశారు. సీబీఐ సిట్ దర్యాప్తులో ఈ విషయం వెల్లడైంది. అజేయ కల్లం సిఫారసుతోనే చిన్నప్పన్న ఏపీ భవన్‌కు వచ్చారని సిట్ తేటతెల్లం చేసింది. చిన్నప్పన్నను ఏపీ భవన్‌లో నియమించాలని అజేయ కల్లంను కోరిందెవరు? ఆయనకు లేఖ రాయమని చెప్పిందెవరు? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

మచ్చలేని అధికారిగా పేరు

అజేయ కల్లంరెడ్డి 1983 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. 2017 మార్చి 1నుంచి 31 వరకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి రిటైరయ్యారు. ఉమ్మడి ఏపీలో ఆయన నల్లగొండ, ఖమ్మం, పశ్చిమగోదావరి, విశాఖ జిల్లాల కలెక్టర్‌గా సేవలందించారు. దేవదాయ శాఖ కమిషనర్‌గాను సేవలందించారు. విశాఖ పోర్టు ట్రస్ట్ చైర్మన్‌గా, ప్రసిద్ధ తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) కార్యనిర్వాహణాధికారి(ఈవో)గా పనిచేశారు. కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సీఎంవో ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. రిటైర్డ్ అయ్యేవరకు అంటే.. 2017 మార్చి వరకు అజేయ కల్లంరెడ్డి సర్వీసులో ఒక్క విమర్శా లేదు. ఆయన పనితీరును వేలెత్తి చూపినవారు లేరు. టీటీడీ ఈవోగా ఆయన సేవలు, తీసుకున్న నిర్ణయాలు విమర్శకుల ప్రశంసలు అందుకున్నాయి.

క్రికెట్‌లో లోకేశ్ X మనోహర్

- ఇరు జట్లకు కెప్టెన్లుగా మంత్రులు
- రేపటి నుంచి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీలు



విజయవాడ (స్పోర్ట్స్), ఫిబ్రవరి 22(ఆంధ్ర జ్యోతి): మంగళవారం నుంచి విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శాసనసభ, శాసనమండలి సభ్యులకు క్రికెట్‌తో పాటు పలు క్రీడా పోటీలు జరగనున్నాయి. క్రికెట్ పోటీల్లో పాల్గొనే జట్లకు మంత్రులు లోకేశ్, నాదెండ్ల మనోహర్ కెప్టెన్లుగా వ్యవహరించనున్నట్టు సమాచారం. మరోవైపు ఈ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు పురుష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు మహిళా సభ్యులు సైతం ఆసక్తిగా ఉన్నారు. క్రికెట్ పోటీల్లో పాల్గొనే వారి సంఖ్య పెరిగితే మరో జట్టును ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఈ జట్టుకు ఎవరు ప్రాతినిధ్యం వహిస్తారో చూడాలి. మరో జట్టు పెరిగితే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ టీమ్ పేరుతో ఆయనే ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉందని తెలిసింది. క్రీడా పోటీల్లో గెలిచేందుకు ఇప్పటికే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రాక్టీస్ కూడా మొదలు పెట్టినట్టు సమాచారం.

మూత్రం ఆగిపోవడంతో ప్రాణం మీదకు!

- రాజమహేంద్రిలో 'అనూరియా' కలకలం
- ఇద్దరు మృతి.. ఆస్పత్రుల్లో 13 మంది
- నలుగురి పరిస్థితి విషమం
- కల్తీ పాలే కారణమని అనుమానాలు

రాజమహేంద్రవరం/కోరుకొండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో అనూరియా (మూత్రం ఆగిపోవడం) కేసులు కలకలం రేపాయి. ఆదివారం ఐదుగురు పరిస్థితి సీరియస్‌గా మారడంతో విషయం వెలుగులోకి వచ్చింది. కల్తీ పాలు తాగడం వల్ల ఇప్పటికే ఇద్దరు మృతిచెందారనే ప్రచారం జరుగుతోంది. దీంతో పాల వ్యాపారిని కోరుకొండ పోలీసులు విచారిస్తున్నారు. వివరాలివీ.. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ పరిధి లోని 50వ డివిజన్ లాలాచెరువు చౌడేశ్వరనగర్‌లో ఈనెల 16 నుంచి మూత్రం ఆగిపోవడం, కిడ్నీ సమస్య వంటి కేసులు నమో దవుతున్నాయి. బాధితులు ఇప్పటి వరకూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. ఆదివారం



కల్తీ పాలని చూపిస్తున్న స్థానికులు

ఐదుగురి పరిస్థితి సీరియస్ కావడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. కల్తీ పాలు తాగడం వల్లే ఈ పరిస్థితి వచ్చినట్టు బాధితులు చెబుతున్నారు. నాలుగు రోజుల కిందట కనకలక్ష్మి(85) మృతిచెందినా అది నమోదు కాలేదు. ఆదివారం తాడి కృష్ణవేణి(65) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ మృతిచెందింది. రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆరుగురు ఐసీయూలో ఉండగా నలుగురి పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఆస్పత్రుల్లో 13 మంది చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనపై కలెక్టర్ కీర్తి చేకూరి జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసి చౌడేశ్వర నగర్ ప్రాంతంలో సర్వే చేశారు. కోరుకొండ మండలం నరసాపురానికి చెందిన గణేశ్ అనే పాల వ్యాపారి చాలా కాలంగా వీరందరికీ పాలు అమ్ముతున్నాడు. ఈ నెల 16న విక్రయించిన పాలు చేదుగా ఉండడం.. ఆ పాలు తీసుకున్న వారికి అస్వస్థతగా ఉండడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గణేశ్‌ను కోరుకొండ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పలువురు రైతులనూ పోలీసు స్టేషన్‌కు పిలిచారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల నమూనాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపుతున్నట్టు చెప్పారు. మునిసిపల్ అధికారులు మంచినీటి పరీక్షలు నిర్వహించారు. కానీ పాలలో కూడా యూరియా, ఇతర పిండి పదార్థాలు కలుపుతున్నారనే ప్రచారం చాన్నాళ్లుగా ఉంది. ఫుడ్ సేఫ్టీ అధికారులు పట్టించుకున్న దాఖలు లేవు.



సభలో మాట్లాడుతున్న బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్

బీసీ రక్షణ చట్టం అమలు చేయాలి

- మార్చి 31లోగా 5 అంశాలను నెరవేర్చాలి
- లేకుంటే ఏప్రిల్ 11న నిరాహార దీక్ష
- బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్

పెదకాకాని, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు సంబంధించిన ఐదు అంశాలను మార్చి 31లోగా నెరవేర్చాలని, లేకుంటే ఏప్రిల్ 11న జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా విజయవాడలో ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ తెలిపారు. గుంటూరు జిల్లాలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎదుట గల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన 'బీసీ సింహగర్జన' సభలో ఆయన మాట్లాడారు. బీసీ రక్షణ చట్టం తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జగన్ హయాంలో దాడులు జరిగాయని చెప్పి, ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చి 20 నెలలైనా రక్షణ చట్టం చేయలేదన్నారు. రాజధానిలో బీసీలకు వెయ్యి ఎకరాలు కేటాయించాలన్నారు. హైదరాబాద్‌లో జరిగిన అన్యాయం అమరావతిలో జరగనివ్వమని, ఇది భిక్ష కాదు, బీసీల హక్కు అన్నారు. సమగ్ర కులగణన జరపాలని, తమ జనాభా ఎంతో తేల్చి, తమ రిజర్వేషన్లు తమకు ఇవ్వాలని, బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. 1983లో టీడీపీ హామీ ప్రకారం, చట్టసభల్లో బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని సూచించారు. బీసీ కార్పొరేషన్లకు వెంటనే నిధులు కేటాయించాలన్నారు. పేరుకే పదవులు ఇచ్చి, నిధులు ఇవ్వకుండా మోసం చేయడం ఆపాలన్నారు. 'ఈ ఐదు డిమాండ్లను నెరవేర్చడానికి ప్రభుత్వానికి 30 రోజులు సమయం ఇస్తున్నాను. లేనిపక్షంలో ఏప్రిల్ 11న పూలే జయంతి రోజున విజయవాడలో ఆమరణ నిరాహార దీక్షకు దిగుతా. ఇది మరో కురుక్షేత్రానికి నాంది' అని అని రామచంద్రయాదవ్ హెచ్చరించారు.

రచయిత బొగ్గుల శ్రీనివాస్‌ది హత్యే

- ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో స్నేహితుడే బలి తీసుకున్నాడు
- రూ.5 లక్షల సుపారీ ఇచ్చి హత్య
- యూట్యూబర్ మృతి కేసులో వీడిన మిస్టరీ
- నలుగురు నిందితుల అరెస్ట్



కూసుమంచి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రచయిత, యూట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్(36) మరణంలో మిస్టరీ వీడింది. బొగ్గుల శ్రీనివాస్ ప్రమాదవశాత్తు మరణించలేదు.. ఆర్థిక వివాదాల నేపథ్యంలో శ్రీనివాస్‌ను అతని స్నేహితుడే హత్య చేయించాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటకు చెందిన ఓ ముఠా రూ.5లక్షలు తీసుకొని శ్రీనివాస్‌ను కత్తులతో పొడిచి, రాడ్లతో కొట్టి చంపేసింది. ఇందుకు సంబంధించి నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు కేసుకు సంబంధించిన వివరాలను ఆదివారం విలేకరులకు వెల్లడించారు. ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు జలాశయంలో ఫిబ్రవరి 14న ఓ కారు బోల్తాపడిందని స్థానికులిచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఆ కారును బయటకు తీయించారు. ఆ కారులో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామానికి చెందిన బొగ్గుల శ్రీనివాస్‌గా గుర్తించారు. మృతదేహం కారు వెనుక సీట్లో ఉండడం, శరీరంపై గాయాలు కనిపించడం, ప్రమాద సమయంలో ఓ వ్యక్తి పరారయ్యాడన్న సమాచారంతో అనుమానించిన పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు.

ఆర్థిక లావాదేవీల వల్లే హత్య

గొల్ల అలియాస్ బొగ్గుల శ్రీనివాస్ రచయితగా, యూట్యూబర్‌గా చాలా గుర్తింపు పొందాడు. శ్రీనివాస్‌తో పాటు మేకల వేణుమాధవ్‌రెడ్డి అనే వ్యక్తి హైదరాబాద్ సిల్వర్ జూబ్లీ కళాశాలలో చదువుకున్నారు. వేణుమాధవ్‌రెడ్డి.. మేకా ప్రాజెక్ట్స్ అనే కంపెనీ పెట్టి సబ్‌కాంట్రాక్ట్ పనులు చేస్తున్నాడు. కొంత కాలం క్రితం జరిగిన కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో వీరిద్దరూ తిరిగి కలుసుకున్నారు. తనకు బొగ్గుల బీబీక్యూ పేరిట జీఎస్టీ లైసెన్స్ ఉందని శ్రీనివాస్ తన స్నేహితుడు వేణుమాధవ్‌కు చెప్పాడు. బొగ్గుల బీబీక్యూ పేరు మీద నకిలీ ఇన్‌వాయిస్‌లు, సేల్స్ ఫైల్స్ చేసి లాభాలు పొందవచ్చని వేణుమాధవ్ ఈ సందర్భంగా శ్రీనివాస్‌కు చెప్పాడు. వచ్చిన లాభాల్లో తనకు 50 శాతం వాటా ఇస్తే ఈ పనికి తాను సిద్ధమని శ్రీనివాస్ షరతు పెట్టాడు. ఇందుకు ఇరువురు అంగీకరించగా 2022-25వరకు జీఎస్టీ ఫైలింగ్‌తో రూ.90లక్షల వరకు సంపాదించారు. అందులో శ్రీనివాస్ వాటాగా రూ.45లక్షలు రావాల్సి ఉండగా.. వేణుమాధవ్‌రెడ్డి రూ.15లక్షలు మాత్రమే ఇచ్చాడు. ఆర్థిక ఇబ్బందులున్నాయని, మిగిలిన మొత్తాన్ని కొన్ని రోజుల తర్వాత ఇస్తానని చెప్పాడు. ఈ క్రమంలో జీఎస్టీ అవకతవకలకు సంబంధించి వేణుమాధవ్, శ్రీనివాస్‌కు జీఎస్టీ శాఖ నుంచి నోటీసులు అందాయి. బొగ్గుల బీబీక్యూ లైసెన్స్‌ను జీఎస్టీ అధికారులు బ్లాక్‌లిస్టులో పెట్టారు. దీంతో శ్రీనివాస్ తనకు చెల్లించాల్సిన రూ.30లక్షలు ఇవ్వాలని, బ్లాక్‌లిస్టులో ఉన్న జీఎస్టీ లైసెన్స్‌ను యాక్టివేట్ చేయించాలని వేణుమాధవ్‌రెడ్డిని అడిగాడు. లైసెన్స్ పునరుద్ధరణకు ప్రయత్నించగా.. వారు చేసిన అవకతవకలకు గాను రూ.కోటి వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. దాంతో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. శ్రీనివాస్‌కు రూ.30లక్షలు ఇవ్వాల్సి ఉండటం, లైసెన్స్ యాక్టివేట్ కోసం జరిమానా చెల్లించాలనడం, ఇతరత్రా ఆర్థిక భారాలతో సతమతమైన వేణుమాధవ్‌రెడ్డి.. శ్రీనివాస్‌ను అడ్డుతొలగించుకుంటే సమస్యలు పరిష్కారమవుతాయని భావించాడు. శ్రీనివాస్‌ను హత్య చేయించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటకు చెందిన పోకల కోటేశ్వరరావు, షేక్ అబ్దుల్ హఫీజ్, మహ్మద్ అలీఖాన్‌కు సుపారీగా రూ.5లక్షలు చెల్లించాడు.

డబ్బిస్తానని నమ్మించి తీసుకెళ్లి..

ఆ తర్వాత పథకం ప్రకారం బకాయి డబ్బు ఇస్తానంటూ శ్రీనివాస్‌ను నమ్మించిన వేణుమాధవ్‌రెడ్డి.. డబ్బు కోసం విజయవాడ వెళదామని చెప్పి ఈనెల 13తేదీ రాత్రి శ్రీనివాస్‌ను హైదరాబాద్ నుంచి కారులో తీసుకెళ్లాడు. అప్పటికే ఆ కారులో సుపారీ గ్యాంగ్ కూడా ఉంది. అయితే, 14వ తేదీ తెల్లవారుజామున కారును నకిరేకల్ నుంచి జనగామ వెళ్లే రహదారి వైపు మళ్లించి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లారు. అక్కడ శ్రీనివాస్‌పై కత్తులు, రాడ్లతో దాడిచేసి హత్య చేశారు. అనంతరం ప్రమాదంగా చిత్రీకరించాలని కారును నిందితుల్లో ఒకరైన అజ్మత్ అలీఖాన్‌కు ఇచ్చి ఖమ్మం వైపు పంపారు. కారు వెనుక సీట్లో శ్రీనివాస్ మృతదేహం ఉండగా.. అజ్మత్ కారును పాలేరు జలాశయంలో దూకించాడు. అనంతరం కారులో నుంచి దూకి పరారయ్యాడు. ఈ క్రమంలో అజ్మత్ కాళ్లకు గాయాలయ్యాయి. అయితే, మృతదేహం పరిస్థితి, ఘటనాస్థలం నుంచి ఓ వ్యక్తి పరారయ్యాడనే సమాచారంతో కేసు దర్యాప్తు చేసిన పోలీసులు.. సీసీ ఫుటేజీలు, ఫోన్‌కాల్ సిగ్నల్స్, ఇతర ఆధారాల ప్రకారం శ్రీనివాస్‌ది సుపారీ హత్యగా తేల్చారు. నలుగురు నిందితులను విచారించగా నేరం అంగీకరించారు. నిందితులను న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.